ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి  గాయత్రి



ప్రఖర ప్రజ్ఞ

ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

సజల శ్రద్ధ


**సంకల్పం - సంరక్షణ**

వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత

**శ్రీరామ శర్మ ఆచార్య**

శక్తి స్వరూపిణి

**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు

**డాక్టర్ ప్రణవ్ పండ్యా**

సంపాదక వర్గం

**డా॥ యం.రామకృష్ణ**

**డా॥ తుమ్మూరి**

**కందర్ప రామచంద్ర రావు**

**కె.బి.సోమయాజులు**

**జి.సత్యవాణి**

**అశ్విని సుబ్బారావు**

**సంపుటి 4 సంచిక 9**

**డిసెంబర్ 2003**

**విడిప్రతి రూ॥ 8.00**

**సం॥ చందా రూ॥ 85**

**3సం॥ చందా రూ॥ 250**

**10 సం॥ చందా రూ॥ 750**


## ఆత్మవిశ్వాస సాధన

జీవితాన్ని స్వేచ్ఛగా, నిర్నిబంధంగా సంసార సాగర తరంగాలలో ప్రవహించనివ్వండి. ఒకోసారి ఆ తరంగాలు మీమీదనుండి వెళ్లిపోతాయి. ఒకోసారి మీరు ఆ తరంగాలమీద నిలచిఉంటారు. అయినా - సముద్రపు ఒడిలో సముద్ర తరంగాలతో ఆడుకునే సాహసం మీలో మేలుకొంటుంది. ఆత్మవిశ్వాసం మీలో మేలుకొంటుంది. ఒంటరితనానికి భయపడికాని, నీళ్లలో మునిగిపోతానని భయపడి కాని - నీళ్లలోకి దిగనే దిగని వ్యక్తి, ఏమి చేయాలి? ఎలా చేయాలి? నేను గమ్యాన్ని ఎలా చేరతాను? అనే మీమాంసలో, దీర్ఘాలోచనలో మునిగిపోయిన వ్యక్తి, ప్రపంచంలో దేన్నీ సాధించలేడు. అతడి విశ్వాసం చచ్చిపోతుంది. ఏదయినా పనిలో నిమగ్నం కావడానికి ముందు అర్ధమనస్కంగా ఉండే వ్యక్తి, అనుమానంలో కూరుకుపోయిన వ్యక్తి గొప్పపని ఏదీ సాధించలేడు. అతడు ఏపని చేసినా అందులో సాఫల్యం పొందలేడు. అందువల్ల అతడిలో ఇంకా మిగిలి ఉన్న విశ్వాసం కాస్తా చచ్చిపోతుంది.

ఆత్మవిశ్వాసపు జ్యోతి ఎల్లవేళలా వెలుగుతూ ఉండేటట్లు చేయాలంటే - మీకు శ్రేయస్కరమని అనిపించిన పనిలో ప్రాణాలు ఒడ్డి నిమగ్నులు కండి. మీకు నచ్చిన, మీరు మెచ్చిన పనిని మీ జీవితంలోని, మీ స్వభావంలోని అంతర్భాగంగా తయారుచేయండి. ఇందువల్ల మీ విశ్వాసానికి బలం చేకూరుతుంది. అయితే ఇందులో ఒక ప్రమాదం ఉంది- సాఫల్య వైఫల్యాలవల్ల మీరు మీ సమతూకాన్ని కోల్పోవడం. కనుక, మీరు సాఫల్య వైఫల్యాలను గడ్డిపోచలుగా పరిగణించాలి. పనికే పెద్దపీట వేయాలి. కర్మ చేయడం అనే ఈ నిరంతర సాధనవల్ల మీలో విశ్వాసం పాతాళ గంగలా ఎడతెరిపి లేకుండా ఉప్పొంగుతుంది. తమను తాము అదృష్టవంతులుగా, మహత్తర వ్యక్తులుగా పరిగణించుకునేవారికి ప్రపంచం కూడా దారి వదులుతుంది. ఏదో ఒక మహత్తర లక్ష్యాన్ని సాధించడానికే మీరు ఈ భూమిమీదకు పంపబడ్డారనే భావనను మీ గుండె నిండా నింపుకోండి. మీరు తప్పకుండా ఆ పని చేస్తారు. అక్షయమైన ఈ శ్రద్ధ మిమ్మల్ని గొప్పవాళ్లను చేస్తుంది. ఇలాంటి ఒక మహోన్నత ఆదర్శాన్ని, ఒక మహా సంస్థను మీ శ్రద్ధకు కేంద్రంగా స్వీకరించండి. బలీయమైన ఇలాంటి శ్రద్ధ మీ విశ్వాసాన్ని పెంచి పోషిస్తుంది. ఏ ఆదర్శమూ లేని వ్యక్తిలో, ఏ శ్రద్ధా కేంద్రమూ లేని వ్యక్తిలో విశ్వాసం చచ్చిపోతుంది.

సమాజానికీ, ప్రపంచానికీ, కుటుంబానికీ, ఇరుగుపొరుగులకూ, జాతికీ, ఏదైనా మహా కార్యానికీ సంబంధించిన ఎలాంటి బాధ్యత మీకు అందినా - దానిని ఆనందంగా స్వీకరించండి. బాధ్యతలను తమ భుజాలపై మోయాలనే సంకల్పమే విశ్వాస సాధనలో సగం పని పూర్తి చేస్తుంది. గుర్తుంచుకోండి - ఈ ప్రపంచంలో మీరు చేయలేని పని ఏదీ లేదు. మరి, బాధ్యతలంటే ఎందుకు భయపడతారు, ఎందుకు సంకోచిస్తారు, ఎందుకు వెనుకాడతారు? బాధ్యతలను నిర్వహించడం నేర్చుకోండి. పని చేయడంద్వారానే మీలో కార్యశూరత పెరుగుతుంది, మీ శక్తులపై మీకు విశ్వాసం పెరుగుతుంది.

జనం చేసే విమర్శలకు ఏమాత్రం చలించకుండా పనిచేస్తూ ఉండండి. నిర్భయంగా మీ ఆదర్శాలను అమలు చేస్తూ ముందడుగు వేయండి. అదే మీకు శోభ నిస్తుంది. ఆశతో నిండిన రంగురంగుల జీవిత చిత్రాన్ని మీ కల్పనల ఫలకంపై చిత్రించండి. గుర్తుంచుకోండి - ఆత్మవిశ్వాస సాధన ద్వారా సృష్టిలోని వైభవాన్నే కాక, సృష్టికర్త ప్రేమనుకూడా అక్షయంగా పొందవచ్చు.

**వ్యక్తిలోని సంవేదనను సంస్కరించే విద్య - ధర్మం.**

# విషయ సూచిక

**ముఖ చిత్రం : గురునానక్,**
గురునానక్ జయంతి సందర్భంగా.


1. **సంపాదకీయం :**
ఆత్మవిశ్వాస సాధన 1
2. **విషయ సూచిక** 2
3. **వేదమంత్రం** 3
4. **ముఖచిత్ర కథనం :**
జ్ఞాన కర్మ ఉపాసనల త్రివేణీ సంగమం భగవద్గీత 4
5. **బోధ కథ :**
రెండు సుఖాలూ సున్నాయే 7
6. **కుటుంబ నిర్మాణం : గృహస్థ యోగం**
సంసారానికీ, వైరాగ్యానికీ అద్భుత సమన్వయం 8
7. **మనం - మన ఆరోగ్యం :**
కృత్రిమ జీవన విధానమే కేన్సరుకు మూలం 11
8. **వ్యక్తి నిర్మాణం :**
పారిపోకు - పోరాడి జయించు 12
9. **సాధన విజ్ఞానం**
అస్తికత్వ, ఉపాసనల ఆంతర్యం 13
10. **బోధ కథ :**
శరీర సౌందర్యంకన్న శీల సౌందర్యం మిన్న 15
11. **శతసూత్ర కార్యక్రమం : 11-20**
ఆరోగ్యాభివృద్ధికి సామూహిక కృషి 17
12. **సమాజ నిర్మాణం :**
సామూహిక కర్మఫల వ్యవస్థ 19
13. **యుగ గీత :**
ఆత్మను ఆహుతిగా ఇవ్వడమే యజ్ఞం 21
14. **మాతాజీ దివ్య జీవనం : 2**
బాల్య లీలలు 22
15. **బోధకథ :**
వీరవ్రతధారి జతీన్ 25
16. **కృష్ణావతారం - 13 :**
అక్రూరుని దౌత్యం 28
17. **గురుదేవుల అమృతవాణి**
మంచిని, మానవత్వాన్ని పెంచుదాం 29
18. **వ్యక్తి నిర్మాణం :**
శిష్టాచారంలో ఇమిడి ఉంది సభ్యత 35
19. **మహిళా జాగరణ**
మహిళ వాత్సల్యమూర్తి, మహిమాన్విత 38
20. **సాధుసంత్‌ల జీవితాలు :**
పద్మావతీ చరణ చారణ చక్రవర్తి 40
21. **గాయత్రీ మంత్రం :**
సవితా దేవతతో కలిపే టెక్నాలజీ 44
22. **మన సాంస్కృతిక వారసత్వం :**
విశ్వమంతటా విస్తరించిన వేద విజ్ఞానం 46
23. **వార్తలు** 48


## డిసెంబర్ నెలలో పర్వదినాలు

4 గీతా జయంతి.
8 దత్తాత్రేయ జయంతి.
17 ధనుర్మాస ఆరంభం.
22 శారదామాత జయంతి.
23 స్వామి శ్రద్ధానంద జయంతి.
25 మదనమోహన్ మాలవ్యా జయంతి.

## 2004 జనవరిలో పర్వదినాలు

3 ముక్కోటి ఏకాదశి.
12 వివేకానంద జయంతి
15 సంక్రాంతి.
22 సుభాష్ చంద్రబోస్ జయంతి.
26 రిపబ్లిక్ దినోత్సవం, శ్రీ పంచమి,
మార్కండేయ జయంతి.
27 సుబ్రహ్మణ్య షష్ఠి.
28 రథ సప్తమి.

**దేవత మరొకరి ప్రతిబింబం కాదు. ఒక గుణానికి కాని, శక్తికి కాని చిహ్నం.**

# వేద మంత్రం

**నరాశం సః సుషాదతీయం యజ్ఞమదాభ్యః ।**
**కవిర్హి మధుహస్త్యః ॥**

**భావార్థం :** గోవు తన పాలతో తన పాలకుణ్ణి ఎలాగైతే సుఖంగా ఉంచుతుందో అలాగే విద్వాంసులు తమ సత్య జ్ఞానముల సదుపదేశం ద్వారా ప్రజలను సుఖంగా ఉంచాలి.

**సందేశం :** మధ్యకాలంలోని అంధకార యుగంలో మనం ధర్మం, అధ్యాత్మం, దర్శనాలు, ఆత్మజ్ఞానం, బ్రహ్మవిద్య, సాధన, స్వాధ్యాయం మొదలగు వాటి అర్థాలను ఎలా గ్రహించామంటే, దానివలన సమాజానికి తిరోగమన దశ లభించింది. ప్రాచీన కాలంలో, వైదిక యుగంలో, రామరాజ్యంలో, మౌర్యుల, గుప్తుల కాలంలో మన దేశం జగద్గురువుగా ఉండేది. అప్పుడు కూడా శాస్త్రాలు అవే అయినా వాటి ప్రేరణతో మనం లౌకిక ఆధ్యాత్మిక ఉన్నతిని పొందాము. ఆ శాస్త్రాలకు విరుద్ధమైన అర్థం చెప్పి ప్రపంచంలోనే నేడు మనం ఒక బిచ్చగాడి స్థితికి చేరుకున్నాము.

విజ్ఞానం కేవలం భౌతిక ప్రయోజనం నెఱవేరుస్తుంది. జీవితపు వాస్తవిక లక్ష్యం ప్రాప్తించుకొనుటకు, సుఖశాంతియుత జీవనం జీవించుటకు మనిషి జ్ఞానవంతుడు, సదాచారవంతుడు, కర్తవ్య పరాయణుడై ఉండాలి. ఋషులు విద్యను చదువును తమ చేతుల్లోనికి తీసుకుని సత్యము జ్ఞానముల సదుపదేశంతో జీవన మార్గమును ప్రకాశవంతం చేశారు. జ్ఞాన లోపం చేతనే సమాజంలో దోషము లుత్పన్నమైనవి. ఎలాగైతే శరీరం నుండి రక్తమంతా తీసివేస్తే ప్రాణం పోతుందో, అలాగే చేతన నుండి సత్యం జ్ఞానం వెళ్ళిపోతే మనిషి నిష్ప్రాణం, మృత సమానం అవుతాడు.

సమాజం, సంస్కృతుల సంవేదన అర్థం చేసుకొన్న బ్రాహ్మణులు, ఋషులు తమ సత్య, జ్ఞానముల సదుపదేశంతో సమాజంలోని వికృతులను తొలగించవచ్చు. పరశురాముడు అటువంటి సందర్భంలోనే జపమాలను మేకుకు వ్రేలాడవేసి గొడ్డలి చేత ధరించాడు. గురు గోవిందసింహ్ 'ఒకచేత మాల ఒక చేత భాలా' (ఒక చేతిలో జపమాల, ఒక చేతిలో బల్లెం) నినాద మిచ్చాడు. ఇదే ముక్తి మార్గమన్నాడు. ఆయన శిఖ్ఖులకు మాల శిరస్సున కట్టించి చెప్పాడు - 'కత్తి నుపయోగించండి, దేశ సంస్కృతిని రక్షించండి.'' ఇదే సరియైన ఋషి ధర్మం.

చదువు మనుష్యుని వికాసానికి ఒక మహత్తర ప్రక్రియ. దాని లక్ష్యం మనుష్యుని వికాసం. ఇది అతని సంపూర్ణ వ్యక్తిత్వాన్ని వికసింప చేస్తుంది. స్వామి వివేకానందులు చెప్పినారు - సాధారణ వ్యక్తిని జీవన సంగ్రామంలో సమర్థుడుగా, శీలవంతుడు, పరహిత భావన కలిగిన వాడుగా చెయ్యలేకపోతే, సింహంతో సమానమైన సాహసాన్ని పెంపొందించకపోతే - ఆ చదువు ఇంక దేనికి? దేని వలన శీలనిర్మాణం జరుగుతుందో, మనుష్యుని మానసిక శక్తి పెరుగుతుందో, స్వాభిమానం కలిగి అతడు స్వావలంబి అవుతాడో అటువంటి చదువు మనకు కావాలి.

మన విద్వాంసులు, బ్రాహ్మణులు భారత ప్రాచీన గౌరవం, మన సంస్కృతి శ్రేష్ఠతయొక్క పునరుద్ధరణ కొరకు వ్యక్తిగతంగా, ప్రజల స్థాయిలో, ఎలా వీలయితే అలా గట్టి ప్రయత్నాలు చేయాలి. ఇదే 'అసతో మా సద్గమయ' లోని మూలభావన. ఇదే అధ్యాపకుని, ఉపదేశకుని నిజమైన ధర్మం.

విద్వాంసులు, బ్రాహ్మణులు ఈ మార్గంలో నడిచి సమాజాన్ని సుఖవంతం చేసే కర్తవ్యం నిర్వర్తించాలి.

☆ ☆ ☆

**తన సాధన ద్వారా, భక్తి ద్వారా భక్తుడు దేవుణ్ణి సృష్టించి పోషిస్తాడు.**

## ముఖచిత్ర కథనం

# జ్ఞాన కర్మ ఉపాసనల త్రివేణీ సంగమం భగవద్గీత

భగవద్గీత ఒక అపూర్వ రత్నాకరం. ఈ రత్నాకరంలో మునకలువేసి ఎందరో మహానుభావులు రకరకాల అమూల్య రత్నాలను వెలికి తీశారు, వెలికి తీస్తున్నారు. ఆది శంకరులు, రామానుజులు, మధ్వాచార్యులు, నింబార్క ఆచార్యులు, వల్లభాచార్యులు మున్నగు ఆచార్యులు అలాంటి మహానుభావులు. వారు ఎంతో కృషిచేసి వివిధ రూపాలు కలిగిన అనేక సిద్ధాంత రత్నాలను గీత అనే రత్నాకరం (సముద్రం) నుండి వెలికితీశారు. అమూల్యమైన ఆ రత్నాలన్నీ నేటికీ భారతదేశంలోని బజార్లలో అమ్ముడుపోతున్నాయి. ముముక్షువులు తమతమ అభిరుచుల ప్రకారం వాటిని కొనుగోలు చేస్తున్నారు.

భగవద్గీత ఒక అపూర్వ రత్నం. జగత్తులోని ఒక అపూర్వ కళాకారుడు దానిని ఒక విలక్షణమైన రీతిలో సానపట్టాడు. దాని ఒక్కొక్కవైపు నుండి ఒక్కొక్క 'అఖండజ్యోతి' వెలుగుతోంది. ఈ జ్యోతి సూర్యుని జ్యోతిని తలదన్నింది. ఎందుకంటే - సూర్యుని జ్యోతి ఈ ప్రపంచానికి మాత్రమే వెలుగు ఇస్తోంది; కాని ఈ జ్యోతి బ్రహ్మలోకం వరకు వెలుగులు విరజిమ్ముతోంది. దీని సాయంతో ముముక్షువులు బ్రహ్మలోకాన్ని అందుకుంటారు.

భగవద్గీత త్రివేణీ సంగమం. ఇందులో జ్ఞానం-గంగ, కర్మ-యమున, ఉపాసన-సరస్వతి ఏకమవుతున్నాయి. మరి ఇందులో స్నానంచేసే వ్యక్తి పవిత్రుడు కాకుండా ఎలా ఉంటాడు? 18 తరంగాలు కలిగిన ఈ త్రివేణిలో రోజూ స్నానం చేసే వ్యక్తి ఈ జీవితంలోనే జ్ఞానసిద్ధిని పొంది, జీవన్ముక్తుడై, పరమపదాన్ని చేరతాడు. **"జ్ఞానసిద్ధి సలభతే తతాయాతి పరమం పదమ్"** అని కదా శాస్త్ర వచనం.

భగవద్గీత పవిత్రమూ, నిర్మలమూ అయిన ఒక జలపాతం. అపరిమితమూ, గంభీరమూ, స్థిరమూ అయిన ఉపనిషత్తు అనే సరస్సునుండి వచ్చిపడుతోంది ఈ జలపాతం. మామూలు జలపాతాలలోని నీటికీ ఈ జలపాతంలోని నీటికీ ఒక తేడా ఉంది. ఈ జలపాతంలోని నీటిని ఒకసారి త్రాగితే చాలు - ఆ వ్యక్తి దాహం శాశ్వతంగా తీరిపోతుంది.

భగవద్గీత వెలుగుతున్న ఒక మహాదీపం. ఇది భారత్ అనే ఆలయంలో వెలిగించబడింది. అయితే ప్రపంచమంతటికీ వెలుగులు విరజిమ్ముతోంది.

భగవద్గీత పరిష్కృతమూ, స్వచ్ఛమూ, అమూల్యమూ అయిన అద్దం. మనిషి ఈ అద్దంలో తన యథార్థ స్వరూపాన్ని చూడగలుగుతాడు, అర్థం చేసుకోగలుగుతాడు.

భగవద్గీత మోక్ష మందిరానికి అపూర్వమైన తాళపుచెవి. కలియుగంలో ప్రజలు సాధన రహితులుగా ఉంటారని తెలుసుకుని కృష్ణ భగవానుడు ద్వాపర యుగం చివరలో ఈ తాళపుచెవిని మొట్టమొదట అర్జునునికి ఇచ్చారు. ఈ తాళపుచెవితో అర్జునుడు మోక్ష మందిరంలోకి ప్రవేశించాడు. ఆయన వెనుక ఎందరో ముముక్షువులు ఈ తాళపు చెవి సహాయంతో భవ సాగరాన్ని దాటారు.

భగవద్గీత సంజీవని మూలిక. కురుక్షేత్ర యుద్ధంలో వ్యామోహంవల్ల తన మిత్రుడు అర్జునుడు తన కర్తవ్యం ఏమిటో తెలియని అయోమయ అవస్థలో పడినప్పుడు శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీత అనే సంజీవని మూలిక అమృత రసాన్ని అతడిచేత త్రాగించాడు. ఫలితంగా అర్జునునికి తన కర్తవ్యం ఏమిటో తెలిసివచ్చింది.

భగవద్గీత అమృతంతో సమానమూ, పుష్టికరమూ, మధురమూ అయిన గోక్షీరం. ఉపనిషత్తు అనే కామధేనువుకున్న ధర్మ, అర్థ, కామ, మోక్షములనే నాలుగు పొదుగులనుండి ఈ పాలు తీయబడ్డాయి. ఈ పాలు తీసిన గోపాల నందనుడు శ్రీకృష్ణ భగవానుడు. ఆవు దూడ శ్రీకృష్ణుని మిత్రుడు అర్జునుడు. అర్జునుడు ఈ పాలు కొద్దిగా త్రాగి కృతకృత్యుడు అయినాడు. విశుద్ధమైన ఆ గోక్షీరం నేటికీ పృథివీమీద లభిస్తోంది. సజ్జనులు రాత్రింబవళ్లు ఆ గోక్షీరం త్రాగి ఆనందిస్తున్నారు.

భగవద్గీత మనోహరమూ, సుదృఢమూ, భవ్యమూ అయిన మేడ. మార్గశిర శుక్ల ఏకాదశి శుభ ముహూర్తంలో ధర్మక్షేత్రమైన కురుక్షేత్రంలో విశ్వనియంత శ్రీకృష్ణ భగవానుడు పురుష శ్రేష్ఠుడైన అర్జునునిచేత దీనికి పునాది వేయించారు. తాను స్వయంగా ఎంతో చాతుర్యంతో దీనిని నిర్మించారు. ఈ మేడలో మూడు అంతస్థులు ఉన్నాయి. మొదటి అంతస్థు పేరు కర్మఖండం. మధ్య అంతస్థు పేరు ఉపాసనా ఖండం. మూడవ అంతస్థు పేరు జ్ఞాన ఖండం. బ్రహ్మచర్యం, సత్యం, అహింస, క్షమ, దమం మున్నగు అనేక విచిత్ర స్తంభాలపై ఈ మేడ నిలచిఉంది.

**జ్ఞానం లోపిస్తే శక్తులన్నీ ఉడిగిపోతాయి.**

అపూర్వమైన మూడంతస్థుల భవంతి ఇది. ఈ భవంతికి ఎన్నో శిఖరాలు కూడా ఉన్నాయి. ఆ శిఖరాలపై నిర్మాత ఆదేశాలు వ్రాయబడి ఉన్నాయి. ఈ భవంతిలో దీని నిర్మాత స్వయంగా నివసిస్తున్నారు. ఇక్కడి నుండి మూడు లోకాలనూ పాలిస్తున్నారు.

భగవద్గీత కల్పవృక్షం. దీని వ్రేళ్లు వేదమనే దృఢమైన భూమిలో ఉన్నాయి. దీనికి కర్మ, ఉపాసన, జ్ఞానం అనే మూడు శాఖలు ఉన్నాయి. వాటిలో యజ్ఞం, దానం, తపం, యోగం మున్నగు ఉపశాఖలు ఉన్నాయి. శాంతి వంటి ఆకులు ఉన్నాయి. ఈ వృక్షం ఎప్పుడూ నాలుగే పండ్లు ఇస్తుంది. ధర్మం, అర్థం, కామం, మోక్షం వాటి పేర్లు. ఆర్తి, జిజ్ఞాసువు, యథార్థి, జ్ఞాని అనే నాలుగు తరహాల భక్తులు ఆ ఫలాలను భుజిస్తారు.

భగవద్గీత బ్రహ్మవిద్య. ఈ బ్రహ్మవిద్య పద్మనాభ భగవానుని ముఖ కమలం నుండి వెలువడింది. కనుక ప్రభువు పాదముల నుండి వెలువడిన పావన గంగకన్న మరింత పవిత్రమైనది. దీనికి మరో పేరు జ్ఞానగంగ. ఇందులో మునుగుతూ ఉండేవారిలో ఎటూ తేల్చుకోలేని అయోమయ స్థితి నశిస్తుంది. వారు దివ్య స్వరూపాన్ని పొంది అమరులు అవుతారు.

భగవద్గీత భగవానుని హృదయం. భగవానుని హృదయంలో అనంతమైన జ్ఞాన భాండారం ఉన్నది. కనుక - భగవద్గీతలో కూడా అదే ఉన్నది. గీతకు సేవ చేసే వ్యక్తి అనంత జ్ఞానానికి భాగస్వామి అవుతాడు. భగవానుని హృదయంలో కౌస్తుభమణి, వనమాల, భృగు చిహ్నం, లక్ష్మి అనే నాలుగు వస్తువులు ఉన్నాయి. గీత రూపంలో ఉన్న భగవానుని హృదయాన్ని తన హృదయంలో పదిలపరుచుకునే వ్యక్తికి నాలుగు వస్తువులు లభిస్తాయి. అజ్ఞానమనే చీకటిని తొలగించే జ్ఞానమనే కౌస్తుభమణి అతడికి లభిస్తుంది. రెండవది, నలుగడలా పరిమళాన్ని వెదజల్లే కీర్తి అనే వనమాల అతడికి లభిస్తుంది. మూడవది, క్షమాది సద్గుణాల రూపంలో భృగు చిహ్నం అతడికి లభిస్తుంది. నాల్గవది, ఇహలోకంలో సిరి సంపదల రూపంలో అతడికి లక్ష్మి లభిస్తుంది.

భగవద్గీత ఒక అపూర్వ గ్రంథం. ఇందులో దివ్యమూ, అమరమూ అయిన సందేశం ఉంది. సర్వశ్రేష్ఠమైన ఉపదేశం ఉంది. అన్ని జాతులకూ, అన్ని వర్ణాలకూ, అన్ని ఆశ్రమాలకూ, అన్ని సంప్రదాయాలకూ సమానంగా ఉపయోగపడే ఉపదేశం అది. మానవాళికి సనాతన ధర్మోపదేశం అది. సార్వభౌమ సందేశం అది. దీని వక్త జగద్గురువు అయిన శ్రీకృష్ణ భగవానుడు. దీని శ్రోత సత్వగుణాలు కలిగిన మానవాళి. దీని శ్రవణానికి ఫలం అమరత్వ సిద్ధి.

ఒక్క మాటలో - భగవద్గీత ఈ జగతికి అమర ఫలం. సంసారంలోని సారం. సంసార సాగరంలోని దీప స్తంభం. మానవ జీవనానికి మార్గ నిర్దేశకం. శాస్త్రసాగరాన్ని మథించి తీసిన అమృతం. ఉపనిషత్తుల సారం. వేదాల తత్వం. సనాతన తత్వాల నిగ్గు. ఒక అపూర్వ గ్రంథరత్నం. ఏ దేశంవాడయినా, ఏ భాష వాడయినా, ఏ కులం వాడయినా, ఏ సంప్రదాయం వాడయినా, ఏ మతం వాడయినా ముక్తకంఠంతో గీతను ప్రశంసిస్తాడు. కనుక గీత ఒక అపూరూపమైన, విలక్షణమైన గ్రంథం. గీత గీతయే.

భగవద్గీతలోని తత్వం మనకు తెలియదు -

**కృష్ణో జానాతి వై సమ్యక్ కించిత్ కుంతీసుతః ఫలమ్ ।**
**వ్యాసో వా వ్యాసపుత్రోవా యాజ్ఞవల్క్యోఽథ మైథిలః ॥**

అనగా - శ్రీకృష్ణునికి గీత సరిగా తెలుసు. అర్జునునికి దాని ఫలం కొంత తెలుసు. వ్యాసుడు, వ్యాసపుత్రుడైన శుకుడు, యోగి యాజ్ఞవల్క్యుడు, జనక మహారాజు - వీరికి కొంత కొంత తెలుసు.

అలాంటపుడు మన కర్తవ్యం ఏమిటి?

**గీతా సుగీతా కర్తవ్యా కిమన్యైః శాస్త్రవిస్తరైః ।**

అనగా - గీతను అధ్యయనం చేయడమే మన కర్తవ్యం. ఇతర శాస్త్రాల అవసరం ఏముంది?

భగవద్గీత గురించి మహాత్మా గాంధీ ఇలా అన్నారు - **గీత నా మాత.** 22-23 సంవత్సరాల వయస్సులో నాకు జ్ఞానాన్ని సంపాదించాలనే కోరిక కలిగింది. వేదాలను అధ్యయనం చేయడానికి 15 సంవత్సరాలు పడుతుందని నాకు తెలిసింది. అంత సమయం ఇవ్వడానికి నేను సిద్ధంగా లేను. గీత అన్ని శాస్త్రాల సారమని, కామధేనువని నాకు తెలిసింది. నేను ఎక్కడో చదివాను. ఉపనిషత్తులు మున్నగు గ్రంథాల నిగ్గు గీతలోని 700 శ్లోకాలలో ఉన్నదని నాకు తెలిసింది. నాకు సంస్కృతం కొద్దిగా వచ్చు. కనుక గీత చదవడమే సులువైన పని అని నేను అనుకున్నాను. నేను గీతను అధ్యయనం చేశాను. గీత నాకు బైబిలు, ఖురాన్‌లే కాదు, గీత నాకు మాత అయింది. నేను చనిపోయిన తర్వాత కూడా నిలచిఉండే మాత అయింది. కోట్లాదిగా ఉన్న దాని పుత్రులూ, పుత్రికలూ పరస్పర విద్వేషం లేకుండా దాని పాలు త్రాగవచ్చు, కష్ట సమయంలో వారు ఆ

**సన్మార్గంలో కలకాలం నిలిచి ఉండడం జ్ఞానం ద్వారానే సాధ్యం.**

తల్లి ఒడిలో కూర్చొనవచ్చు. ఈ కష్టం వచ్చిపడింది. నేను ఏమి చేయాలి - అని అడగవచ్చు. గీతా మాత దానికి జవాబు చెపుతుంది. అంటరానితనం విషయంలో కూడా నాపైన ఎన్నో దాడులు జరిగాయి. నన్ను ఎందరో వ్యతిరేకించారు. నేను ఏమి చేయాలి - అని గీతా మాతను అడిగాను. వేదాలు మున్నగు గ్రంథాలను నేను చదవలేను. తొమ్మిదవ అధ్యాయం చదవమని ఆమె చెప్పింది. నేను వారి కోసమే జన్మించాను - అని చెప్పింది. నిజమైన మాతృభక్తులే ఇలాంటి హామీ పొందగలరు. దానినుండి అన్నింటినీ పొందగోరేవారికి అది కామధేనువు. గీత ఎంతో క్లిష్టమైన గ్రంథమని కొందరు చెపుతారు. లోకమాన్య తిలక్‌కు అది క్లిష్టమైన గ్రంథం కావచ్చు. నాకు మాత్రం ఇది చాలు - మొదటి మూడు అధ్యాయాలూ చదవండి. మిగతా అధ్యాయాలలో ఆ విషయాలే మళ్లీ చెప్పబడ్డాయి. ఇందులో - కొద్ది శ్లోకాలలో అన్ని విషయాలనూ చేర్చారు. గీతా మాత మూడు చోట్ల స్పష్టంగా చెప్పింది- అన్ని వస్తువులనూ వదిలి నా ఒడిలోకి చేరేవారికి నిరాశ కలుగదు, పరమ ఆనందమే కలుగుతుంది.

గీతామాత చెపుతుంది - పురుషార్థం చెయ్యి, ఫలాన్ని నాకు వదిలివెయ్యి. ఇలాంటి సూటి విషయాలను నేను గీతామాతనుండి నేర్చుకున్నాను. నేను ప్రతిరోజూ గీతామాత నుండి ఎంతో కొంత పొందుతున్నాను. కనుక నాకు ఎన్నడూ నిరాశ కలుగలేదు. అస్పృశ్యతా నిర్మూలన ఉద్యమం తప్పని ప్రపంచం అంటోంది. అది సరైనదేనని గీతామాత చెపుతోంది. మీరు ప్రతిరోజూ ఉదయం గీత చదవండి. ఇది అన్నిటినీ మించిన గ్రంథం. 18 అధ్యాయాలూ కంఠస్థం చేయడం కష్టమైన విషయమేమీ కాదు. మరణ సమయంలో కళ్లు పని చేయవు. బుద్ధి కొద్దిగా మిగులుతుంది. ఆ సమయంలో గీతద్వారానే బ్రహ్మనిర్వాణం లభిస్తుంది.

నా దృష్టిలో గీత చాలా సరళమైన గ్రంథం. ఇందులో కొన్ని మౌలిక సమస్యలు ఉన్నమాట నిజమే. వాటిని పరిష్కరించడం కష్టమన్నదీ నిజమే. అయితే గీత చెప్పే మామూలు ఉపదేశాన్ని అర్థం చేసుకోవడం కష్టం కాదు. కొద్దిలో ఇది సంపూర్ణము, సమగ్రమూ అయిన నీతిశాస్త్రం. ఇది దార్శనికమూ, భక్తి విషయికమూ అయిన గ్రంథంకూడా, ప్రతి హిందూ బాలుడూ, బాలికా సంస్కృతం నేర్చుకోవాలి. అయితే, కొన్ని తరాల వరకు సంస్కృతం నేర్చుకోనివారు కోట్లాదిగా ఉంటారు. సంస్కృతం నేర్చుకోనంతమాత్రాన గీతా బోధనకు దూరం కావడం ఆత్మహత్యాసదృశం.

★★★

## పారాయణ చాలదు

విద్యార్థులలో ఆరుణి అద్భుతమైన మేధావి. అజ్ఞాబద్ధుడైన విద్యార్థి. ఇతడు తత్వజ్ఞాని కావాలనుకొంటాడు. ఉద్దాలకుడు కులగురువు. ఈయన కూడా కుతూహలాన్ని చూపించాడు. తగిన మూల్యానికి తగిన లబ్ధి అనే సిద్ధాంతం స్వీకరించబడింది. చౌకధరకు అమూల్యమైనవి లభిస్తాయనే ప్రతిపాదన లోకంలో ఎక్కడ, ఎప్పుడు చేయబడినా అది శుద్ధ పొరపాటే.

ఆరుణికి నూరు బలహీనమైన ఆవులు ఇవ్వబడ్డాయి. వాటిని దృఢమైన వేయి ఆవులుగా చేసిన తర్వాత తత్వజ్ఞాన దీక్ష ఈయబడుతుందని గురువు ఆదేశం. నీరు, పచ్చగడ్డి సమృద్ధిగా లభించే ప్రదేశాలను వాకబు చేసికొంటూ ఆవుల మందను ఒక చోటనుండి మరియొక చోటునకు ఆరుణి తీసికొని వెళ్ళసాగేడు. వాటికి తగిన రక్షణ కల్పిస్తూ, ఎదురయ్యే సమస్యలకు తగిన పరిష్కారాలను వెదుక్కొంటూ 10 సం॥ గడిపేసరికి - 100 గోవులు 1000 గోవులయ్యాయి. ఆనందంతో గోవుల మందను తోలుకొని గురుకులానికి తిరిగివచ్చిన ఆరుణి ముఖం బ్రహ్మ తేజస్సుతో వెలిగిపోతోంది. ఆచార్యుడు ఆనంద తన్మయుడై ఆరుణి యొక్క పురుషార్థాన్ని కొనియాడారు. తరువాత అతి స్వల్పకాలం గురుసాన్నిధ్యంలో గడిపినంత మాత్రాననే ఆరుణి అద్వితీయుడైన బ్రహ్మజ్ఞానిగా కీర్తింపబడ్డాడు.

దీర్ఘకాలం గ్రంథ పారాయణంలో నిమగ్నులైన విద్యార్థులు ఆశ్చర్యచకితులై ఆరుణి ఇంత స్వల్ప కాలంలోనే ఇంతటి నిష్ణాతుడెలా కాగాలిగాడని గురువుని ప్రశ్నించారు. దానికి ఆచార్యుడు జ్ఞానం యొక్క పూర్ణత్వం అనుభవ, అభ్యాస, ఆదర్శాలను దైనందిన జీవితంలో మేళవింప జేసికోవటం వల్లనే సిద్ధిస్తుందని, కేవలం అధ్యయన మాత్రం చేత పూర్ణత్వాన్ని పొందటం సాధ్యం కాదని తెలియజేశాడు.

మనస్సుకు ఏకాగ్రత అనేది లభించాలే కాని, దానిని లోకంలోని ఏ ఒడిదుడుకులు కూడా చలింపచేయజాలవు.

- ప్రజ్ఞాపురాణం నుండి

**వివేకం, జ్ఞానం భారతీయ సంస్కృతికి మూలాధారాలు.**

## బోధకథ

# రెండు సుఖాలూ సున్నాయే!

వడివడిగా అడుగులు వేస్తూ వేదవ్యాస మహర్షి ముందుకు సాగుతున్నారు. గంభీరమైన ఆయన ముఖ మండలంపై దివ్య తేజస్సు మెరుస్తూంది. ఇంతలో ఆయన పాదం వద్దనుంచి ఒక పురుగు గబగబా పరుగెట్టింది. మహర్షికి పిపీలకాదుల భాషలన్నీ తెలుసు. మహర్షి ఆ పురుగుని దాని భాషలోనే ప్రశ్నించారు - "ఏమిటి? ఎందుకంత హడావుడిగా పరుగెత్తుతున్నావు?" ఆ పురుగు ఆగి ఇలా అంది -

"విశ్వ వంద్యుడ వయిన ఓ మహర్షీ! కొద్ది సేపట్లో ఈ దారిగుండా పెద్ద ఎద్దుబండి ఒకటి రాబోతూంది. దాని చక్రాల కింద పడి నేనెక్కడ నలిగి చస్తానో అని భయపడి త్వరగా పరుగెత్తి పారిపోతున్నాను." అంది.

ఆ పురుగుకు ఉన్న దేహ భ్రాంతి చూస్తే మహర్షికి జాలి వేసింది. ఆయన కుతూహలంగా దానితో అన్నారు -

"ఈ జీవనం జీవించడం కంటే మరణించడం మేలు కదా! మానవుడు మరణించడానికి భయపడుతున్నాడంటే అర్థం ఉంది. నువు ఈ హీనమైన శరీరంతో ఎప్పుడేం ప్రమాదం ముంచుకు వస్తుందో తెలియక అవస్థలు పడుతూ కూడా చావడానికి భయపడ్తున్నావా!" అని.

కీటకం అంది "నాకు మృత్యువంటే ఏమాత్రం భయం లేదు. ఈ జన్మయే తుచ్ఛమైనది అనుకుంటూంటే - ఇంతకంటే నికృష్టమైన జన్మలున్నాయట - వాటిల్లో పడతానేమోనని భయంగా ఉంది."

వ్యాసుల వారన్నారు, "నువ్వు భయపడకు - నువ్వు ఎటువంటి నికృష్టమైన జన్మ ఎత్తినా నిన్ను ఆ జన్మల నుండి త్వరత్వరగా విముక్తి చేసి నీకొక బ్రాహ్మణ జన్మ ప్రసాదిస్తాను. సరేనా!"

కీటకం, "ధన్యురాల్ని స్వామీ" అని దోవలోకి వచ్చి బండి చక్రం కింద నలిగి ప్రాణం విడిచింది. తరువాత కాకిగా, నక్కగా రకరకాల జంతువులుగా జన్మించింది. ప్రతిసారి వ్యాసుల వారు దానికి పూర్వ జన్మ స్మృతి కలిగించి వేగంగా విముక్తిని ప్రసాదిస్తూనే ఉన్నారు. ఉడుములా పుట్టింది - పశుజన్మ ఎత్తింది. చండాలుడై, శూద్రుడై, వైశ్యుడై జన్మ లెత్తుతూ క్షత్రియ జాతిలో పుట్టింది. అప్పుడు కూడా వ్యాసమహర్షి దర్శనమిచ్చి తరింప చేశారు.

క్షత్రియుడైన కీటకం రాజ్యం చేసి ప్రాణత్యాగం చేసిన తరువాత బ్రాహ్మణుడుగా జన్మించింది. బాలుడుగా వానికి అయిదవ సంవత్సరం రాగానే వ్యాసమహర్షి దర్శనమిచ్చి అతని చెవులలో సారస్వత మంత్రం ఉపదేశించారు. ఆ మంత్ర ప్రభావం వల్ల ఏమీ చదవకుండానే అతనికి సంపూర్ణ విద్య, వేదం, శాస్త్రాలు, ధర్మస్మరణ అంతా లభించాయి. వ్యాసులవారు అతనిని కార్తికేయ క్షేత్రం వెళ్ళమని అక్కడ ఉండే నందభద్రుని కలుసుకోమని చెప్పి - "పాపులు కూడా సుఖంగా ఎందుకుంటారు? అని అతడు సమాధానం కోసం వేగిపోతున్నాడు. నువ్వు అతనిని సమాధాన పర్చు" అని ఆజ్ఞాపించారు.

కార్తికేయ క్షేత్రంలోని బహూదక తీర్థంలో నందభద్రుడు తపస్సు చేస్తున్నాడు. మనస్సులో ఈ అనుమానం వ్యాకులపెడ్తున్నది. సిద్ధ సారస్వత బాలకుడు అక్కడికి వెళ్ళాడు. "పాపాత్ముడు కూడా సుఖంగా ఎందుకుంటాడు అనిగదా నీ ప్రశ్న. తామస భావం చెడ్డది. తామస భావంతో ఏం చేసినా రాణించదు. పూర్వజన్మలో తామస భావంతో దానంచేసినవాళ్ళు ఈ జన్మలో దాని ఫలితాన్ని పొందుతారు. వాళ్ళు తామస భావంతో దానం చేస్తారు కాని, మనస్సులో ధర్మం పట్ల అనురాగం ఉండి కాదు. అలాంటి వాళ్ళు సుఖంగా ఉన్నట్లు అగుపడుతారు.

"వాళ్లు పూర్వఫలం అనుభవించి చివరకి నరకానికే వెడతారు. తామస భావమే దీనికి కారణం. సందేహం లేదు. మార్కండేయుడు ప్రవచించిన వాక్యాలు ఈ సమయంలో గుర్తు చేసుకోవడం మంచిది. ఒకరకం వ్యక్తి ఇహానికి సంబంధించిన సుఖాలు సులభంగా అనుభవించ గలుగుతాడు. రెండవరకం వ్యక్తి లోకంలో సుఖాలు అనుభవించడు గాని పరలోకంలో సుఖాన్ని జుర్రుకుంటాడు. మూడవరకం వ్యక్తి ఇహలోకం - పరలోకం రెండింటిలోనూ సుఖం అనుభవిస్తాడు. నాలుగోరకం వ్యక్తి ఇహలోకంలోనూ సుఖపడుతాడు, పరలోకంలోనూ సుఖపడుతాడు. ఈ స్థితి ఎందుకు కలుగుతుందంటే - పూర్వజన్మ పుణ్యానుసారంగా వచ్చిన సుఖం అనుభవిస్తున్న వారు ఈ జన్మలో పుణ్యం చేయవలసిన అగత్యం ఉన్నదని మర్చిపోతారు. మరో జన్మ ఉంది. ఆజన్మకి కూడా ఇంత పుణ్యం చేసి దాచిపెట్టుకోవాలి అనే ఆలోచనే ఉండదు. అందుకే విశృంఖలంగా బ్రతుకుతాడు. ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తాడు. వారి సుఖాలు ఇహానికే పరిమితం - పరందాకా రావు.

"కాకపోతే పూర్వజన్మంలో పుణ్యం సంపాదించి వెంట తెచ్చుకోక పోయినా ఈ జన్మలో తపస్సు చేసి కొత్త పుణ్యం సంపాదించుకొనే బుద్ధిమంతులకి పరలోకంలో అంతులేని ఆనందం, సుఖం సిద్ధంగా దొరుకుతాయి. సందేహం లేదు. పూర్వజన్మలోనూ, ఈ జన్మలోనూ పుణ్యం సంపాదించుకోవడంలో ఏమరుపాటు లేని వ్యక్తికి ఇహపర సుఖాలు ఎప్పుడూ అరచేతి అరటిపండ్లే! వెనకటి జన్మలోనూ పుణ్యం చేయక - ఈ జన్మలోనూ ఆ ప్రయత్నం చేయని వాడికి రెండు సుఖాలూ సున్నాయే!

"పూర్వజన్మలో పుణ్యం చేస్తే పరలోకంలో సుఖపడి కర్మానుసారం మరోజన్మ ఎత్తినా ఇహపరమైన సుఖం పొందుతాడు. జన్మఎత్తడం, తినడం, త్రాగడం, నిద్రపోవడం కాదు. మన సుఖాలకి కావలసిన పుణ్యం మనం సంపాదించుకోవాలి అనేదైనా మానవుడు గ్రహిస్తే ప్రజలకి ఇన్ని ఇక్కట్లు రావు. అర్థమైందా నందభద్రా!" అని సిద్ధ సారస్వత బాలకుడు వివరించి తన కథ కూడా చెప్పాడు.

తరువాత బాలకుడు నిరాహారదీక్షతో సూర్యమహామంత్రం జపం చేస్తూ బహూదక తీర్థంలోనే ప్రాణం విడిచాడు. నందభద్రుడు గురువువంటి ఆ బాలకునికి దహనసంస్కారాలు చేయించి అస్థికలు సముద్రంలో నిమజ్జనం చేశాడు. ఆ బాలకుడే మరుసటి జన్మలో మైత్రేయ నామంతో శ్రేష్టమహర్షిగా అవతరించి అంతులేని ఖ్యాతిని సంపాదించాడు.

అనువాదం : టి.జ్ఞానప్రసూన

**ధైర్యం, నిష్ఠ లోపిస్తే పనిలో వైఫల్యం ఖాయం.**

## కుటుంబ నిర్మాణం : గృహస్థ యోగం

# సంసారానికీ, వైరాగ్యానికీ అద్భుత సమన్వయం

మెట్లు ఎక్కాలంటే ఒక అడుగు తర్వాత మరో అడుగు ముందుకు వేయాలి. ఒక్కొక్క మెట్టూ ఎక్కి ముందుకు వెళ్లాలి. ఒక్క దూకు దూకి పై అంతస్థుకు వెళ్లాలని ప్రయత్నిస్తే ప్రమాదం తప్పదు. ఆత్మోద్ధరణ విషయంలోనూ ఇది వర్తిస్తుంది. మనిషి ఏ కుటుంబంలో, ఏ సమాజంలో, ఏ జాతిలో, ఏ యుగంలో జన్మిస్తాడో అవి అతడికి ముందుకు వెళ్లడానికీ, శిఖరాగ్రానికి చేరుకోవడానికీ ఒక్కొక్క మెట్టు అవుతాయి. ఈ మెట్లద్వారానే ముందుకు వెళ్లవలసి ఉంటుంది. ప్రగతి క్రమంలోని ఈ వాస్తవాన్ని విస్మరించి - హనుమంతునిలా ఒక్క గెంతు వేసి అంతిమ లక్ష్యాన్ని చేరగలనని అనుకోవడం ఆత్మవంచనే అవుతుంది, అధ్యాత్మ విజ్ఞానాన్ని అవమానించడమే అవుతుంది.

పిల్లవాడికి మొదట అక్షరాలు దిద్దడం నేర్పాలి. ఆతర్వాతనే అతడు పుస్తకం పట్టగలుగుతాడు. ఆతర్వాత అతడు ఒక్కొక్క తరగతీ దాటి పాఠశాల నుండి కళాశాలకు చేరతాడు. డిగ్రీ, పి.జి.డిగ్రీ సంపాదిస్తాడు. ఇది సహజమైన ప్రగతి ప్రక్రియ. భౌతిక సాఫల్యం నుండి ఆత్మోన్నతి వరకు ఈ సూత్రాన్ని అనుసరించవలసి ఉంటుంది. అపుడే ఆ వ్యక్తి గర్వాన్నీ, గౌరవాన్నీ అనుభవించే స్థాయికి చేరుకుంటాడు. క్షణాలలో మొక్కలు మొలిపించే కళను గారడీలలోనే చూస్తాం. నిత్య జీవితంలో అలా జరుగదు. అధ్యాత్మ విద్య గారడీ విద్య కాదు. నిర్దిష్టమైన కర్తవ్యాలను ఉపేక్షించి చెప్పుకోదగ్గ ఫలితాన్ని సాధించే విధానము కాదు. అందులో కుటుంబం, సమాజం, జాతి, విశ్వం - అన్నింటి శ్రేయస్సుతో ముడిపడి ఉన్న నిర్ణీత మార్గంలో పయనించ వలసి ఉంటుంది. సాధనా విజ్ఞానంలో నిర్ణయించబడిన నియమ నిబంధనలను పాటించవలసి ఉంటుంది. ఆయా గీటురాళ్ల మీద గీయబడి తాను నిజమైన సాధకుడినని రుజువు చేసుకోవలసి ఉంటుంది. సంసారంలో ఉన్న వ్యక్తులకు ఈ ప్రపంచమే సాధనాస్థలం. ఇంతకన్న అనుకూలమైన స్థలం మరొకటి ఉండదు.

ఈ సాధనా స్థలంలో వ్యక్తి ఉపాసనలోని తొలి అడుగుగా మొదట కుటుంబమనే ప్రారంభదశను దాటవలసి ఉంటుంది. అది పూర్తయిన తర్వాత అతడు రెండవ దశలో, అనగా సమాజ సాధనలో ప్రవేశించవలసి ఉంటుంది. ఆతర్వాత వచ్చే మూడవ దశ రాష్ట్ర సాధన. అనగా, తన జాతిపట్ల తన కర్తవ్యాన్ని నిర్వహించడం. చివరి దశ విశ్వ సాధన. దానిని సక్రమంగా పూర్తిచేసిన తర్వాత వ్యక్తి స్థాయి యోగసిద్ధి పొందిన యోగి స్థాయి అవుతుంది. ఈ దశలో యోగ సాధన ద్వారా లభించే సిద్ధులూ, విభూతులూ అన్నీ చేతికి అందుతాయి. అవన్నీ యతికి అందే మహత్తులు. సంసారాన్ని వదలి బైరాగిగా మారాలని అనుకున్నవాడి వైరాగ్యంసైతం సమాజంలేకుంటే సగం సగంగానే మిగిలిపోతుంది. మరి-సాధనాలూ, సౌకర్యాలు లేని అడవిలో వైరాగ్యానికి పరీక్ష ఎలా జరుగుతుంది? ఎవరైనా ఇలాంటి కొరతల బ్రతుకు బ్రతికినా - అది అతడి తప్పనిసరి పరిస్థితి అవుతుందికాని వైరాగ్యం కాదు. ఏనాడూ సరస్సులో దిగని వ్యక్తి తాను నీటిలో ఎన్నడూ మునిగిపోనని గొప్పలు చెప్పుకుంటే - దానికన్న హాస్యాస్పదమైన విషయం ఏముంటుంది?

ఒక వ్యక్తి మునుగుతాడా మునగడా అన్నది అతడు నీటిలోకి దిగిన తర్వాతనే నిర్ణయం అవుతుంది. అతడు నీటిబయట ఉన్నంతవరకు ఆ సంగతి తెలిసే అవకాశం ఉండనే ఉండదు. ప్రపంచంలో ఉంటూకూడ నిర్లిప్తంగా ఉన్న వ్యక్తియే నిజమైన విరాగి. ఆ వైరాగ్య స్థితిని చేరిన వ్యక్తికి గుహలోకాని, అడవిలోకాని ఏకాంతంగా ఉండడం ఆడంబరం మాత్రమే అవుతుంది. కీర్తి ప్రతిష్టలూ, సన్మానాలమీద సన్మానాలూ కాంక్షించే వ్యక్తి మాత్రమే ఈ బాహ్య ఆడంబరాలలో మునిగిపోతాడు. నిజంగా యోగ సాధన కోరుకునే వ్యక్తికి సమాజాన్ని మించిన యోగ స్థలం ఉండదు.

మహాకవి గెటే తన నాటకం 'ఫాస్ట్'లో ఈ సమస్యను అద్భుతంగా చిత్రించాడు. ఆ నాటకంలోని నాయకుడు ఆత్మజ్ఞానాన్ని పొందాలని అనుకుంటాడు. సంసారంలో ఉంటూనే అతడా జ్ఞానాన్ని పొందాలని అనుకుంటాడు. అయితే ఆ జ్ఞానాన్ని సంపాదించడంలో ఈ ప్రపంచమే అన్నిటినీ మించిన ఆటంకమని అతడికి కొంత కాలం తర్వాత అనుభవం అయింది. సమాజానికి చాలా దూరంగా ఉన్న అడవిలోకి అతడు వెళ్లిపోతాడు. ఏకాంతంగా తపస్సు చేయడం ప్రారంభిస్తాడు. అయినా, అక్కడా అతడికి ఏకాగ్రత కుదరలేదు. కొరతలవల్ల కలిగిన బాధ, కుటుంబ సభ్యుల జ్ఞాపకాలు అతడిని వెన్నాడుతూ వచ్చాయి. అలసిపోయి, ఓడిపోయి అతడు తిరిగి సమాజంలోకి వచ్చి చేరతాడు. అయితే అప్పటికి అతడు ముసలివాడు అయిపోతాడు. అతడు హతాశుడు అవుతాడు. జీవితంలోని చివరి క్షణంలో తనకు జ్ఞానోదయం కలిగిందనే తృప్తిమాత్రం అతడికి మిగిలింది. ఆ జ్ఞానోదయం కలగకపోవడంవల్ల అతడు అంతవరకు సంసారంలోపలా బయటా అడవులలో తిరుగుతూవచ్చాడు.

ఆస్ట్రియాకు చెందిన నవలారచయిత స్టీఫెన్ జ్విగ్ 'విరాట్' అనే తన నవలలో ఇలాంటి గాథనే వర్ణించాడు. నవలలోని నాయకుడు విరాట్ నిష్కర్మయోగాన్ని అభిమానించే వ్యక్తి. అతడు తన అనుచరులతోపాటు సమాజానికి దూరంగా వెళ్లిపోతాడు. అయినా పూర్తి నిష్కర్మను (అసలు ఏమీ పని చేయకపోవడాన్ని) అనుభూతి

**ఆలోచనల శక్తి మనిషిని ఆకాశాని కెత్తుతుంది,లేదా పాతాళానికి దిగజార్చుతుంది.**

పొందలేకపోతాడు. అతడు అక్కడినుంచి మరింత దట్టమైన అడవిలోకి వెళ్లిపోతాడు. అక్కడా అదే అనుభవం. అప్పుడు అతడికి జ్ఞానోదయం అయింది. అతడు తిరిగి సమాజంలోకి వచ్చాడు. నిష్కర్మ స్థితిని వదిలి కర్మమయ జీవనాన్ని అవలంబిస్తాడు.

సమాజంలో ఉంటూ ఉంటే, కర్తవ్యాలను నిర్వహిస్తూ ఉంటే - సంసార జంజాటంలో పడిపోయి తన లక్ష్యంనుండి ప్రక్కకు తొలగిపోతానని వ్యక్తికి అనిపిస్తుంది. ఆ జంజాటంనుండి తప్పించుకోవడానికి అతడు సమాజానికి దూరంగా వెళ్లిపోతాడు. అందువల్ల తన లక్ష్యం మరింత త్వరగా సిద్ధిస్తుందని అతడు భావిస్తాడు. కానీ, వాస్తవం ఏమంటే - వ్యక్తి ఎంత తొందరపాటు వహిస్తే అంతగా అతడు ధ్యేయానికి దూరం అవుతాడు. అంతగా ఆలస్యం అవుతుంది. ఎందుకంటే - బాధ్యతల ఉపేక్ష ద్వారా ఆత్మజ్ఞానాన్ని అందించే మార్గం ప్రపంచంలో అసలు లేనే లేదు. మధ్యే మార్గం అనే రాజమార్గమే అసలు మార్గం కాగలుగుతుంది. ఆ మార్గంలో అవసరమైన కర్తవ్యాలను నిర్వహిస్తూనే ముందుకు వెళ్లవలసి ఉంటుంది. పూర్తిగా భౌతికవాది కావడంలో నష్టం ఉంది. పలాయన వాది కావడంలోనూ హాని ఉంది. అతివాదాన్ని వదులుకోవడమే ప్రయోజనకరం.

సంసార తాపత్రయంలో కంఠంవరకు కూరుకు పోవడం జీవితానికి ఒక అంచు. విరాగిగా మారి సంసారాన్ని వదిలివేయడం జీవితానికి మరో చివర. ఈ రెంటినీ సమన్వయం చేసి వ్యవహరించడంద్వారానే చెప్పుకోదగ్గ సాఫల్యం లభిస్తుంది. వస్తువులను సంపాదించడం వదులుకోవడం, బంధనం వైరాగ్యం - రెండూ అవసరమే. ఈ రెంటిలో ఒక దాన్ని వదలి రెండవ దాన్ని గ్రహించడం ద్వారా సత్యాన్ని పొందలేము. ఈ రెంటినీ కలిపి వ్యవహరించడంద్వారానే పూర్ణత్వం లభిస్తుంది.

శంకరుడు త్యాగానికి ప్రతిరూపం. అన్నపూర్ణ భోగానికి ప్రతిరూపం. ఇద్దరూ కలసి కుటుంబంలో, సమాజంలో, జాతిలో, విశ్వంలో ఏకమయితే పూర్ణత్వంలోని నిజమైన ఆనందం లభిస్తుంది. అలా కాక - ఎక్కడయినా బంధనానికీ ముక్తికీ మధ్య, భోగానికీ త్యాగానికీ మధ్య, అనురాగానికీ విరాగానికీ మధ్య వైరుధ్యం ఏర్పడితే, అక్కడ రకరకాల అశాంతి, అసంతృప్తి జనిస్తాయి. నేడు కానవస్తున్న తాడూ బొంగరంలేని బ్రతుకుకు ఒకే ఒక కారణం ఈ సంసార వ్యూహాన్ని సరిగా అర్థంచేసుకోలేక పోవడమే. మనకు ఈ పద్మవ్యూహంలో ప్రవేశించడమూ చేతకావాలి, దీనినుండి బయటికి రావడమూ చేతకావాలి.

జీవితంలోని ఏదో ఒక రంగాన్ని మొత్తం జీవితంగా పరిగణించి, ఆ రంగపు కార్యకలాపాల కోసమే జీవితం మొత్తాన్ని ధారపోసినప్పుడు సంక్షోభం ఏర్పడుతుంది. ఒక వ్యక్తి తనను తాను రాజ్య రక్షణకు ఉపకరణంగా పరిగణించుకుంటే, అతడు తనను సైనికుడుగా రూపొందించుకుంటాడు. ఒక వ్యక్తి సమాజంలో సమృద్ధికి ఆధారంగా పరిగణించబడితే మనం అతడిని వాణిజ్యనేతగా తయారుచేయడానికి ప్రయత్నిస్తాము. పాలనా బాధ్యతను నిర్వహించగోరే వ్యక్తి రాజకీయ నాయకుడు అవుతాడు. నాట్య కళాకారులు, రంగస్థల నటులు, సినీనటులు ప్రజలకు వినోదం కలిగించడమే తమ అదృష్టంగా భావిస్తారు. ఆ రంగాల చుట్టూనే వారి కార్యకలాపాలన్నీ తిరుగుతూ ఉంటాయి. కాని, మనిషి ఇలా ఏదో ఒక రంగానికి పరిమితమైనవాడు కాడు. వాస్తవం ఏమంటే - మనిషి కేవలం సైనికుడు, వ్యాపారి, నాయకుడు, నటుడూ మాత్రమే కాడు. అతడి గుణాలు, అభిరుచులు, స్వభావం, సంస్కారాల ఆధారంగా వికసించిన ఒక వ్యక్తిత్వ భాగం మాత్రమే ఆ వృత్తి. మనిషి వాస్తవిక స్వరూపం అదేనని చెప్పడం భావ్యం కాదు. **మౌలికంగా మనిషి బ్రహ్మనుండి వెలువడిన ఒక వెలుగు రేఖ. ఆ వెలుగు రేఖకు పూర్ణత్వం విడిగా ఉండడంలో కాక, తనకు జన్మస్థలం అయిన ఆ బ్రహ్మతో కలియడం ద్వారానే లభిస్తుంది.**

సంసారంలో మునిగి ఉన్న వ్యక్తులు వ్యక్తిత్వంలోని విభాగాలనే సర్వస్వంగా భావిస్తారు. ఆ విభాగాలను మెరుగు పెట్టడంలో, వెలికి తీయడంలో, సంస్కరించడంలో, అలంకరించడంలో తమ దృష్టినంతా లగ్నం చేస్తారు. అందువల్ల మనిషి మౌలిక ప్రయోజనం మరుగున పడిపోతుంది. ఇదీ వారి విచిత్ర పరిస్థితి.

వ్యక్తిత్వం ఉజ్వలంగా ప్రకాశించడం అన్నది భౌతికమైన సాఫల్యానికి అవసరమే. అయితే, లౌకికమైన సమృద్ధితోపాటు ఆత్మ సంబంధమైన ప్రగతి ఏమేరకు జరిగిందని కూడ బేరీజువేసుకుంటూ ఉండాలి. ఆ ప్రగతి అసలు జరిగిందా లేదా అని సమీక్షించుకుంటూ ఉండాలి. తరచుగా ఇలాంటి పరీక్ష జరుపుతూ ఉన్నప్పుడే ఈ ప్రవృత్తి మార్గంలో నివృత్తి మార్గపు భావదశ, అంతఃకరణ వంటి వాటిని వికసింపజేసుకో గలుగుతాము. ఈ దిశలో ఎంత ప్రగతి జరిగితే, ఎలాంటి ప్రగతి జరిగితే - ఆ మేరకు మనిషి తన లక్ష్యంవైపు పురోగమిస్తాడు.

ఈ విధమైన సమన్వయాత్మక మార్గం తప్పనిసరిగా అవసరం అవుతున్నది ప్రస్తుత సమయంలోనే అని చెప్పలేము. ప్రాచీన కాలంలో కూడ దీని అవసరం అనుభవంలోకి వచ్చింది. సమన్వయం ప్రస్తావన ఉపనిషత్తులలో అక్కడక్కడ కానవస్తుంది. కేవలం అవిద్యనే అనగా సంసారాన్నే ఉపాసన చేసే వ్యక్తి కారు చీకటిలో ప్రవేశిస్తాడనీ, కేవలం బ్రహ్మచర్చలో నిమగ్నుడైన వ్యక్తి మరింత గాఢాంధకారంలో ప్రవేశిస్తాడనీ ఈశోపనిషత్తు స్పష్టంగా పేర్కొన్నది. విద్య, అవిద్య రెంటినీ కలిపి తెలుసుకున్న వ్యక్తి అవిద్యద్వారా మృత్యువును దాటి, విద్యద్వారా అమృతాన్ని పొందుతాడని మరో చోట చెప్పబడింది.

వేదం ఇలా చెపుతోంది - **"ఏవ త్వయి నాన్యథేతోవస్తి న కర్మ లిప్యతే నరే॥"** అనగా - ఓ నరుడా! కర్మలో నిమగ్నం కావలసిన అవసరం లేని మార్గం ఈ ప్రపంచంలో లేదు.

**ఆత్మీయతను నేర్పే శిక్షణాలయం మన గృహం.**

పై అంశాలనుబట్టి ఒక విషయం స్పష్టమవుతోంది. ప్రాచీన కాలంలో కర్మ చేస్తూ, సమాజంలో సంసారంలో ఉంటూ పరమేశ్వరుణ్ణి పొందే అందరికీ ఆమోదయోగ్యమైన మార్గం నిర్ణయించబడింది. అయితే, సంసారాన్ని లక్ష్యంగా పరిగణించకూడదనీ, లక్ష్యాన్ని చేరడానికి అది సాధనం మాత్రమేననీ, దానిని ఉపయోగించాలనీ అనుభవించాలనీ, అయితే లక్ష్యాన్ని చేరడంకోసమే ఆ పనులు జరగాలనీ కూడ తీవ్ర హెచ్చరిక చేయబడింది. నేడుకూడ ఈ సూత్రాన్ని పాటించడం సాధ్యమే. ఋషులు నిర్దేశించిన **తేన త్యక్తేన భుంజీథా** (ఆ త్యాగం చేత పోషణ చేసుకో) అనే ఆదర్శాన్ని అనుసరించాలి. దాన్ని జీవితంలో అమలుచేయాలి. అలా చేస్తే, విషమతలవల్ల జనించిన ఈనాటి విష్వవణాన్ని నశింపజేయవచ్చు. అంతే కాదు. సుస్థిరమైన శాంతినీ, సువ్యవస్థనూ స్థాపించవచ్చు కూడా.

మన మహర్షులు ఈ సూత్రం ఆధారంగా సమాజాన్ని మలచే ఏర్పాటు కూడా చేశారు. సమాజానికి ఆవిధంగా కొన్ని కట్టుబాట్లు ఏర్పరచారు. వీటి ద్వారా మనిషి బ్రహ్మపదాన్ని పొందుతాడని ప్రకటించారు.

శరీరం పనికిమాలినదని చెప్పి దానిని కృశింపజేయాలని మహర్షులు నిర్దేశించలేదు. సమాజం కలుషితమైనదని చెప్పి దానిని వదిలిపెట్టాలని వారు ఆదేశించలేదు. జీవితం అనిత్యమని ప్రకటించి దానిని నిర్లక్ష్యం చేయమని వారు బోధించలేదు. బ్రహ్మతత్వంద్వారా అన్నింటినీ అఖండంగా, పరిపూర్ణంగా రూపొందించాలని వారు ఉపదేశించారు.

ఈ ఆదర్శాన్ని జీవితానికి అన్వయించడంకోసం వారు నాలుగు ఆశ్రమాల విశిష్ట వ్యవస్థను నిర్మాణం చేశారు. మొదటి దశలో, అనగా బ్రహ్మచర్య ఆశ్రమంలో, కరిగించి పోతపోసే ప్రక్రియ అమలు జరుగుతుంది. తద్వారా భావి వ్యక్తిత్వానికి గట్టి పునాది నిర్మాణం అవుతుంది. రెండవ దశలో, అనగా గృహస్థ ఆశ్రమంలో, వ్యక్తి గృహస్థుని బాధ్యతలను నిర్వహిస్తూ కుటుంబం, సమాజం సూత్రబద్ధంగా నడిచేందుకు దోహదం చేస్తాడు. మూడవ దశలో, వానప్రస్థ ఆశ్రమంలో, రెండవదశ విస్తరిస్తుంది, విరాట్ రూపం ధరిస్తుంది. అంతకుపూర్వం ఇంటికీ, కుటుంబానికీ పరిమితమై ఉన్న కర్తవ్యం అపరిమితం అవుతుంది. దాని కార్యరంగం భూగోళం అంతటికీ విస్తరిస్తుంది. ఈ దశలో 'వసుధైక కుటుంబమ్' (భూగోళమే ఒక కుటుంబం) అనే భావన వికసిస్తుంది. ప్రపంచమంతా తన విస్తృత కుటుంబమనీ, ఇక్కడి ప్రజలు భగవానుని రూపాలనీ పరిగణించి, వ్యక్తి వారికి సేవ చేస్తాడు. ఈ విధంగా విరాట్ బ్రహ్మకు సేవ చేస్తూ చేస్తూ వ్యక్తి నాల్గవ దశలో, సన్యాస ఆశ్రమంలో, ప్రవేశిస్తాడు. జీవన్ముక్తి దశను చేరుకుంటాడు.

పూర్ణత్వాన్ని పొందడానికి ఇవి క్రమబద్ధమైన నాలుగు మెట్లు. అయితే, నేడు సమాజాన్నీ సంసారాన్నీ మాత్రమే కాక నీతి నియమాలను, కట్టుబాట్లను అన్నింటినీ అవహేళన చేయడానికి మనిషి సిద్ధపడ్డాడు. ఈ పరిస్థితిలో అతడికి ఏమేరకు ఎంత త్వరగా ముక్తి లభిస్తుందో చూడవలసి ఉంది. ఇక్కడ ఒక విషయం స్పష్టం చేయాలి. ముక్తి బయట ఎక్కడో లేదు. అది మన లోపలనే ఉండే ఒక ప్రత్యేక స్థితి. సమాజంలోపల ఉంటూనే దానిని వికసింప జేసుకోవలసి ఉంటుంది. స్వర్గం, సద్గతి, శాంతి అని పిలువబడే ఈ స్థితిని ఈ జీవితంలోనే పొందగలుగుతాము.

☆☆☆

## మనోబలానిదే గెలుపు

ఆత్మవిశ్వాసాన్ని మించిన అద్భుత శక్తి మరేదీ లేదు. అసంభవాన్ని సంభవంచేసి చూపించగల అద్భుతమైన శక్తే ఆత్మశక్తి.

జపానులో ప్రఖ్యాతి చెందిన సేనాధిపతి నోబునాగ తక్కువ సైన్యంతో, అతి తక్కువ సాధనాలతో శక్తివంతులైన శత్రువుల్ని గడగడలాడించి తరిమికొట్టేవాడని ఖ్యాతి గడించాడు. దీనికి కారణం ఇతడు తనతో పనిచేసే సాటివారి మనోబలాన్ని పెంచి సంరక్షించే అద్భుతమైన కళలో ప్రవీణుడు. ఒకసారి ఇతడు సైనికుల మనోబలాన్ని పెంచటానికి ఒక ఉపాయాన్ని ఆలోచించాడు. వారిని దేవతా మందిరంలోనికి తీసుకొనిపోయి ఒక నాణేన్ని ఎగురవేసి, నాణెం తిన్నగా పడితే గెలుపు, బోర్లా పడితే ఓటమిగా దేవీమాత నిర్ణయమని పల్కుతాడు. ఎగురవేసిన నాణెం మూడుసార్లు తిన్నగా పడటంతో గెలుపు తమదేనని అందరూ ఆనందంతో గంతులువేశారు. తరువాత యుద్ధంలో తమ కంటె నాల్గు రెట్లు ఎక్కువ శత్రు సైన్యాన్ని చిత్తుచేసి విజయభేరి మ్రోగిస్తూ ఈ బహద్దూరులు తిరిగి వచ్చారు. అభినందన సభలో గల నోబునాగ రహస్యాన్ని విప్పి చెబుతూ - నాణెం 3 సార్లు బోర్లాపడిందని కానీ తను తన చాతుర్యంతో నాణెం తిన్నగా పడినట్లు అందరికీ చూపించానని, అందువలన వాస్తవానికి గెలుపు మనోబలానిదని తెలియజేశాడు.

నిరాశ, భయం చాలా హానికరమైనవి. వ్యక్తి వాటికి తనలో ఏమాత్రం చోటిచ్చినా సాధనాలు, సహకారాలు ఎంత పెద్ద సంఖ్యలో ఉన్నప్పటికీ, అవన్నీ నిరర్థకమే అవుతాయి.

- ప్రజ్ఞాపురాణం నుండి

**దోషదృష్టి దాంపత్య జీవితానికొక శాపం.**

మనం - మన ఆరోగ్యం

# కృత్రిమ జీవన విధానమే కేన్సరుకు మూలం

స్త్రీ ఆరోగ్యానికి భంగం కలిగించే భయంకర వ్యాధుల్లో కాన్సరుకు మొదటి స్థానం ఇవ్వవలసి వస్తున్నది. అధ్యయనం చేయటం వల్ల మనకు తెలుస్తున్నది - విశ్వవ్యాప్తంగా మహిళలలో 60 శాతం వరకూ ఏదో ఒక అవయవానికి కాన్సరు సంక్రమిస్తున్నదనే విషయం. ఇందులో 40 శాతం స్తనాలకే వస్తుంది.

ఇంతకు ముందు బ్రెస్ట్‌కాన్సరు రావటానికి కారణాల గురించి విస్తృత పరిశోధన జరిగింది. చాలా దేశాల్లో, అమెరికన్ మెడికల్ ఎసోసియేషన్ ఆరోగ్య సంబంధ పత్రికల్లో దీని గురించి పూర్తిగా కొత్త విషయాలు ప్రకటించటం జరిగింది. దీనికి ముఖ్య కారణం స్థూలకాయమని తెలిసింది. పరిశోధన జరిపిన వారిలో ముఖ్యుడైన డాయన్ విల్సన్ హెచ్చరిక చేస్తూ- మహిళలు 18 సంవత్సరముల వయస్సు మొదలుకుని ముట్లుడిగే కాలం వరకూ తమ బరువు 5-10 పౌండ్లకు మించి పెరగకుండా చూచుకోవాలనీ, లేకపోతే బరువు పెరగటం మూలంగా వక్షోజాల కాన్సరు రావచ్చుననీ తెలియజేశారు.

షుమారుగా ఇదే విధంగా హార్వర్డ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్‌లో పని చేస్తున్న చైనాజాతికి చెందిన అమెరికన్ శాస్త్రవేత్త ఫిఫింగ్ హువాంగ్ తెలియజేస్తారు. లావెక్కటం వల్ల శరీరం యొక్క స్వాభావిక ప్రక్రియలో అవరోధాలు కలిగి దాని వల్ల కాన్సరు రావచ్చునంటారు.

హార్వర్డ్ స్కూలులో షుమారుగా వెయ్యిమంది స్త్రీల మీద అధ్యయనం జరిగింది. ఇందులో 50 శాతం మించి స్త్రీలు స్థూలకాయులు. మిగిలిన వారు సన్నటి వారు. స్థూల కాయం గలవారిలో 40 శాతం మించి ముట్లుడిగిన తర్వాత బరువు పెరిగి పోయింది. వారిలో 80 శాతం మందికి వక్షోజాల కాన్సర్ ఉన్నది. సన్నని వారిలో 5 శాతం వారికి మాత్రమే కాన్సర్ జన్యువులు కనిపించాయి. అది గూడా స్తనాలలో కాక ఇతర అవయవాలలో.

దీనికి ముందు జరిగిన పరిశోధనలలో తెలిసిన విషయం - ముట్లుడిగే ముందు వచ్చే కాన్సర్‌ను లావు, బరువు తగ్గటం వల్ల నిరోధించవచ్చునని. అంతకు ముందు స్త్రీలలో అండాలు విడుదల కాకపోవటం వల్ల స్థూలకాయం వస్తున్నదని అనుకునే వారు. అండం విడుదల ఆగిపోతే ఈస్ట్రోజన్ హార్మోను స్రావం గూడా తగ్గిపోతుంది. ఈ హార్మోను కాన్సరుకు కారణం. ఈ హార్మోను స్రావం తగ్గిపోతే కాన్సరు వచ్చే అవకాశం తగ్గిపోతుందని.

ప్రస్తుతం జరుగుతున్న అధ్యయనం దీనికి బలం చేకూరుస్తున్నది. కాని, ఈ అధ్యయనంలో ముట్లుడగటం (మెనోపాజ్) తరువాతి స్థితిని గురించి గొప్ప విషయాలు తెలిశాయి. పరిశోధనావేత్తల ననుసరించి మాసికధర్మం ఆగిన (మెనోపాజ్) తరువాత, ప్రౌఢవయస్సులో గర్భాశయ ముఖ ద్వారం మూసుకుపోయినప్పుడు, శరీరం స్థూలం కావటం ఈస్ట్రోజన్‌కు మూలమవుతుంది. ఈ సమయంలో ఈస్ట్రోజన్ తగినంతగా ఉత్పత్తి అవుతుంటుంది. అది చాలా ప్రమాదకరం. శాస్త్రజ్ఞులు చెప్పేది - ఈ స్థితి రాకుండా చేసుకోవటానికి రెండు ఉపాయాలున్నాయని. ఒకటి శరీరం బరువు పెరగకుండా నియంత్రణ చేసుకోటం. లేదా ఈస్ట్రోజన్ స్రావాన్ని మందులు వేసుకుని తగ్గించుకోటం. ఈ రెండిటిలోనూ బరువు తగ్గించుకోటమే మంచిదని వారంటున్నారు.

లివర్‌పూల్ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్త పాల్ వాచ్‌టెల్ ఎన్నో సంవత్సరాల తీవ్ర పరిశోధన అనంతరం ఇది భ్రమ అని కొట్టిపారవేశారు. కన్యలుగా నిలచిపోయినవారికి, సంతానం లేని గృహిణులకు బ్రెస్ట్‌కాన్సర్ ప్రమాదం ఎక్కువగా కనిపిస్తున్నదన్నారు. ఆయన అటువంటివారు నాలుగు వందల మంది మీద పరిశోధన జరిపారు. అందులో పదిశాతం మందికి కాన్సరు కనిపించింది. కాని ఇతర అంగాలకు. పదిహేను శాతం మందికి స్తనాలలో గడ్డలు ఉన్నాయి. ఇందులో ఆరుశాతం కాన్సరే. మిగిలిన వారు ఆరోగ్యంగానే ఉన్నారు.

పై విషయంలో శరీర శాస్త్రం స్వీకరించిన విషయం గర్భావస్థ తదనంతరం నారీ దేహంలో ఒక విశిష్ట రసస్రావం జరుగుతుంది. ఇది తల్లి బిడ్డలకు సంరక్షణ కల్పిస్తున్నది. కాని అంత మాత్రాన వారు క్షేమంగా ఉంటారని చెప్పలేం. అందరిలో ప్రకృతి సహజమైన సంక్షేమం ఉంటుంది. రోగం అంటే అర్థం శరీరం యొక్క అవ్యవస్థ, శరీర ప్రక్రియలకు ఏదో విధంగా బాధ కలిగినప్పుడు, అవి అస్తవ్యస్తమైనప్పుడు వ్యాధిరూపంలో అది బయట పడుతుంది. కృత్రిమమైన జీవనశైలిలో ఇటువంటి వ్యతిక్రమం ఎక్కువగా కనిపిస్తుంది. వారిలో రోగాలు ఎక్కువగా కనిపిస్తాయి. ప్రకృతి ఒడిలో జీవించే వనవాసుల జీవిత పద్ధతి ఎక్కువ ప్రాకృతికంగా ఉంటుంది. వారి శారీరక కార్యకలాపాలు స్వాభావికంగా ఉంటాయి. వారికి ఎటువంటి చేటూ కలగదు. ఎక్కువ మంది ఆరోగ్యంగానే ఉంటారు.

కాన్సరు వచ్చినప్పుడు శరీరం యొక్క స్వాభావిక లయ దారి తప్పుతుంది. కొన్ని కణాలు విపరీతంగా పెరిగిపోతాయి, అదే కాన్సరు. దీనికి కారణం ఇంతవరకూ ఎవరూ కనిపెట్టలేదు. పారిశ్రామిక ప్రగతి వల్ల వాతావరణ కాలుష్యం పెరగటం, కృత్రిమాహారం తీసుకోటం, మారుతున్న జీవనశైలీ, స్తనాలలోనూ యితర అవయవాల్లోనూ కాన్సరు రావటానికి దోహదం చేస్తున్నాయి.

కృతిమ జీవన విధానం ప్రకృతి విరుద్ధం. మనం ఎక్కువగా ప్రాకృతికంగా ఉండాలి. ప్రాకృతిక ఆహారం తీసుకోవాలి. దాంతో శరీర క్రియలలో సంతులనం, నియంత్రణ ఉంటాయి. శరీరం లోపల సువ్యవస్థ కలుగుతుంది. రోగాలు రావు. కాన్సరేగాక ఇతర వ్యాధులూ రాకుండా ఉంటాయి. అది గ్యారంటీ.

అనువాదం - డి.వి.ఎన్.బి.విశ్వనాథ్

**ఇచ్చేది తక్కువ, కోరేది ఎక్కువ - ఇదే ప్రపంచంలో తగాదాలకు మూలం.**

### వ్యక్తి నిర్మాణం

# పారిపోకు - పోరాడి జయించు

రకరకాల బాధలు చుట్టుకుంటే ఏమయింది? ఈ పరిస్థితి ప్రతిమనిషి జీవితంలోనూ ఎప్పుడో ఒకప్పుడు వస్తూనే ఉంటుంది. ఎటొచ్చీ ఆ కష్టాలుండే సమయంలో హెచ్చుతగ్గులుండవచ్చు. కష్టం కలుగగానే ఏడవడం, తల బాదుకోవడం, నీరసంతో చతికిల పడిపోవడం, చేతు లెత్తేయడం, గుండెలు బాదుకోవడం మొదలయినవాటి వలన వచ్చిన కష్టం రెండింతలౌతుంది. జీవితమంటే పడుగు, పేకలతో నేసిన బట్ట వంటిదని, ఉన్నతి, అవనతుల మిశ్రమమని తెలుసుకోవాలి. వెలుగు, నీడలవలె జయాపజయాలు రెండూ ఒకదాని వెనుక మరొకటి వస్తూనే ఉంటాయని అర్థం చేసుకోవాలి. ఉవ్వెత్తున లేచే తరంగాలవలె కష్టాలు వచ్చి వాటంతట అవి విరిగిపోతూ ఉంటాయి. గట్టున కూర్చుని తరంగాల అందాలను చూచే కళాకారునివలె జీవన నాటకంలోని ఆనందాన్ని అనుభవించేవాడే జీవన సార్థక్యం పొందినవాని క్రింద లెక్కింపబడుతాడు.

రాత్రి అన్నదే రాకుండా ఎప్పుడూ పగలే ఉండడముంటుందా? ఎప్పుడూ పుట్టినరోజే చేసుకుంటూ మరణానికి సంబంధించిన దుఃఖమే లేని జీవితమంటూ ఉంటుందా? నిరంతరమూ సుఖాలే ఉంటూ దుఃఖమనేది లేని రోజులంటూ ఉంటాయనుకోవడం నిజాన్ని చూడగల కళ్లులేని వాళ్ల లక్షణమౌతుంది. నిజమైన విజ్ఞుడెవరంటే - సుఖకరమైన పరిస్థితుల పూర్తి లాభాన్ని అనుభవిస్తూ, దుఃఖ ఘడియలు వస్తే వాటి నెదుర్కోడానికి కావలసిన శౌర్యాన్ని, సాధన సంపత్తిని ప్రోగు చేసుకొనగలవాడే.

అంతే కాదు. దుఃఖం కేవలం ఏడిపించేదే కాదు. పరిస్థితులను ఎదుర్కోగల గొప్పసాహసాన్ని, శౌర్యాన్ని కూడా కలిగిస్తుంది. దీని వలన ఇతరులకు కలిగే దుఃఖాల విషయంలో సానుభూతిని పొందడం జరుగుతుంది. ఎప్పుడూ కష్టమంటే ఎరుగని వ్యక్తి ఇతరుల కష్టాలను ఏవిధంగా అర్థం చేసుకోగలడు? బాధలు పడిన వాడే ఇతరుల బాధలను తెలుసుకోగలుగుతాడు. పైగా కష్టాలే లేని జీవనం కలవారంటూ ఎవరున్నారు? అవతార ప్రభువైన శ్రీరాముడు అడవులు పట్టుకు తిరగవలసి వచ్చింది. అపరిమితమైన సామర్థ్యమున్నా రావణుని మోసపు వలలో చిక్కుకోవలసి వచ్చింది. ఐతే ఆయనకు కలిగిన బాధ ఆయనను చేతులు కట్టుకు కూర్చునేటట్లు చేయలేదు. శౌర్యానికి కొలబద్ద అయింది. లోకాలను జయించిన రావణుడు పరాజయం పాలు కావలసివచ్చింది.

ధర్మరాజు ఎంతటి నీతిమంతుడైనా శకుని కుతంత్రంలో ఇరుక్కోవలసి వచ్చింది. అవమానమన్న విషమును అనేక గ్రుక్కలు త్రాగి సోదరులతో సహా దేశం నుంచి బహిష్కరింపబడడం జరిగింది. ఐతే వనవాస సమయం అతనిని గొప్ప తపస్సంపన్నునిగా మార్చింది. అర్జునుడు ఆ సమయంలోనే అనేక దివ్యాస్త్రాలను పొందగలిగాడు. ఆ కష్టాలు ఐదుగురు సోదరులలో కష్టాలతో పోరాడగల ఓర్పును, సాహసాన్ని ఎంతగా పెంచాయంటే ఎంతటి కష్టాలయినా వారిముందు ముక్కలు చెక్కలై పారిపోయాయి.

కష్టాలు ఏవిధమైనవి? ఏవిధంగా వస్తాయి? అన్న ప్రశ్నలకు సమాధానాలుగా వారివారి అనుభవాలు, అనుభూతులూ ఉంటాయి. ఐతే యీ ప్రపంచంలో ఇతరుల సుఖసంతోషాలను కళ్లు విప్పి చూడలేని ఈర్ష్యాళువులకు కూడా తక్కువేమీ లేదు. వాళ్లు చేసే అనాచారాలకు, చీకటి పనులకు అడ్డంవస్తే వాళ్లు శత్రువులుగా తయారవుతారు. అనుచితమైన లాభాలను సంపాదించడం కోసం ఉత్సాహపడేవారు కొల్లగొట్టడానికి, దురాక్రమణలకు పూనుకుంటారు. ఈ విధమైన రాక్షస తత్వాలు అనాదిగా ఉన్నాయి, అనంతకాలంవరకూ ఉంటాయి. వాటి నుంచి తప్పించుకోవడం చాలా కష్టం. ఐతే మన శౌర్య, ధైర్యాలను చక్కగా పెంచుకోగలిగితే అవి వాటివైపుకు వచ్చే సాహసం చేయలేక తోకముడుస్తాయి. వ్యక్తిగతంగా సమర్థతను పెంచుకోవడంతోబాటు ఆదర్శములను పాటించి విశ్వసించే వారిని పెంచడం వలన ఆకతాయిల కార్యకలాపాలను అడ్డుకోవడం కుదురుతుంది. ఆక్రమణకారులను అడ్డుకుని ప్రతీకారం చేయగలిగితే తమకు కొంత రక్షణ కలుగుతుంది. వారి నెదిరించనక్కరలేదని, ఏవిధమైన అవాంఛనీయ సంఘటనా జరుగలేదని భావించి చేతులు కట్టుకు కూర్చుంటే అది ఆకాశకుసుమాల నేరుకుందామనే తెలివితక్కువ ఆలోచన కింద లెక్క ఔతుంది. ఈ స్థితిలో అడ్డంకుల నెదిరించడం, సంఘర్షణల మధ్య నుంచి త్రోవ చేసుకు బైట పడడం కన్న మరొకమార్గం లేనేలేదు.

పరిస్థితుల అనుకూల, ప్రతికూలతలను కాదనడానికి ఆస్కారమే లేదు. శారీరకంగా బాధ కలుగవచ్చు, రోగమేర్పడవచ్చు, కుటుంబం సక్రమంగా నడవకపోవచ్చు, కుటుంబంలోని సభ్యుడెవరైనా మరణించవచ్చు. దుఃఖ సంతాపాలు కలుగవచ్చు. ఇట్టి దుర్దశ ప్రతి కుటుంబంలో ఏర్పడుతూనే ఉంటుంది. ఎప్పుడో ఒకప్పుడు అనుభవించవలసి వస్తూనే ఉంటుంది. తాను కోరిన సాఫల్య మెవరికేనా కలిగిందా? మనసున రేగిన కోరికలన్నిటినీ తీర్చే కల్పవృక్ష మెవరి దొడ్లోనేనా ఉన్నదా? ఉన్న చెట్లను సమూలంగా పెరికి పారవేసే తుఫాన్‌లు వస్తూనే ఉంటాయి. అటువంటి స్థితిలో బలహీనమైన మనస్థితి కలవారు నీరసంతో కూలబడిపోతారు.

ప్రతిమనిషియొక్క, ప్రతివస్తువుయొక్క అంతం ఒక నియమం ప్రకారం జరుగుతూనే ఉంటుంది, మన కోరికలు, ప్రయత్నాలు ఎల్లప్పుడూ ఎక్కడ నెరవేరతాయి? ఫలిస్తాయి? అవన్నీ వాటి పద్ధతిలో అవి నడుస్తూ ఉంటాయి. ఐతే మనిషి మాత్రం నీళ్లు కారిపోకూడదు. అట్లా ఉండడంలోనే ఆతని గౌరవముంది. సముద్రతీరంలోని రాతిగుట్టలు అనాదికాలంగా అట్లాగే నిలిచి ఉన్నాయి. సముద్ర తరంగాలు వాటిని తాకడం ఆపనే లేదెప్పుడూ. అట్లాగే ఆ రాతి గుట్టలెప్పుడూ పరాజయాన్ని అంగీకరించనూ లేదు.

కావలసింది సంఘర్షణ కానీ పారిపోవడం కాదు; నిర్వీర్యతకాదు, సాహసము; అకర్మణ్యతకాదు, శౌర్యం; దుఃఖాశృవులు కావు ధైర్యం. ఇవే మనిషికి గౌరవం కలిగించేవి. కష్టాలు చుట్టుముడితే ఏమౌతుంది? మనం నీరు కారిపోకూడదు, అపజయాన్ని అంగీకరించకూడదు. పరిస్థితుల కుట్రను ముక్కలు చేసి మనం మన మానవీయతను నిరూపించుకోవాలి. సవాలును స్వీకరించడంలోనే మానవ గౌరవ గరిమ. దానికి భయపడడానికి బదులు ఈరకమైన శ్రేయోదాయక జీవనం జీవించాలి.

**గృహస్థ ధర్మం జీవితంలోని పవిత్రము,ఆవశ్యకము,ఉపయోగకరము అయిన అనుష్ఠానం.**

## సాధన విజ్ఞానం

# ఆస్తికత్వ, ఉపాసనల ఆంతర్యం

ఈ సృష్టికి అధిపతి భగవంతుడు. ఆయన ప్రతి వస్తువును తయారు చేసి దానికి పరిమితులను, నియమాలను విధించాడు. సృష్టిలోని ప్రతి పదార్థం, ప్రతి ప్రాణి తనకు నిర్ధారించబడిన నియమాలను పాటిస్తూ ఈశ్వర ప్రయోజనాన్ని నెరవేర్చే విధంగా నడుచుకుంటాయి. ఒక్క మానవుడు మాత్రమే తన బుద్ధిని, ప్రకృతిని దురుపయోగం చేస్తుంటాడు. దుర్మార్గాన్ని ఆశ్రయించి తనకు, ఇతరులకు కష్టాలు తెచ్చిపెడుతుంటాడు. ఈ పథభ్రష్టత్వాన్నుంచి రక్షించేందుకే 'ధర్మ' రచన అవసరమైంది. ఋషులు ఎంతో దూరం ఆలోచించి ధర్మదేవతను నిలబెట్టారు. దీని ద్వారా మనిషి దుర్బుద్ధి నుండి, దుష్ప్రవృత్తి నుండి రక్షింపబడతాడు. ధర్మశోధన, ప్రయత్నం, సాంప్రదాయాలు, నమ్మకాలు అన్నీ మనిషి తన పరిధిలో నియమాలను పాటిస్తూ జీవించడానికి ఉద్దేశింపబడినాయి.

ధర్మానికి మొట్టమొదటి ఆధారం - ఆస్తికత్వం, ఈశ్వరుని మీద విశ్వాసం. పరమాత్ముడు సర్వవ్యాపి, అందరినీ సమానంగా చూస్తాడు, న్యాయశీలుడు. వీటిమీద నమ్మకమే ఆస్తికత్వానికి పునాది. మనిషి దుష్ప్రవృత్తుల మీద అంకుశంలా పనిచేసే సమర్థత ఈ నమ్మకానికి ఉంది. సర్వవ్యాపి అయిన ఈశ్వరుని ముందు మన రహస్య ఆచరణలు ఏవీ దాగవు. సమాజం, పోలీసుల కళ్ళుగప్పి తప్పించుకోవచ్చు. కానీ పరమాత్ముని ముందు ఆ కుప్పిగంతులు సాగవు. ఆయన న్యాయమూర్తి కూడ. ఆయన న్యాయవ్యవస్థ అందరికీ సమానంగా ఉంటుంది. నిష్పక్షపాతి అయిన న్యాయాధికారి లోక మర్యాదలను రక్షించడానికి ప్రతి అపరాధినీ నిష్పక్షపాతంగా శిక్షిస్తాడు. ఈశ్వరునికి మనం చేసే ప్రతి పాపం, అపరాధం తెలుస్తూనే ఉంటుంది. ఈరోజుగాని, రేపు గాని ఆ పాపాలకు అతడు తప్పక దండన విధిస్తాడు. ప్రభుత్వంనుండి కోర్టు నుండి తప్పించుకోవచ్చు. కాని పరమేశ్వరుని నుండి తప్పించుకోవడం అసాధ్యం. ప్రభుత్వదండన నుండి, సామాజిక దండన నుండి సులభంగా తప్పించుకోవచ్చనే భరోసా మనలను అత్యధిక నేరాలకు పురికొల్పుతుంది. అలాంటి చతురత సర్వవ్యాపి, న్యాయాధికారి అయిన ఈశ్వరుని ముందు చెల్లదు. ఈ విషయం మీద నమ్మకం ఉన్నవారు పాపాలకు భయపడతారు. నియమాలను పాటిస్తారు. సభ్యతతో సజ్జనులుగా జీవిస్తారు.

ఆస్తికత మన సదాచారాన్ని పరిపూర్ణంగా ఉంచుతుంది. అందువలనే ధర్మరచనలో ఆస్తికత్వానికి ప్రథమ స్థానం అనివార్యమైంది. సత్కర్మల సత్పరిణామం, దుష్కర్మల దుష్పరిణామం ఈ వేళ కాకపోతే రేపయినా లభించి తీరుతుంది. ఈ నమ్మకం వ్యక్తిగత, సామాజిక జీవనంలో నీతిగా కర్తవ్యపాలనను ఆచరించే ప్రేరణ నిస్తుంది. సత్కర్మలు చేసేవారికి ఈరోజు ప్రశంసలు, గౌరవం, విజయం లభించక పోయినా ఈశ్వరుడు భవిష్యత్తులో వాటిని తప్పక ఇస్తాడు. ఈ నమ్మకం వారిని నిరుత్సాహానికి గురిచేయదు. అపజయాలు ఎదురైనా వారు సన్మార్గంలోనే పయనిస్తారు. అలాగే - దుష్కర్మలు చేసేవారు కూడ నిర్భయంగా ఉండజాలరు. ప్రభుత్వ దండన నుండి తప్పించుకున్నా నరకంలోనైనా యాతన అనుభవించవలసివస్తుందని భయపడుతూ ఉంటారు. ఈశ్వరుని దర్బారులో ఎవరూ ఎవరినీ మోసం చేయలేరు. ఆయనకు అందరూ సమానులే. అందరూ తనవారే. అందరూ పరాయివారే. ఆచరణలో నిష్కల్మషంగా ఉండేవారు ఆయనకు ప్రియులు. అలాకానివారు ఘోర శత్రువులు. అందరినీ సమానంగా చూసే వారి స్వభావం ఇలాగే ఉంటుంది. ముఖస్తుతికి, లంచాలకు వారు లొంగరు. ఈ విషయాలను సరియైన తరహాలో జనమానసంలోకి ప్రవేశపెడితే వ్యక్తులు ఖచ్చితంగా దుర్మార్గంపట్ల విరక్తులవుతారు. సన్మార్గంవైపు నీతిగా పయనిస్తారు. ఆస్తికత్వం ఇచ్చే అతి గొప్ప బహుమతి ఇదే. అందువలననే దీనిని ధర్మానికి ప్రధాన అంగంగా పరిగణించారు. వ్యక్తిగత ప్రగతి, సమాజ శాంతి అనేవి సజ్జనత్వంపై, నియమపాలనపై ఆధారపడి ఉంటాయి. ఈ రెంటికీ ప్రేరణ ఆస్తికత్వం నుండి లభిస్తుంది.

ఈనాడు సమాజమంతా వికృతాలతో నిండిపోయింది. ఆస్తికత్వం కూడ వికృతరూపం ధరించింది. ఏదో కొద్దిసేపు స్తుతించి, కానుకలు, పూజలు లాంటి చిన్న చిన్న లంచాలతో ఈశ్వరుడు మన మాట వింటాడని, యోగ్యతలేకున్నా పెద్ద పెద్ద ప్రయోజనాలు పొందగలమనీ, పాపాల దండన నుండి రక్షింపబడవచ్చనే భ్రమలో ప్రజలు పడిఉన్నారు. వాడుకలో ఉన్న అనేక కర్మకాండలు ఇలాంటి కల్పనలమీదే ఆధారపడి ఉన్నాయి. ఇదే కనుక నిజమైతే ఈశ్వరుని మూలస్వరూపమే వికృతంగా మారుతుంది. అంతేగాక ఆయనను పక్షపాతి, లంచగొండి, ముఖస్తుతికి ఆనందించేవాడు, అవ్యవస్థను, చీకటిని వెదజల్లేవాడుగా చెప్పవలసి వస్తుంది. ఇలాంటి ఆస్తికత్వం ప్రమాదకరం అవుతుంది, అయింది కూడ. దేవుడికి ప్రసాదాన్ని, జంతుబలిని ఇచ్చి స్తుతిస్తే అతడు ప్రసన్నుడై మనకు అనేక వరాలిస్తాడని ప్రజలు నమ్ముతూ ఉంటారు. వాటిని పొందడానికి తమకు యోగ్యత ఉందా లేదా? కర్మఫలం కారణంగా ఆ విజయాలు లభిస్తాయా, లేదా - అనే ఆలోచన లేకుండా తమ పూజా పురస్కారాలు ఆ అవరోధాలను అధిగమింపజేసి తమ మనోవాంఛలను తీరుస్తాయని జనం అనుకుంటారు. ఈనాటి ఆస్తికత్వ వికృతరూపం ఇలానే ఉంది. ప్రజలు ఈ ఆధారం మీదే పూజా పురస్కారాలు ఆడంబరంగా చేస్తున్నారు. అభీష్టం నెరవేరక పోయినా, అందుకు ఆలస్యం జరిగినా

**అవసరాలు తగ్గించుకో,సహజంగా జీవించు.**

పూజాసామాగ్రిని విసిరికొడుతుంటారు. ఈశ్వరుడిని తిడుతుంటారు. మూర్ఖత్వంతో నిండిన ఈ ఆస్తికత్వానికి ఎటువంటి ఆధారమూ, ఆదర్శమూ లేదు.

ఆస్తికత్వ ఉనికిని పరిపక్వం చేయడం కోసం ఉపాసనను ఆధారం చేసుకోవాలి. పూజ, ధ్యానం, జపం, దేవ దర్శనం, భగవంతుని గుణగానం, తత్వ చర్చ, ఆత్మ చింతన, కీర్తన, అనేక కర్మకాండల ద్వారా ఈశ్వరుని మర్చిపోయే అపరాధం నుండి బయటపడవచ్చు. ఇలా భగవంతుని స్మృతి మెదడులో ఉన్నప్పుడు ఆత్మకి, పరమాత్మకి సంబంధం ఏమిటి? ఆయన మనలను ఇక్కడకు ఎందుకు పంపించాడు? జీవన ఉద్దేశ్యం ఏమిటి? శాంతికోసం, ప్రగతికోసం ఈశ్వరుని ఆజ్ఞాపాలన, నియమపూర్వకమైన అనుశాసనం మనం పాటించడం అనివార్యమా? మొదలయిన ప్రశ్నలు తలెత్తుతాయి. ఈశ్వరుని మరచిపోవడం వలన వీటిలో ఏ ఒక్క ప్రశ్న తలెత్తదు. మానవులు కోరికల జంజాటంలో చిక్కుకుపోయి వ్యర్థమైన, అనర్థదాయకమైన కర్మలలో నిరంతరం కొట్టుమిట్టాడుతూ అమూల్యమైన మానవ జీవితాన్ని నాశనం చేసుకుంటారు. ఇది ఒక పెద్ద హాని. అందువలనే నాస్తికతను, ఈశ్వర ద్వేషాన్ని పెద్దలు ఒక పాపంగా పరిగణిస్తారు.

ఉపాసన అంటే - సమీపంలో కూర్చోవడం అని అర్థం. ప్రతి ఆస్తికుడు ఎంతోకొంత సమయం ఉపాసన కోసం ఉపయోగించాలి. ఆ కాస్త సమయంలో ఈ శరీరం, మనస్సు, ధనం, వర్చస్సు, వైభవం అన్నీ ఈశ్వరునివే అని భావించాలి. వాటిలో అతి తక్కువ భాగాన్ని మనకోసం ఉంచుకొని మిగిలిన భాగాన్ని భగవంతుని కోసం అర్పించాలి. భక్తి అంటే ప్రేమ. ప్రేమకు అర్థం సేవ, దానం. నిజమైన భక్తుడు ఈశ్వరుడు ఇచ్చిన కానుకల నుండి అతి తక్కువ భాగాన్ని తనకోసం తీసుకుంటాడు. మిగిలిన దానిని ఆయన చరణాలకే అర్పిస్తాడు. ఆత్మ పరమాత్మ, అనగా శాశ్వత ఆత్మ యొక్క సమగ్ర శక్తి. శాశ్వత ఆత్మనే విశ్వాత్మ అని కూడ అంటారు. విశ్వాత్మకు ఆత్మ సమర్పణ చేయడం పేరే ఉపాసన. ఈ ప్రక్రియ ఇలా ఉండాలి - మనం మనకోసమేకాక, సమస్త విశ్వం కోసం, ప్రాణుల హితంకోసం, సమాజ సుఖ సౌకర్యాలను పెంచడంకోసం జీవించాలి. విశ్వంలోని ఆత్మలకు సుఖశాంతులు ప్రాప్తించే విధంగా మన కార్యపద్ధతి ఉండాలి.

ఉపాసన చేసేటపుడు భగవంతుని వెలుగు, అమృతం, సత్యం కోసం యాచిస్తాము. మంచి జ్ఞానంకోసం యాచిస్తాము. మహాత్ముల ఆలోచనలను, కర్మలను అనుసరించి మానవ జీవితాన్ని సార్థకం చేసుకునే ప్రేరణను, శక్తిని, ఉల్లాసాన్ని ఈశ్వరుడు మనకు ఇచ్చుగాక - అని యాచిస్తాము. ఈశ్వర ప్రాప్తికోసం చేసే ఉపాసన దైవీ గుణాలతో శక్తివంతులమయ్యే ప్రేరణ ఇస్తుంది. ఈశ్వరుడు ఉదారత, కరుణ, సదాశయం, పవిత్రత, న్యాయనిష్ఠ మొదలయిన సద్గుణాల సాగరం. అతని సామీప్యం మనలో అలాంటి శక్తులను ఉత్పన్నం చేయుగాక - అనే యాచనే ఉపాసన సమయంలో చేయాలి. మనకు తోడుగా భగవంతుడు ఉన్నాడు. ఈ నమ్మకంతో ప్రతి వ్యక్తి ప్రతి నిమిషం నిర్భయంగా ఉండవచ్చు.

మనం ఆస్తికులం కావాలి. ప్రతిరోజూ కొంత సమయాన్ని నియమిత ఉపాసన కోసం కేటాయించాలి. అప్పుడు భగవంతుని నిర్దేశాలను తప్పక పాటించవచ్చు. ఫలితంగా వ్యక్తిగత సదాచరణ, సామాజిక కర్తవ్యపాలనల ప్రవృత్తి నిరంతరం పెరుగుతూ ఉంటాయి. సర్వత్రా వైభవం, సమృద్ధి, ప్రగతి, ప్రశాంత పరిస్థితులు ఉత్పన్నమవుతూ ఉంటాయి.

అనువాదం : డి.వి.ఆర్. మూర్తి

## మనోబలం అనే శస్త్రచికిత్స

జర్మనీకి చెందిన జనరల్ రోమెల్ అనేక యుద్ధాల్లో గెలుపొందిన తీరు తెన్నులు చూచి, అతడు మామూలు వ్యక్తి కాదని, చమత్కారాలు, మంత్ర తంత్రాలు తెలిసిన మాంత్రికుడని భావించేవారు. ఆఫ్రికాలో ఇతడు బ్రిటిష్ సైన్యాన్ని ఎదుర్కోవలసి వచ్చినపుడు వారి సైన్యశక్తి వీరిశక్తికి 10 రెట్లు ఎక్కువైనప్పటికీ బ్రిటిష్ సేన పరాజయంతో 500 మైళ్లు వెనుకకు పరుగెత్తి పారిపోవలసిన పరిస్థితిని కలుగజేశాడు. గెలుపు అసాధ్యం అనుకొన్న అనేక పోరాటాలకు రోమెల్‌ను పంపటం, ఆయన అవలీలగా గెలుపొంది తిరిగి రావటం సంభవించేది. సైనికులలో ఉత్సాహాన్ని నింపే అద్భుత సామర్థ్యం రోమెల్‌లో ఉండేది.

ఒక పోరాటంలో ఇతని తల మూడు ముక్కలైంది. ఎట్టి పరిస్థితులలోను జీవించే ఆశ లేదన్నారు డాక్టర్లు. ఈయన డాక్టర్లకు ఉత్సాహాన్నిచ్చి మనోబలం అనే శస్త్ర చికిత్సతో మృత్యువుని ఓడించాడు. బ్రద్దలైన తలను ఎలా కుట్టి, ఎలా సరిచేస్తే తాను జీవిస్తాడో డాక్టర్లకు మృత్యుశయ్య పైనుండి అద్భుతమైన సలహాలనిచ్చి ఆశ్చర్యచకితుల్ని చేశాడు. తరువాత కూడా యథా ప్రకారం అనేక పోరాటాల్లో పాల్గొని ఘనవిజయాలు సాధించాడు.

మృత్యువు కూడా ఆత్మవిశ్వాసం గల వ్యక్తి గుప్పెటలో ఒరిగి కూర్చుంటుంది అనటానికి ఏ మాత్రం సందేహం అవసరం లేదు. తర్కం అంతకంటే అనవసరం. నిర్భయంగా జీవించడమనేది పురుషార్థాలలో కెల్లా గొప్ప పురుషార్థం. ఈ స్థితిని మహా మానవులందరూ ప్రత్యక్షంగా చూపగలిగారు.

- ప్రజ్ఞాపురాణం నుండి

**ప్రతి జీవిత సమస్యకు పరిష్కారం భగవద్గీతా జ్ఞానం.**

## బోధకథ

# శరీర సౌందర్యంకన్న శీల సౌందర్యం మిన్న

పంజాబులోని ఒక నగర వీధిలోనుండి మహారాజు రణజీత్ సింహుడు ఏనుగు మీద వెళ్తున్నాడు, చుట్టూ అనేక మంది సైనికులు ఉన్నారు. అయినా ఎలా వచ్చిందో ఒక గులకరాయి విసురుగా వచ్చి ఆయన తలకు తగిలింది. గాయం నుండి రక్తం కారసాగింది. నిర్ఘాంతపోయిన సైనికులు రాయి విసిరిన వారి కోసం వెతకసాగారు. రాజుగారి ఊరేగింపుపై ఏమాత్రం ఆసక్తి చూపకుండా దారిప్రక్కనే ఉన్న రేగు చెట్టు మీదకు రాళ్లు విసురుతున్న ఒక బాలుణ్ణి పట్టుకున్నారు.

మరునాడు ఆ పిల్లవాడిని దర్బారులో ప్రవేశపెట్టారు. ఏ శిక్ష విధిస్తారోనని భయంతో వాడు గడగడ వణికి పోతున్నాడు. రాజుగారి తలకు కట్టు కట్టబడిఉంది. సైనికులు పిల్లవాడిని చూపి తగిన శిక్ష విధించమన్నారు. అంతా విన్నాక మహారాజు ఇలా అన్నాడు - ఇతడు నన్ను కొట్టాలని రాయి విసరలేదు. పొరపాటున అది నాకు తగిలింది. అందులో వీడి తప్పేమీ లేదు. అంతేకాక మంచి చెడ్డలు, లాభ నష్టాలు అనే తెలివి లేని మూగప్రాణి చెట్టు రాయి విసిరినవాడికి తియ్యని పండ్లు ఇస్తుండగా వివేకవంతుడనై నేను దండన ఎలా ఇస్తాను! అలా చేస్తే చెట్టు కన్నా హీన గుణం కలవాడిగా మారినట్లు కదా! కనుక ఇతడికి మంచి బహుమతి ఇచ్చి ఇంటికి పంపండి.

మహారాజు నిర్ణయం విన్న సభికులు ఆశ్చర్యంతోపాటు ఆనందం పొందారు. ఆయన క్షమాగుణానికి సంబంధించిన ఇలాటి సంఘటనలు అనేకం కథలుగా చెప్పుకుంటారంతా. రణజీత్ సింహుడు ఎంత వీరుడో అంత దయగలవాడు. క్షమాగుణమే వీరులకు భూషణమని చెప్పబడుతుంది కదా!

నిజానికి రణజీత్ సింహుడు పుట్టుకతోనే కురూపి. దానికి తోడు మొఖం నిండా స్ఫోటకం మచ్చలు. పైగా ఒక కన్ను లేదు. మనిషి చాలా పొట్టిగా ఉంటాడు. ఇంత వికారంగా ఉండే ఈ మనిషి శీలం మాత్రం అత్యంత సుందరంగా రూపుదిద్దుకున్నది. నిజానికి సౌందర్యమంటే శరీరానికి సంబంధించింది కాదు. అది వ్యక్తిత్వానికీ, శీలానికీ సంబంధించింది. అతడి ముఖము మచ్చలతో, అందవిహీనంగా ఉండవచ్చు. కానీ అతడిలోని దివ్యగుణాల వర్చస్సు సౌందర్యవంతులను కూడా త్రోసిరాజంటుంది. ఈ సహజ సౌందర్యాన్ని అతడు తన తండ్రి నుండి పొందాడు.

రణజీత్ సింహుడు క్రీ.శ.1780లో జన్మించాడు. అతడి తండ్రి మహాసింహుడు పంజాబులోని ఒక చిన్న సంస్థానానికి అధిపతి. కురూపి అయిన కొడుకుని చూసి అతడేమీ బాధపడలేదు సరికదా సానుభూతి చూపవచ్చిన వారితో - నాకొడుకు అందమైనవాడు కాడన్న విషయంలో నాకేమాత్రం చింత లేదు. పురుషుడు పురుషార్థీ, పరాక్రమవంతుడు కావడమే అందానికి నిర్వచనం. నా బిడ్డను ఒక వీరుడుగా తీర్చి దిద్దుతాను - అని అన్నాడు. అన్న మాట ప్రకారం మహాసింహుడు బాలుడైన రణజీత్ సింహుడు అన్ని విషయాలలో నిష్ణాతుడు కావడానికి ఏర్పాట్లన్నీ చేశాడు. రాత్రులు రామాయణ - మహాభారతాలలోని వీరుల గాథలు కథలుగా చెప్పేవాడు. రణజీత్ సింహుని పరాక్రమశాలిగా తయారు చేయడంలో ఆయన ఉద్దేశ్యం మరొకటి ఉన్నది. అప్పుడు పంజాబు చిన్న చిన్న సంస్థానాలుగా చీలి ఉండేది. ఆ సంస్థానాల అధిపతులు తరచుగా తమలో తాము కలహించుకుంటూ యుద్ధాలు చేసుకుంటూ ధనాన్ని, శక్తినీ నష్టపోతుండేవారు. సిక్ఖులు మొదటి నుండీ దేశభక్తిలో, ధైర్యసాహసాలలో సాటిలేనివారు. గురుగోవిందసింహుడు మొత్తం సిక్ఖు సమాజాన్ని సైనికీకరణ చేశాడు. పెద్ద పెద్ద సామ్రాజ్యాధిపతులు కూడా వాళ్లను చూసి భయపడుతుండే వారు. కానీ కాలం గడిచే కొద్దీ వారిలో అంతర్గత కలహాలు, వైమనస్యమనే జాడ్యాలు ప్రవేశించాయి. ఫలితంగా పంజాబు ముక్కలు చెక్కలుగా విడిపోయింది. శిక్ఖుల శక్తి క్షీణించసాగింది.

మహారాజు మహాసింహుడు ఆలోచనాపరుడే కాక క్రియాశీలుడు కూడా. ఆరోజుల్లో ఆంగ్లేయ సేనలు సిక్ఖుజనాన్ని, భారతీయ జన జీవనాన్ని ఛిన్నాభిన్నం చేస్తుండడం చూసి ఆయన మనసు చాలా వ్యథ చెందేది. భారత సమాజంలో చొరబడుతున్న ఈ వికారాలను తొలగించడానికి మహాసింహుడు మొట్టమొదట పంజాబు రాజ్యాన్ని ఒక సంఘటిత శక్తిగా రూపొందించాలని దృఢంగా సంకల్పించుకున్నాడు. ఆ సంకల్పాన్ని నెరవేర్చుకోవడమే తన కుమారుడిని వీరాధివీరుడుగా మలచుకోవడంలోని ఉద్దేశ్యం. రణజీత్ సింహుడిని యుద్ధవిద్యలో పరిపూర్ణుడుగా చేయడంతో పాటు అతడి నడవడి గురించి కూడా ఆయన శ్రద్ధతీసుకున్నాడు. మంచి నడత లేని వారు తాము పొందే విజయాలకు దురహంకారులుగా దురభిమానులుగా మారుతారు. కనుక శారీరక బలసంపదతో పాటు - రణజీత్‌సింహుడు స్వభావంలో కూడా ఉన్నతంగా ఉండేలా చేయడానికి మహాసింహుడు ఎంతో కృషి చేశాడు.

దురదృష్టవశాత్తు 1792లో మహారాజు మహాసింహుడు తన కల నిజం చేసుకోకముందే స్వర్గస్థుడయ్యాడు. అప్పుడు రణజీత్ సింహుని వయసు కేవలం పన్నెండు సంవత్సరాలు మాత్రమే. భారతదేశపు భావి ఉద్ధారకుడు చిన్న వయసులోనే అనాథఅయాడు. కానీ ఆయన తల్లి చాలా తెలివిగా నడిచింది. రాజకార్యాలు చక్కపెట్టడానికి అత్యంత విశ్వాసపాత్రుడైన లఖపతిరాయ్ అను ఉద్యోగిని మంత్రిగా నియమించింది. రాజకుటుంబంలోని సభ్యులు ఎవరికి వారు చిన్నవాడైన రణజీత్ సింహుని కీలుబొమ్మని చేసి ఆడించాలని రకరకాల ప్రయత్నాలు సాగించారు. మంత్రి, తల్లీ వేయికళ్లతో కాపలా కాస్తూ వాళ్ల కుతంత్రాలను సాగనివ్వలేదు.

అలా నాలుగైదేళ్లు గడిచాయి. ఆఫ్ఘనిస్థాన్ రాజైన శాహ్‌జమాకు ధనధాన్య సమృద్ధమైన పంజాబులోని ఒక సంస్థానాధిపతి చిన్న పిల్లవాడు

**మన సంపర్క క్షేత్రంలో ఉత్కృష్టత పట్ల విశ్వాసాన్ని నాటడం ప్రజాసేవ.**

అన్న విషయం తెలియవచ్చింది. అతడిలో దురాశ ప్రవేశించింది. బొడ్డూడని ఆ పిల్లవాడిని గెలవడం చిటికెలమీదపని అనుకొని ఏమాత్రం ఆలస్యం చేయక లాహోరుమీద దండెత్తి వచ్చాడు. అదను చూసుకొని అంతఃపురంలోని కుట్రదారులు కూడా తమ నిజ స్వరూపాలను బయటపెట్టుకున్నారు. పసివాడి ముందు ప్రాణసంకట సమస్యలు ఒకదాని మీద ఒకటి ఒక్కసారిగా వచ్చి పడ్డాయి. అందరూ ఊహించినట్లు రణజీత్ సింహుడు పరిస్థితులను చూసి ఏమాత్రం బెదిరిపోలేదు. గుండెనిబ్బరంతో ముందుకు దూకాడు. తను విన్న మహావీరుల కథలను గుర్తు చేసుకున్నాడు. తండ్రి నేర్పించిన యుద్ధ విద్యలను, పరిపాలనలోని మెలకువలను గుర్తు చేసుకున్నాడు. స్వంత తెలివితేటలు ఉపయోగించి ముందుగా తనను స్వతంత్ర రాజుగా ప్రకటించుకున్నాడు. అన్ని అధికారాలను తన చేతుల్లోకి తీసుకున్నాడు. శాహ్‌జమా వద్ద అపారమైన సైన్యం ఉన్నది. రణజీత్ సింహుని వద్ద కొద్దిపాటి సైన్యమే కాని వారంతా రాజ భక్తులు. ఆయన సైన్యానికి తనే నాయకత్వం వహించాడు. తన వారికి ఉత్సాహం కలిగిస్తూ శత్రువుల మీద విరుచుకు పడ్డాడు. జీతానికి పని చేసే శాహ్‌జమా సైన్యం విశుద్ధ దేశభక్తుల చేతిలో ఓడిపోకతప్పలేదు. అతడు లాహోర్ వదిలి పెట్టి పారిపోయాడు. మహారాజు రణజీత్ సింహుడు శత్రువు పట్ల దయగా వ్యవహరించాడు. స్వాధీనం చేసుకున్న వారి ఆయుధాలను తిరిగి ఇచ్చివేశాడు. ఆఫ్ఘన్ సర్దారుకి ఆశ్చర్యం కలిగింది, కానీ బుద్ధి మారలేదు. ఈసారి మరింత ప్రయత్నంతో వస్తానని, పంజాబును గెలిచి తీరుతానని బెదిరించి ఆఫ్ఘనిస్థాన్ తిరిగి వెళ్లాడు.

ఈ యుద్ధం వల్ల రణజీత్ సింహుడి ఆత్మవిశ్వాసం మరింత దృఢపడింది. లాహోరును రాజధానిగా చేసుకొని ఆయన ప్రజారంజకంగా పాలించసాగాడు. తల్లి అతడికి అన్ని విషయాల్లో అండగా నిలబడేది. తండ్రిగారి చిరకాల వాంఛను గుర్తుచేసి ఆయన కోరిక తీర్చమని చెప్పింది. మొట్టమొదటి యుద్ధంలోనే విజయం వరించిఉన్నందున ఆ ధైర్యంతో విశ్వాసపాత్రులైన సైనికులను తీసుకొని చుట్టుప్రక్కలఉన్న చిన్న చిన్న రాజ్యాలను జయించుకుంటూ సంఘరాజ్య స్థాపనకై ముందుకు సాగుతున్నాడు. రణజీత్ సింహుని బలపరాక్రమాల గురించి విన్న కొందరు చిన్న పరగణాల అధిపతులు యుద్ధం లేకుండానే అతడి అధికారాన్ని అంగీకరించారు. ఇక ఈ విశాల సామ్రాజ్యాన్ని రక్షించుకునే విషయం కూడా ఆలోచించుకోవాలి కదా! అంతేకాక ఒక ప్రక్క పొంచిఉన్న శాహ్‌జమా గురించి ఆందోళన, మరొకప్రక్క ఆంగ్లేయుల భయం ఉండనే ఉన్నాయి. ఈ రెండు సమీప శత్రువుల నుండి రక్షణకు ఆధునిక శస్త్రాస్త్రాలతో కూడిన సైనిక బలం సమకూర్చుకోక తప్పదు. అందుచేత సైనిక బలాన్ని ఆయుధబలాన్ని పెంచసాగాడు. పంజాబులోని భూమి బంగారం పండుతుంది. అందుచేత ధనం గురించి చింతపడవలసిన పని లేదు.

రణజీత్ సింహుడు ఊహించినట్లే ఆంగ్లేయులు పంజాబును హస్తగతం చేసుకోవాలని ప్రయత్నాలు చేశారు. కాని రణజీత్ సింహుడి బల పరాక్రమాల ధాటికి తట్టుకోలేక పోయారు. అప్పుడు కూడా వాళ్లకు పంజాబును వదిలి పెట్ట మనసు రాలేదు. కనుక మహారాజుతో మిత్రత్వం నెరపాలన్న కోరిక వెలిబుచ్చారు. ఫలితంగా 1809లో అమృత్‌సర్‌లో రెండు పక్షాల ప్రతినిధుల మధ్య సంధి మాటలు సాగి, ఆంగ్లేయుల, సిక్ఖుల మధ్య ఒక అంగీకారం కుదిరింది. విదేశీయులతో మైత్రి రణజీత్ సింహుడికి ఏమాత్రం ఇష్టంలేదు. కాని అప్పుడున్న పరిస్థితులనుబట్టి అంగీకరించక తప్పలేదు.

అమృతసర్ ఒడంబడిక ప్రకారం ఆయన తూర్పుదిశగా తన రాజ్యాన్ని విస్తరించకూడదు. ఆంగ్లేయ జనరల్ ఎలార్ట్ కోర్ట్ సహకారంతో తన సైన్యాన్ని ఆధునీకరణ చేయాలి. ఈ సంధి ప్రకారం తూర్పుకు సాగలేదు. పడమర, ఉత్తర దిక్కులలోని అనేక రాజ్యాల మీద అధికారం సంపాదించాడు. ఆ సమయంలో ఆఫ్ఘనిస్థాన్ బాద్‌షాహి అయిన షాహ్‌జమా లాహోరు వచ్చి మహారాజును కలుసుకున్నాడు. ఈసారి అతడు అంతకు ముందు ప్రగాల్భాలు పలికినట్లు కాక ఖాళీ చేతులతోను, ఒంటరిగానూ వచ్చాడు. కారణం - అతడు పదవీచ్యుతుడైన రాజు. సింహాసనం మీద నుండి దించివేయబడ్డాడు. రణజీత్ సింహుని ఉదారగుణం, దయాగుణం తెలుసు కనుక సహాయం అర్థించడానికి వచ్చాడు. రణజీత్ సింహుడు అతడు కోరినట్లు సహాయం చేశాడు. అందుకు బదులుగా షాహ్‌జమా ఆయనకు కొహినూరు వజ్రాన్ని బహుమతి ఇచ్చాడు. ఇన్ని సమస్యలతో తలమునకలవుతున్నా పంజాబును ఏకరాజ్యంగా చేసే బృహత్ కార్యాన్ని ఆయన వదిలి పెట్టలేదు. నెమ్మదిగా అటక్, కాంగడీ, ముల్తాన్, కాశ్మీర్, పెషావర్‌లను కూడా తన రాజ్యంలో కలుపుకొని తండ్రి కన్న కలలను నిజం చేశాడు.

ఇంత పెద్ద సామ్రాజ్యానికి మహారాజు, సర్వసమర్థ పరిపాలకుడు అయిన రణజీత్ సింహుడికి చదువురాదంటే ఎవరూ నమ్మరు. అయినా - ప్రతి పనిలోనూ ఆయన ఉన్నత విద్యావంతులకన్నా ఎక్కువ ప్రజ్ఞ కనపరచేవాడు. ప్రతి పనిలోనూ విజయం సాధించేవాడు. ఈ గొప్పతనమంతా అతడి ఉన్నతమైన ఆలోచనా విధానానికి, ఉత్కృష్టమైన శీలానికే దక్కుతుంది. ఆయన గొప్ప వీరాధివీరుడు, రాజనీతి విశారదుడు, ధర్మపరాయణుడు అయిన మహామనీషి. యుద్ధ రంగంలో ఉంటే అందరికన్నా ముందుండి పోరాడేవాడు. తండ్రిద్వారా విన్న పురాణ కథలనుండి రాజకీయ మర్మాలను చక్కగా ఒంట పట్టించుకున్నాడు. అంతేకాక నిష్ఠాగరిష్ఠుడైన సిక్ఖుకూడా. ఆయన ఎవరితోనూ సాంప్రదాయ దృష్టిలో పక్షపాతంగా వ్యవహరించలేదు. సిక్ఖులు, హిందువులు, ముసల్మానులు మొదలైన అన్ని మతాల వారిని సమానంగా గౌరవించే వాడు. ఇతరులలోని ప్రతిభను, సామర్థ్యాన్ని గుర్తించి ఆదరించగల తెలివితేటలున్నందున ఆయా వ్యక్తులు ఏ మతానికి చెందిన వారైనా వారికి అభివృద్ధి అవకాశాలు కల్పించేవాడు. ఐకమత్యం కోసం, దేశసేవకోసం ప్రతినిముషం పాటుపడిన ఈ మహా మనీషి 1839 జూన్ 26న స్వర్గస్థుడయినాడు.

రణజీత్ సింహుని దేశభక్తి ఈనాటి స్వతంత్ర భారతదేశానికి అనుసరణీయమైన లక్షణం. కురూపి అయినా శీలాన్ని అతి సుందరంగా మలచుకుని సర్వసమర్థుడైన రణజీత్ సింహుడు అందరికీ మార్గదర్శి.

అనువాదం : విజయకుమారి

**వ్యక్తి మారితే సమాజం,విశ్వం,యుగం మారతాయి.**

శతసూత్ర కార్యక్రమం: 11-20

# ఆరోగ్యాభివృద్ధికి సామూహిక కృషి

**వనస్పతుల ఉత్పత్తి :** కూరగాయలు, పండ్లు, పువ్వులను ఉత్పత్తిచేసే ఉద్యమం ఆరోగ్యాభివృద్ధికి ఎంతో ఉపయోగకరం అవుతుంది. ఇళ్ల పెరళ్లలో, పరిసరాలలో పూలమొక్కలను నాటాలి. ఇళ్ల కప్పులపై సొర, బీర, చిక్కుడు తీగలను పాకించాలి. ప్రాంగణంలో తులసి మొక్కలు పెంచాలి. ఖాళీ స్థలాలలో పూల మొక్కలు పెంచాలి. అరటి, బొప్పాయి వంటి వాటిని కొద్దిపాటి స్థలంలోనే పెంచవచ్చు. మొక్కలు నాటడం, వాటికి నీళ్లు పోయడం, మట్టిని త్రవ్వి తిరగబోయడం, గట్లు పోయడంవంటివాటిని ఇంటిలోని వ్యక్తులు చేయాలి. అందువల్ల శ్రమించే అలవాటు ఏర్పడుతుంది. ఆరోగ్యం మెరుగవుతుంది. వనమూలికల తోటను, ఫారమ్‌ను నిర్వహించడం ఆరోగ్యాభివృద్ధికి మంచిది.

**వంట వండే పద్ధతిలో సంస్కరణ :** ఆవిరితో వంట వండేందుకు తగిన పాత్రలు లభ్యం కావాలి. వాటి ఉత్పత్తికీ, అమ్మకానికి ఏర్పాట్లు జరగాలి. అవి చౌకగా లభించాలి. అందువల్ల అవి ఎక్కువమందికి అందుబాటులోకి వస్తాయి. ఇప్పుడు బాల్ బేరింగ్‌లు అమర్చిన తిరగళ్లు తయారవుతున్నాయి. వీటిని నడపడం తేలిక. ఒక గంటలో చాలా పిండి తయారవుతుంది. ఇంటింటా వీటి వాడకం జరగాలి. వీటిని నడిపే విధానం, మరమ్మత్తు చేసే విధానం నేర్పబడాలి. ఇళ్లలో ఆడవాళ్లు తిరగలితో పిండి విసరడం అసౌకర్యంగా, నామోషీగా భావిస్తున్నారు. తిరగలివల్ల ఆరోగ్యానికి కలిగే మేలు గురించి వారికి తెలియజెప్పాలి. మగవాళ్లు స్వయంగా పిండిని విసరడం మొదలుపెట్టాలి. చేతితో విసిరిన పిండిని వాడతామనే వ్రతాన్ని వ్యక్తులు మొదలుపెట్టాలి. అప్పుడు తిరగళ్ల వాడకం పెరుగుతుంది. అలాగే, ఆవిరితో వంట వండితే ఆహారం 70 శాతం హెచ్చుగా పౌష్టికంగా ఉంటుంది. రుచికూడా పెరుగుతుంది. వీటి ప్రచారం ఉద్యమ రూపం ధరించాలి.

**సాత్విక ఆహారం వండే విధానం :** వేయించిన, మాడ్చిన మిఠాయిలు, పిండివంటలు ఆరోగ్యానికి హాని కలిగిస్తాయి. వీటి బదులు ఆరోగ్యకరములు, రుచికరములు అయిన పదార్థాల వాడకాన్ని ప్రోత్సహించాలి. ఆనపకాయ పరమాన్నం, ముల్లంగి హల్వా, శ్రీఖండ్, తియ్యని దలియా, మొలకెత్తిన గింజలతో వంటకాల వంటి పదార్థాలను తయారుచేసే పాక విద్యను వికసింపజేయాలి. అవి విందులలోనూ పనికివస్తాయి. ఆరోగ్యానికి ఏమాత్రం హాని కలిగించవు. రుచికరంగా ఉంటాయి. టీ త్రాగే అలవాటు మాన్పించడంకోసం గోధుమతో చేసిన దలియా, వనమూలికలతో తయారుచేసిన పానీయం వాడవచ్చు. వక్కపొడి బదులు సోపు, ధనియాలతో పొడిని తయారుచేసి వాడవచ్చు. ప్రాకృతిక ఆహారంతో తయారైన వంటకాల పాకవిద్యకు ప్రసారం జరిగితే, ఆరోగ్య రక్షణ దిశలో ఎంతో ముందంజ వేయవచ్చు.

**మురికిపై సమరం :** పరిసరాల పారిశుద్ధ్య సమస్యను ప్రభుత్వానికి వదిలివేసి ప్రయోజనం లేదు. చెడు అలవాట్లను వదులుకోవడానికి, పరిసరాల పారిశుద్ధ్యం పట్ల శ్రద్ధ వహించే ప్రవృత్తిని అలవరచడానికీ కృషి జరగాలి. పిల్లలను ఇంటిబయట స్థలాలలో, కాలువలలో దొడ్డికి కూర్చోబెట్టడం, వీధులలో సందులలో ఇంటి చెత్తను పారవేయడం, సత్రాలలో, రైల్వే ప్లాట్‌ఫారంలలో, రైలు పెట్టెలలో చెత్త కాగితాలు, వేరుశెనగకాయ తొక్కలు పడవేసి వాటిని ఖరాబు చేయడం చెడు అలవాట్లు. వాటివల్ల మురికి, రోగాలు వ్యాపిస్తాయి.

పల్లెలలో మలమూత్ర విసర్జనకు తగిన స్థలాల ఏర్పాటు జరగడం లేదు. పల్లెకు దగ్గరగా ఉన్న స్థలాలలో, సందు గొందులలో ఇలాంటివి జరుగుతున్నాయి. ఈ అలవాటు పోవాలి. కర్రతో తయారయి ఇటూ అటూ తీసుకువెళ్లడానికి వీలయిన మరుగుదొడ్డి వాడకాన్ని పల్లెలలో ప్రవేశపెడితే మురికి వ్యాపించకుండా ఉంటుంది. ఎరువుకూడ లభిస్తుంది. తవ్వకోల తీసుకుని మలవిసర్జనకు వెళ్లడం ఒక పద్ధతి. గొయ్యి త్రవ్వి, దానిలో కంకరరాళ్లు వేసి పీల్చే మరుగుదొడ్డిని తయారుచేసి దానిలో సున్నం ఫినాయిల్ వేసి ఉంచడం మరో పద్ధతి. ఎక్కడ పడితే అక్కడ మూత్రవిసర్జన చేయడం వల్ల వ్యాపించే రోగాలను దీనివల్ల నిరోధించవచ్చు.

**మత్తు పదార్థాలను వదులుకోవడం :** మత్తు పదార్థాల అలవాటు అనే వ్యసనంవల్ల కలిగే దుష్పరిణామాలను తెలియజెప్పడానికీ, ఈ వ్యసనాన్ని వ్యక్తులు వదులుకునేటట్లు చేయడానికి ప్రచార సాధనాలన్నింటినీ వినియోగించాలి. పంచాయతీలలో, మతపరమైన ఉత్సవాలలో, శుభ కార్యాలలో ఈ దుర్వ్యసనాన్ని వదులుకుంటూ వ్యక్తులచేత ప్రతిజ్ఞలు చేయించాలి.

**వ్యాయామం, దాని శిక్షణ :** ఆసనాలు, వ్యాయామం, ప్రాణాయామం, సూర్యనమస్కారాలు, క్రీడలు, ఉదయం నడక, యోగ వ్యాయామం, మాలీశ్‌వంటివి నేర్పడానికి శిక్షణ తరగతులు నిర్వహించాలి. సామూహిక వ్యాయామానికి అవకాశం ఉన్న స్థలాలలో అందుకోసం రోజువారీ ఏర్పాటు జరగాలి. వ్యాయామం దానికదిగా ఒక సర్వసమగ్రమైన చికిత్సా శాస్త్రం. మంచంమీద పడిఉన్న రోగిసైతం కొన్ని ప్రత్యేకమైన యోగ వ్యాయామాలు, తేలికయిన వ్యాయామాలు చేయడం ద్వారా గడ్డు రోగాలనుండి విముక్తి పొందవచ్చు. బలహీనులు, చిన్న పిల్లలు, విద్యార్థులు, కిశోరులు, యువతీ యువకులు, స్త్రీలు, ఆడపిల్లలు చివరికి గర్భిణీ స్త్రీలు తమతమ పరిస్థితులకు అనుగుణములైన వ్యాయామాలు చేసి ఎంతో

రంధ్రాన్వేషణపరునికి లోకంలో దుష్టులు,దురాచారులే కనిపిస్తారు.

ఆశాజనకమైన ఫలితాలు పొందగలుగుతారు.

అఖాడాలు, వ్యాయామశాలలు, క్రీడా ప్రాంగణాలవంటి ఆరోగ్యవర్ధక సంస్థలను ప్రతిచోట స్థాపించాలి. లాఠీ, బల్లెం, కత్తి, బాణంవంటి ఆయుధాలను ప్రయోగించే శిక్షణవల్ల వ్యక్తుల ఆరోగ్యం మెరుగవుతుంది. శరీరం వ్యాయామం జరుగుతుంది. వ్యక్తుల మనోబలం, సాహసం పెరుగుతాయి. ఆత్మరక్షణ సామర్థ్యం ఏర్పడుతుంది. కుస్తీ, పరుగు, ఈత, బంతి ఆట వంటివాటిలో పోటీలు ఏర్పాటు చేసి, బహుమతులు ప్రదానం చేయాలి. ఇందువల్ల వీటిపట్ల ప్రజల ఉత్సాహం పెరుగుతుంది. అయితే ఇలాంటి పోటీలలో అసూయా, ద్వేషాలకు తావు ఇవ్వకూడదు. లేనిపోని శత్రుత్వాలు తలెత్తకుండా జాగ్రత్తపడాలి. అపుడు ఈ పోటీలవల్ల పరస్పర ప్రేమాభిమానాలు పెరుగుతాయి. గూండాలకు వ్యతిరేకంగా శక్తి ప్రదర్శన జరిపే పని పూర్తవుతుంది.

**వారానికో రోజు ఉపవాసం :** వారాంతపు సెలవు పొట్టకుకూడా ఇవ్వాలి. ఆరు రోజులు పనిచేసిన తర్వాత పొట్టకు ఒకరోజు విశ్రాంతి ఇవ్వాలి. ఉపవాసం ఉండాలి. అలా చేస్తే జీర్ణక్రియ దెబ్బతినకుండా ఉంటుంది. వారంలో పేరుకుపోయిన దంతా పొట్టకు విశ్రాంతి ఇచ్చిన రోజున జీర్ణం అవుతుంది. తర్వాతి వారం చక్కగా పనిచేయడానికి పొట్ట సమర్థంగా తయారవుతుంది. రోజంతా ఉపవాసం ఉండడం కుదరకపోతే, కనీసం ఒక్కపూట అయినా భోజనం మానివేసే ఏర్పాటు తప్పకుండా చేయాలి. బాగా బలహీనులుగా ఉన్నవారు పాలు, పండ్లు, కూరలు తీసుకోవచ్చు. ఏది ఏమయినా, వారానికి ఒకపూట భోజనం మానివేసి ఉపవాసం ఉండే అలవాటును తప్పనిసరిగా ప్రారంభించాలి. ఉపవాసంవల్ల శరీరానికి కలిగే ప్రయోజనం సుస్పష్టమే. దానివల్ల కలిగే ఆధ్యాత్మిక ప్రయోజనం తక్కువేమీ కాదు.

**విందులూ, ఎంగిళ్లూ :** పెద్ద పెద్ద విందులలో ఆహారం వృధాకాకుండా చూడాలి. విందులలో తినేవారి సంఖ్య వీలైనంత తక్కువగా ఉండాలి. వడ్డించే పదార్థాల సంఖ్య తక్కువగా ఉండాలి. అందువల్ల ఆహార పదార్థాలు వృధాకాకుండా ఉంటాయి.

కంచంలో ఎంగిలి పదార్థాలు వదిలివేసే అలవాటును పూర్తిగా వదులుకోవాలి. పనివాళ్లకుకాని, కుక్కకు కాని భోజనం పెట్టదలిస్తే మంచి భోజనం, స్వచ్ఛమైన భోజనం పెట్టాలి. ఎంగిలి పదార్థాలు ఇవ్వడంవల్ల పాపం చుట్టుకుంటుంది. వాటిని తినేవాళ్లకు కూడ శారీరకంగా, మానసికంగా హాని కలుగుతుంది. అన్న దేవతను అవమానించడం ధార్మిక దృష్టిలో పాపం.

**సంతానానికి పరిమితి :** దేశంలో పెరుగుతున్న జనాభా, ఆర్థిక సమస్యలు, సాధనాల కొరత, సామాన్యప్రజల ఆరోగ్యం దిగజారడం- వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకుని ప్రతి గృహస్థూ వీలైనంత తక్కువ సంతానాన్ని కనడం సముచితం. సంతానం పెరగడంవల్ల తల్లులు బలహీనులై అకాల మృత్యువుకు లోనవుతారు. పిల్లలు దుర్బలులు అవుతారు. సరైన పోషణ అందకపోవడంవల్ల అనారోగ్యానికీ, అకాల మృత్యువుకూ గురి అవుతారు. విద్యా వికాసాలకు తగు సౌకర్యాలు లేకపోవడంతో పిల్లల పెరుగుదల కుంటుపడుతుంది కనుక సంతానాన్ని కనీస స్థాయికి తగ్గించాలి. ప్రజలు బ్రహ్మచర్యాన్ని పాటించాలి. లేదా కుటుంబ నియంత్రణ నిపుణులను సంప్రదించాలి. సంతానపు బాధ్యతలనూ, చింతలనూ ఎంత తగ్గించుకుంటే వ్యక్తులు అంత ఆరోగ్యంగా ఉంటారు. ప్రతి సద్గృహస్థూ ఈ వాస్తవాన్ని గుర్తించాలి. ఇందులో వారి శుభం ఇమిడి ఉంది.

**ప్రకృతి వైద్య సమాచారం :** పంచతత్వాలద్వారా రోగాన్ని నివారించే ప్రకృతి చికిత్సా విధానాన్ని ప్రజానీకానికి అందించాలి. ప్రకృతి చికిత్సా కేంద్రాలు వివిధ స్థలాలలో స్థాపించబడాలి. ఈ కేంద్రాలలో ఉపవాసం, ఎనీమా, జల చికిత్స, సూర్య చికిత్స, మట్టి, ఆవిరి మున్నగు సాధనాల సహాయంతో కాయకల్ప చికిత్స జరుగుతుంది. శరీర క్షాళన జరుగుతుంది. సమస్త రోగాల మూలాలను ఈ చికిత్స తొలగించివేస్తుంది. సామాన్య ప్రజలకు ఈ చికిత్సా పద్ధతుల పరిజ్ఞానం విస్తృతంగా లభించాలి. తద్వారా వ్యక్తులు తమకూ, తమ కుటుంబ సభ్యులకు ఈ చికిత్సను వారు స్వయంగా చేయగలుగుతారు.

పైన పేర్కొన్నవన్నీ సామూహికంగా ప్రసారం చేయదగిన పద్ధతులు. ఈ ప్రసారం ఒక ఉద్యమంగా సాగాలి. గాయత్రీ పరివార్ పరిజనులు సామూహికంగా ఇందుకు తగు చర్యలు తీసుకోవాలి.

★★★

## నిరాశయే మృత్యువు

నావికుడు దీవిని ఉద్దేశించి "సోదరీ! నలు దిక్కులా అగాధమే చూస్తుంటే నీకు నిరాశగా అనిపించదా" అని ప్రశ్నించేడు. దీవి మంద్ర స్వరంతో "ఓ పూజ్యుడా! నిరాశ, మృత్యువు ఈ రెండూ ఒకే నాణానికి బొమ్మ, బొరుసు వంటివి. నేను నిరాశకు లోనైతే దూరం నుండి వచ్చే అతిథులకు విశ్రాంతిని ప్రసాదించటం, వారికి స్వాగతం పల్కడం వంటి ఉత్కృష్ట కర్మాచరణనుండి వంచించబడుతాను. కాబట్టి నేను నిరాశను దరిచేరనీయను. నా లక్ష్యం ఏమిటో నాకు తెలుసు. అది తెలియనివారే నిరాశకు లోనవుతూ ఉంటారు." - అని పల్కింది.

- ప్రజ్ఞాపురాణం నుండి

**తీవ్ర ఆకాంక్షతో, ప్రబల పురుషార్థంతో సాధించలేనిది ఏదీ లేదు.**

## సమాజ నిర్మాణం

# సామూహిక కర్మఫల వ్యవస్థ

మనం చేసే కర్మకు ఫలాన్ని మనం ఎలాగూ అనుభవించవలసివస్తుంది. ఆ ఫలాన్ని మనతోపాటు ఇతర ప్రాణులుకూడ అనుభవించవలసివస్తుంది. కర్మఫలం విషయంలో మనీషుల ఉపదేశం ఇది. మనిషి సామాజికంగా జీవించే ప్రాణి. పెక్కు నియమాలను అతడు సామూహికంగా పాటించవలసి ఉంటుంది. కనుక - మన కర్మల ఫలం సముదాయానికి లభిస్తుంది. సముదాయం చేసే కర్మల ఫల అనుభవంలో మనంకూడ భాగస్వాములం అవుతాం.

సామాజిక వ్యవస్థవల్ల జనించిన దోషాల, శ్రేష్ఠ కర్మల ఫలాన్ని వ్యక్తులందరూ పంచుకుని అనుభవించవలసి ఉంటుంది. అయితే - ఒక వ్యక్తి తాను చేసే కర్మల ఫలంలో అధిక భాగాన్ని తాను అనుభవించాలి. దానిలో కొద్ది భాగం మాత్రమే సముదాయానికి చెందుతుంది. ఇలా - వ్యక్తి ప్రయోజనం సమష్టిలోనూ, సమష్టి ప్రయోజనం వ్యక్తిలోనూ ఇమిడి ఉంది.

ఈ నమ్మకం ఉండడం అవసరం. ఎందుకంటే - ఇందువల్ల పరస్పర ప్రేమ, విశ్వాసం, సమభావం జనిస్తాయి. ఇందువల్ల మనం మానవత్వాన్ని మరింత దృఢంగా పెంపొందిస్తాం. కనుక - మనం స్వయంగా శ్రేష్ఠ కర్మలలో నిమగ్నం కావాలి. దీనితోపాటు - శ్రేష్ఠ కర్మలు చేయడానికి ఇతరులకు ప్రేరణ ఇవ్వాలి.

భూగోళంలోని ఒక భాగంలో కరవు వచ్చిందని అనుకుందాం. అప్పుడు వర్షాల కోసం యజ్ఞాలు మున్నగు శ్రేష్ఠ కర్మలు జరుగుతాయి. అందువల్ల వర్షాలు కురిసి, ఆహారం అధికంగా ఉత్పత్తి అయితే - దాని ప్రయోజనం అందరికీ కలుగుతుంది. యజ్ఞంచేసే వ్యక్తికిమాత్రమే ఆ అధికోత్పత్తి ప్రయోజనం లభించదు. అతడి శుభ కర్మవల్ల కలిగే ఫలం పరోక్షంగా అతడికి అందే మాట నిజం. అది ఈ జన్మలో అందవచ్చు, తర్వాతి జన్మలలో అందవచ్చు. ఒక వ్యక్తి అన్న సత్రం నిర్మిస్తే, ఆ మంచి పనివల్ల కలిగే ఫలితంలో కొద్ది కొద్ది భాగం ఆ సత్రంలో కొద్ది సమయం మకాం చేసేవారికి కూడ లభిస్తుంది. దాని పరోక్ష ప్రయోజనం సత్రం నిర్మించిన వ్యక్తికి లభిస్తుంది. ఏది ఏమయినా, ప్రత్యక్ష ప్రయోజనం ఆ సత్రంలో మకాంచేసేవారికి అందుతుంది. ఈ విధంగా ఆ మంచి పని వల్ల కలిగే ఫలితంలో సామూహికమైన భాగం ఉన్నదని స్పష్ట మవుతోంది.

విద్యాలయం, ఆసుపత్రి, బావి, చెరువు, విద్యార్థుల వసతి గృహం, అన్న సత్రం, గోశాల, అనాథ శరణాలయం వంటివి నిర్మించడం, ధర్మ ప్రచారం వంటి శుభ కార్యాలు జరపడం - ఇవన్నీ ఆయా వ్యక్తులు ఆత్మకళ్యాణం కోసం జరిపేవే కావచ్చు. అయితే వాటి ప్రయోజనం ఇతరులకు కూడా లభిస్తుంది. ఆ పనులు చేసే వ్యక్తి ఏ కులానికి, ఏ దేశానికి, ఏ సంప్రదాయానికి చెందితే దాన్నికూడా ప్రజలు మెచ్చుకుంటారు. ప్రపంచంలో వివిధ సమయాలలో పలువురు మహాపురుషులు జన్మించారు. వారివల్ల ఆయా యుగాలకు, ఆయా దేశాలకు, సమాజాలకుకూడ కీర్తి లభించింది. శ్రీరాముని జన్మవల్ల అయోధ్య ప్రతిష్ఠ, శ్రీకృష్ణుని జన్మవల్ల మథుర ప్రతిష్ఠ పెరిగాయి. భగవద్గీత జ్ఞానంవల్ల ప్రపంచంలో భారతవర్షం గౌరవం పెరిగింది.

రైలు మార్గం, టెలిగ్రాఫ్, రేడియో, విద్యుచ్ఛక్తి, పారిశ్రామిక యంత్రాలు, విమానం, క్రొత్త ఔషధాలు మున్నగు వానిని కొందరు శాస్త్రవేత్తలు కనుగొన్నారు. వాటి ప్రయోజనాన్ని మానవాళి అంతా పొందుతూన్నది. ధర్మం, సదాచారం, అధ్యాత్మ, సహకారం, సహనశీలత, సంయమనం, సమానత్వంవంటి ఆదర్శాలను కొందరు మనీషులు ప్రతిపాదించారు, ప్రసారం చేశారు. ఆ ఆదర్శాలు మానవాళి ప్రగతికి ఎంతగానో దోహదం చేశాయి. స్వరాజ్యసమర నేతల, యోధుల, అమరవీరుల బలిదానాల ఫలితాన్ని నేడు భారతీయులందరూ స్వతంత్ర భారతం రూపంలో అనుభవిస్తున్నారు.

వ్యక్తి చేసే మంచి పనుల ప్రయోజనాన్ని సమాజం పొందుతుంది. అలాగే, అతడి చెడు పనుల ఫలితాన్ని కూడ ఇతరులు అనుభవించవలసి వస్తుంది. బందిపోటు దొంగలు, చోరులు, జేబు దొంగలు తమ నేరాలవల్ల లక్షలాది మందికి హాని కలిగిస్తారు. గూండాల దౌర్జన్యాలవల్ల అమాయక ప్రజలు ఎందరో బాధపడతారు. మురికి వ్యక్తులు ఎపుడూ ఏదో ఒక రోగంతో బాధపడుతూ ఉంటారు. వారి రోగాలు ఇతరులకు సంక్రమించి పలువురిని కష్ట నష్టాలకు గురిచేస్తాయి. వ్యసనపరులు, వ్యభిచారులు, త్రాగుబోతులు, జూదగాళ్లు తమ చెడు అలవాట్లను మానసికంగా బలహీనులైన ఇతరులు పలువురికి నేర్పి సమాజాన్ని భ్రష్టు పట్టిస్తారు.

వ్యక్తి ఒంటరివాడు కాడు. అతడు సమాజంలో ఒక అంతర్భాగం. కనుక అతడు చేసే మంచి చెడు పనుల ప్రభావం అతడికే పరిమితం కాదు. ఆ ప్రభావాన్ని సమాజంకూడ అనుభవించవలసివస్తుంది. కడుపులో నొప్పి వస్తే, దానివల్ల శరీర వ్యవస్థ అంతా దెబ్బతింటుంది. మెదడుకు జ్ఞానం, విద్య పుష్కలంగా లభిస్తే, ఆ జ్ఞానంవల్ల అన్ని అవయవాలకూ సుఖ సాధనాలు లభిస్తాయి. సమాజం అనే శరీరంలో వ్యక్తి ఒక అవయవం కనుక, వ్యక్తి విషయంలోనూ ఈ ప్రక్రియ వర్తిస్తుంది.

కనుక - ఇతరుల మంచి చెడు పనులపై దృష్టి పెట్టడం ప్రతి మనిషికీ కర్తవ్యం అవుతోంది. మా సంగతి మేము చూచుకుంటాం,

**ఆత్మ వికాసానికి తీవ్ర అవరోధాలు అసూయా ద్వేషాలు.**

ఇతర సంగతి మాకెందుకు - అనుకుంటే పని జరగదు. ఇలా ఆలోచిస్తే, చెడ్డవాళ్లను అడ్డుకునేవాళ్లు ఉండరు. అందువల్ల వారి ఆగడాలు మితిమీరిపోతాయి. సమాజం విపరీతమైన కష్టనష్టాలకు గురి అవుతుంది. అలాగే - మంచివాళ్ల పనులకు సహకారం, ప్రోత్సాహం అందకపోవడంవల్ల, వారు హతాశులై చతికిలబడిపోతారు. వారి మంచి పనులవల్ల కలిగే మేలు కొరవడిపోతుంది.

వరదలు, భూకంపాలు, కరవులు, మహమ్మారులు, అతివృష్టి, అనావృష్టి, యుద్ధంవంటి దైవీ ప్రకోపాలు మానవాళి సామూహికంగా చేసిన పాపాలకు ఫలితాలని భావించబడింది. వీటివల్ల నిర్దోషులు సైతం నష్టపోతారు. వాస్తవానికి వారుసైతం నిర్దోషులు కారు. **సామూహిక దోషాలను తొలగించడానికీ తగ్గించడానికీ ప్రయత్నించకపోవడం, వాటిని పట్టించుకోకపోవడం - ఇది కూడ పాపమే. ఈ దృష్టితో చూచినపుడు, నిర్దోషులుగా కనిపించే వ్యక్తులు సైతం దోషులని రుజువవుతుంది. వారు సామూహిక శిక్షలో భాగస్వాములు కావలసివస్తుంది.**

ఒక నగరంలో భారీయెత్తున అల్లర్లు జరిగితే, ప్రభుత్వం ఆ నగర పౌరులందరికీ సామూహికంగా జరిమానా విధిస్తుంది. నిర్దోషులనుండి కూడా జరిమానా వసూలు చేస్తారు. తమ పేటలో అల్లర్లు జరిగినా వాటిని అడ్డుకోవడానికి ముందుకు రాకపోవడం, పిరికితనం చూపడం, శాంతి స్థాపనకు ప్రయత్నించకపోవడం వారు చేసిన తప్పనీ, కనుక వారు నేరస్థులనీ అందుకు కారణం చూపుతారు.

సమాజంలో జరిగే చెడ్డపనులను అడ్డుకోవడానికై పరమేశ్వరుడు ఇలాంటి సామూహిక బాధ్యతను ప్రతి వ్యక్తికీ అప్పగించాడు. అవినీతి ఎక్కడ జరిగినా దాన్ని అడ్డుకోవడం, దాన్ని తగ్గించే ప్రయత్నం చేయడం, దాన్ని ప్రతిఘటించడం, దానికి సహాయనిరాకరణ చేయడం వ్యక్తికి కర్తవ్యం అవుతోంది. ఇందుకు తనకు వీలైన పద్ధతిని అతడు అనుసరించవచ్చు. కనీసం అతడు చెడ్డపనికి ప్రత్యక్షంగాకాని పరోక్షంగా కాని సహాయం అందించకూడదు. చెడ్డపనులను ఎన్నడూ పొగడకూడదు. వాటిని నిందించాలి, వ్యతిరేకించాలి, ప్రతిఘటించాలి.

అలాగే - మంచిని సమర్థించడానికీ, సజ్జనులను గౌరవించడానికీ ప్రోత్సహించడానికీ మనలో ప్రతి ఒక్కరూ ఎంతో కొంత పని చేయాలి. ప్రజలకు ప్రయోజనం కలిగించే అలాంటి పనులకు సాధ్యమైనంత సహకారం అందించాలి. కనీసం వాటిని మెచ్చుకోవడం అత్యవసరం.

మనమంతా వేర్వేరు వ్యక్తులం అయినప్పటికీ, ఒక సమాజంలో అంతర్భాగాలము, ఒకే పడవలో కూర్చొని ఉన్నాము. ఒక వ్యక్తి పడవకు రంధ్రం చేయడానికి ప్రయత్నిస్తే దాన్ని అడ్డుకోవడం ఇతర ప్రయాణికుల కర్తవ్యం. ఎందుకంటే, పడవకు రంధ్రం ఏర్పడితే అందరి ప్రాణాలూ ప్రమాదంలో పడతాయి. సామాజిక సువ్యవస్థనూ, ధార్మికమైన కట్టుబాట్లనూ మనం స్వయంగా పాటించడంలోనూ, ఇతరులచేత పాటింపజేయడంలోనూ మనం ఈ దృక్పథాన్నే అవలంబించాలి.

★★★

## తపస్సు ఫలం ఇది

వృక్షం బాటసారితో, "నీవు ఎన్నిసార్లు రాళ్లతో కొడితే అన్నిసార్లు నేను నీకు ఫలాలనే ఇస్తూ ఉంటాను. ఇది నా వ్రతం. నాకెంత నష్టం, పతనం లభించినా సరే, సహిస్తానేగాని రాయికి రాయితోనే జవాబు చెప్పటం చాతకాదు." అని పల్కింది. "నీవు పూవులతో, ఫలాలతో ఉయ్యాల లూగటం, నేను ఆకలితో కడుపు చేత పట్టుకొని తిరగటం ఇదేమి న్యాయం?" "ఒకరిలాగ మరొకరు ఎందుకుండాలి?" "ఇది నీ అన్యాయమే గాదు. అన్నీ నీకు అమర్చిపెట్టిన నీ భగవంతుని అన్యాయం కూడ." వృక్షం మందహాసం చేస్తూ "ఓ బాటసారీ! ఈర్ష్యకెందుకయ్యా దాసుడవుతావు. ఒక్కసారి శాంతంగా ఆలోచించు. నేను ఎంతటి తపశ్చర్యవల్ల ప్రకృతి వైపరీత్యాలనుండి, గాలి వానలు, గ్రీష్మ తాపాలనుండి నా ఫలాలను కాపాడుకొంటున్నానో నీకే అర్థం అవుతుంది. నీవు కూడా ఇటువంటి తపశ్చర్యద్వారా పురుషార్థంద్వారా ఇంతకు మించిన ఫలాలతోను, పూబాటలతోను ఊయల లూగగలవు. సునాయాసంగా ఎవరికీ ఏదీ లభించదు. వారి వెనుక అనంతమైన తపశ్చర్య, పురుషార్థం దాగి ఉంటాయి. ఈ సత్యాన్ని మరచినవారే ఈర్ష్యకు దాసులవుతూ ఉంటారు" అని బదులు పలికింది.

అడవిలో పుట్టిన మొక్కలే మహావృక్షాలుగా ఎదిగి, పరులకు ఫలాలు ఇవ్వగా లేనిది, సమస్త సదుపాయాలతో నిండిన జగత్తులో పుట్టిన ఆలోచనాపరుడైన మానవుడు ఏమాత్రం ఎదగలేక, తన ఉన్నతి కోసం ఇతరుల ముందు చేయిజాచటం, అందకపోతే నిందించటం, తాము సాధించలేనివి ఇతరులకు అవలీలగా లభిస్తున్నాయని ఈర్ష్య చెందటం ఎంతటి సిగ్గుచేటు? పురుషార్థ పరాయణుడైన వ్యక్తి తన సాఫల్య మార్గాన్ని తానే నిర్మించుకుంటాడు కాని ఎవరినీ దేవురించడు. చేయలేదని ఇతరులపై పడి ఏడ్వడు. వాళ్లు బాగున్నారని ఈర్ష్యపడడు.

- ప్రజ్ఞాపురాణం నుండి

**మన ఆంతరిక జగత్తును సంస్కరించుకోవడం సర్వశ్రేష్ఠమైన తపోసాధన.**

# యుగ గీత

## ఆత్మను ఆహుతిగా ఇవ్వడమే యజ్ఞం

*(గత సంచిక తరువాయి)*

శ్రీకృష్ణ భగవానుడు యజ్ఞ అగ్నిని భౌతికమైన అగ్నిగా పరిగణించడు. ఆయన దృష్టిలో అది బ్రహ్మాగ్ని. బ్రహ్మవైపు తీసుకుపోయే శక్తి. పురోహితుని రూపంలో మనలోపల వెలుగొందుతూ ఉండే దివ్యశక్తి యజ్ఞం. ఆ దివ్యశక్తికి ఆహుతులు ఇవ్వబడతాయి. వేదాల భాష రూపకాల భాష. భగవద్గీత అనే ఉపనిషద్ అమృతం భాషకూడ అలాంటిదే. అగ్ని ఆత్మసంయమనం రూపంలోకూడా ఉండవచ్చునని భగవానుడు చెపుతున్నాడు. ఆత్మార్పణ అనే యజ్ఞంలోని అగ్నిశిఖ అది. యజ్ఞానికి విస్తృతమైన వివరణ ఇది. వ్యాపకమైన వ్యాఖ్య ఇది. **యజ్ఞ క్రియ, యజ్ఞ అగ్ని, యజ్ఞంలోని హవిస్సు, యజ్ఞంలోని హోత, యజ్ఞంలోని భోక్త, యజ్ఞ లక్ష్యం, యజ్ఞ ఉద్దేశ్యం - ఇవన్నీ ఆ బ్రహ్మమేనని** ఆ వ్యాఖ్య చెపుతోంది. (ఇది 24వ శ్లోకానికి భావార్థం).

ఈ శ్లోకంద్వారా లభించే జ్ఞానాన్ని పొందిన మీదట ముక్త పురుషుడు యజ్ఞకర్మ చేయగలుగుతాడు. **సోஉహం, సర్వం ఖల్విదం బ్రహ్మ, సచ్చిదానం దోஉహం, బ్రహ్మ ఏవ పురుషః** వంటి వేదాంతంలోని మహావాక్యాలద్వారా మహర్షులు ఈ జ్ఞానాన్నే ప్రకటించారు. ఈ జ్ఞానం సమగ్రమైన ఏకత్వం యొక్క జ్ఞానం. ఏ విశ్వశక్తిలో మన కర్మ ఆహుతిగా ఇవ్వబడుతుందో అది స్వయంగా భగవానుడే. ఆహుతి ఇచ్చే సమర్పణ శక్తి కూడా భగవానుడే. ఆహుతి చేయబడే వస్తువుకూడ భగవానుని ఒక రూపమే. హోతకూడ వాస్తవానికి మనిషి లోపల ఉన్న భగవానుడే. క్రియ, కర్మ, యజ్ఞం - అన్నీ గతిశీలమైన భగవానుని సత్తాలే. ఈ జ్ఞానం పొందిన సాధకునికి, ప్రజా సేవకునికి కర్మ ఎన్నడూ బంధనం కలిగించదు. అతడు చేసే ఏ కర్మ అయినా వ్యక్తిగతమైన అహంతో కూడి ఉండదు.

పరమసత్తా నడుపుతున్న ఈ జగత్తులో కర్మ చేయడానికి లక్ష్యం ఇదే కావాలి - భగవానునితో ఏకమై, భగవానుని స్థితినీ, చేతనను తెలుసుకోవడం ఈ తత్వాన్ని తెలుసుకున్న వ్యక్తి ఈ చైతన్య భావంతో ఎల్లప్పుడూ వెలుగొందుతూ ఉంటాడు. అతడు ముక్తుడు అవుతాడు. అయితే, యోగులందరూ ఈ జ్ఞానంవరకు చేరుకోలేక పోవచ్చునని భగవానుడు చెపుతున్నాడు. కనుకనే, ఆయన తర్వాత (25వ) శ్లోకంలో ఇలా చెపుతున్నాడు -

**దైవమే వాపరే యజ్ఞం యోగినః పర్యుపాసతే ।**
**బ్రహ్మాగ్నా వపరే యజ్ఞం యజ్ఞేనై వోప జుహ్వతి ॥**

అనగా -

**ఇతర యోగిజనులు దేవతల పూజ అనే యజ్ఞమునే చక్కగా అనుష్ఠానం చేస్తూ ఉంటారు. మరి కొందరు ఇతర యోగి జనులు పరబ్రహ్మ పరమాత్మ అనే అగ్నిలో అభేద దర్శనం అనే యజ్ఞం ద్వారా ఆత్మరూప యజ్ఞంలో హవనం చేస్తూ ఉంటారు.**

ఆత్మరూప యజ్ఞం అంటే అర్థం ఇది - జ్ఞానం ద్వారా పరమాత్మలో ఏకీభావంతో నిలచి బ్రహ్మరూపమైన అగ్నిలో యజ్ఞం చేయడం.

ప్రత్యేకమైన ప్రయోజనం కోసం ఇంద్రాది దేవతలకు దైవయజ్ఞం చేస్తారు. బ్రహ్మాగ్నిలో జీవాత్మను ఆహుతి ఇవ్వడం జ్ఞానయజ్ఞం. బ్రహ్మ అనే అగ్నిలో జీవాత్మను ఆహుతి ఇచ్చి, జీవాత్మ పరమాత్మల ఏకత్వాన్ని భావన చేస్తూ హోమం జరపడం అన్నిటికన్న శ్రేష్ఠమైన యజ్ఞ ప్రక్రియ. యజ్ఞ శబ్దాన్ని పరంపరగా వస్తున్న అర్థాల నుండి వేరు చేసి, విస్తృతమైన విరాట్ అర్థంలో గీతాకారుడు ఉపయోగించారు. ఈ వాస్తవాన్ని మనం 26-31 శ్లోకాలలో దర్శిస్తాం.

*(తరువాయి వచ్చే సంచికలో)*

### జ్ఞాన చక్షువు

పశ్చిమ బెంగాల్‌లో జన్మించిన సుబో ధరాయ్‌కి 7 సం॥ల వయసులో ఒకరోజు నిద్రిస్తూ ఉండగా నేత్రజ్యోతి ఆరిపోయింది. ఈయన ఏ మాత్రం విచారించక సాధారణ చక్షువులు పోతేనేమి, జ్ఞాన చక్షువుల్ని ఉపయోగించుకొందామని నిశ్చయించుకొన్నాడు. అంధ విద్యాలయంలో చేరి పట్టభద్రుడై స్కాలర్‌షిప్ లభించటంతో ఇంగ్లండ్, అమెరికా దేశాలకు వెళ్లి విద్యాభ్యాసం చేశాడు. ఈయన మేధాసంపదకు చకితురాలైన ఒక బెంగాలీ విదుషీమణి ఈయన్ని కోరి వివాహం చేసుకొన్నది. ఈయన డాక్టరేటు పట్టాను పొంది, అనంతరం అంధ విద్యాలయాన్ని నిర్మించి దాని అభివృద్ధికి సతీసమేతంగా తన పూర్తి కాలాన్ని, సామర్థ్యాన్ని వినియోగించాడు. అంతరంగంలోని జ్యోతిని దర్శించగల్గిన వారు కంటి జ్యోతి గురించి కన్నీరు కార్చరు.

- ప్రజ్ఞాపురాణం నుండి

**జ్ఞానదానం నేత్రదానంతో సమానం.**

## మాతాజీ దివ్య జీవనం - 2

# బాల్య లీలలు

తండ్రి జ్యోతిష్య జ్ఞానం అమ్మాయిని ఒడిలోనికి తీసుకుంటూనే సార్థకమయ్యింది. ఆయన బాలిక జన్మ ముహూర్తమును మనస్సులోనే గుణించారు. హోరా, లగ్నము, గ్రహముల గతి, వాని భావదశ లెక్కలు చూడగా ఆయన మొహంలో ఆనందరేఖలు వెల్లివిరిసాయి. జ్యోతిష్యపరంగా చేసిన ప్రతి గణన ఒకదాని తర్వాత ఒకటి ఒకే తథ్యము వైపు వేలు చూపించుచున్నది.

దేనిగురించి ఆయన ధ్యానంలో అనుభూతి చెందారో, సాధనా కాలంలో, జ్యోతిర్విద్య దీర్ఘ అధ్యయనంలో ఆయనకి ఆ తథ్యం మళ్ళీ మళ్ళీ అనుభూతిలోకి వచ్చింది. ఏమిటి అనగా 1926 వ సంవత్సరము, అత్యద్భుతమైన ఆధ్యాత్మిక శక్తి అవతరణ సమయం అని తెలిసినది. కానీ ఏ విధంగా? ఈ ప్రశ్నకి వారికి జవాబు దొరికేది కాదు.

కానీ ఆయన సాధన, జ్యోతిర్విద్యల ద్వారా తెలుసుకున్న అనుభూతులకు చరిత్ర సాక్ష్యం. ఈ సంవత్సరం వసంత పంచమి నాడు ప్రపంచములోని అతి గొప్ప ఆధ్యాత్మిక సంఘటన జరిగినది. పరమపూజ్య గురుదేవులు (15ఏళ్ల శ్రీరామ్) తన హిమాలయివాసి మహాగురుదేవుల మార్గదర్శనంలో అఖండ సాధనా దీపమును ప్రజ్వలితం చేశారు. ఆయన 24 సంవత్సరముల 24 గాయత్రి మహా పురశ్చరణ క్రమం ఈ సంవత్సరమే ప్రారంభింపబడినది. అంతేకాక శ్రీ అరవింద ఆశ్రమం పాండిచ్చేరిలో మహాయోగి అరవిందులు పూర్ణయోగం విశేష సిద్ధిలో సాఫల్యం పొందుతున్నారు. ఈ సంవత్సరం చివరి నెలలలో అతి మానసిక చేతన పృథ్విపై అవతరించింది. మహాయోగి అరవిందులు అతి మానసిక చేతన అవతరణ కొరకు పరిపూర్ణ ఏకాంత సాధనలోకి వెళ్లారు.

పై రెండు సంఘటనల కంటే ఏ ఆధ్యాత్మిక శక్తి అవతరణకు సాక్షిగా నేడు జస్వంతరావుగారు ఉన్నారో ఆ బాలిక జననం చాలా ముఖ్యమైనది. ఎందువల్లనంటే ఇక్కడ ఆధ్యాత్మిక మహాశక్తి స్వయంగా స్థూలదేహం ధారణ చేసి అవతరించినది. ఆదిమాత స్వయంగా తన లీలా భూమిలో ఆవిర్భవించింది. నీలాకాశంలో సూర్యదేవుడు చాలా ఆశ్చర్యంతో ఈ దృశ్యమును చూచుచున్నారు. ఆయన శతసహస్ర కిరణాలు అప్పుడే అవతరించిన జగదంబ అర్చన, వందన సౌభాగ్యం పొందుతున్నవి. పూర్తి వాతావరణంలో స్నిగ్ధమైన శాంతి, శీతలత్వం, మధురమైన వాసన వ్యాపించుచున్నవి. ఈ చిన్న గ్రామము తీర్థభూమిగా మారినది. ఇక్కడ ఈ క్షణంలో అనేక మార్పులు జరుగుచున్నవి.

జస్వంతరావుగారి మనోభూమి మాత్రము మార్పులేకుండా ఉన్నది. ఆయన సువాసనతో కూడిన మొగ్గలాంటి కమనీయకాంతులు విరజిమ్ముతున్న తన కూతుర్ని ఒళ్లోకి తీసుకుని చూస్తూ ఉన్నారు. పక్కింటి ఆవిడ ఆయనను ఇలా పలకరించకపోతే, ఆయన ఇలా ఎంత సేపు ధ్యానంలో ఉండిపోయేవారో తెలియదు - "ఏం ఉందని అమ్మాయిలో, అలా చూస్తున్నావు అప్పటి నుంచి?" ఆయన ఈవిధంగా అన్నారు - "ఈ అమ్మాయి చాలా అదృష్టవంతురాలు. ఈవిడ వేలాదిమందికి రోజూ కడుపునిండా ఆహారాన్ని ఇస్తుంది" అని కొంత ఆలోచించి ఇలా అన్నారు - 'ఈమె అందరి భాగ్యములు రాసే భగవతి'.

ఈయన చెప్పిన నిగూఢ విషయములు ప్రక్కింటామెకు అర్థం కాలేదు. ఆవిడకి తెలిసినది ఏమిటంటే - ఈనాడు లోకంలో మొగపిల్లవాడు పుట్టడం మంచిది, ఆడపిల్ల పుట్టడం అంత ఆనందదాయకంకాదు అని. అందువల్ల అమ్మాయి పుడితే జస్వంతరావుగారు ఇంత ఆనందంగా ఎందుకు ఉన్నారో అన్నది ఆమెకు అర్థం కావడం లేదు. ఆయన మాటలలో తన అమ్మాయికి భగవతి అని పేరు పెట్టారాయన అని అర్థమైంది. ఆమె ఆయన ఒడిలోంచి బిడ్డను తీసుకుని లేడీ లాయల్ ఆసుపత్రిలో విశ్రాంతి తీసుకుంటున్న తల్లి పక్కన పడుకోబెట్టింది. తన అమ్మాయికి పెట్టిన పేరు తల్లి చెవిలో కూడా పడింది. ఆమె చాలా ప్రేమగా తన కూతుర్ని చూసుకుంది. నిరంతరం చిరునవ్వుతో చంచలంగా ఉన్న తన చిన్నారి కూతురు మొహంలోకి చూస్తూ, ఆ కళ్లలో ఉన్న సమ్మోహన శక్తిని చూసి ఆశ్చర్యపోయింది. ఆహా! ఎంత అందమైన కళ్లు. సాక్షాత్ దేవీ నేత్రములే. నా ఈ చిన్నారి తల్లి నిజంగా మాతా భగవతియే. తల్లి మమతలో, తండ్రి స్నేహమయ లాలనలలో చంద్రుని కళలవలె భగవతి రోజురోజుకి వర్ధిల్లసాగింది. స్వజనులతో ఆమె చిన్నతనం కొనసాగింది.

స్వజనులతో గడిపిన ఈ చిన్నతనపు ఘడియలు చాలా తియ్యటి గుర్తులు. అప్పుడప్పుడు ఈ సంఘటనలలో అలౌకికత్వము తొంగి చూసేది. భగవతి తన తల్లికే కాక అన్నదమ్ములందరికీ చాలా ముద్దు. అతి సామాన్యమైన రూపము, రంగు ఉన్నప్పటికీ ఆమెలో దైవత్వంతో కూడిన ఒక ఆకర్షణ ఉండేది. చుట్టుప్రక్కల వాళ్లు,బంధువులు,మిత్రులు ఈ దైవీ ఆకర్షణకు లోనయ్యేవారు. ఆమె వీరందరికీ అతిప్రియమైన "లాలి". వ్రజక్షేత్రంలో ఈ శబ్దము అత్యంత ప్రేమాస్పదమైన

**ఆత్మజ్ఞానం కోసం ఇంటిని విడవడంకన్న ఆసక్తిని విడవడం మేలు.**

చిన్నపిల్లలకు వినియోగించేవారు. కథలలో ఈ శబ్దమును మొట్టమొదట ''బర్సాన్''లో రాధారాణిని పిలవడానికి వినియోగించారు అని తెలుపుతారు. వృషభానునందిని తన తల్లితండ్రులకు తన అన్న శ్రీదామకు మాత్రమే కాక మొత్తము బర్సాన్‌కు 'లాలి'. పరమపురుషుని ఆహ్లాదినీ శక్తిని అందరూ 'లాలి' అని ప్రేమతో పిలిచేవారు.

భగవతికి కూడా ఈ సంబోధన లభించింది. జన్మనిచ్చిన తల్లి రామప్యారీ, తండ్రి జస్వంతరావు, అన్నలు దీన్ దయాల్, సున్‌హరిలాల్‌లు, అక్క ఓంవతీ అందరూ ఆమెను లాలీ అని పిల్చేవారు. చుట్టుప్రక్కల వాళ్ల నాలుకల మీద ఈ సంబోధనే ఆడుచున్నది. లాలి అందరిది. అందరి ప్రేమ సహజంగానే ఆమె మీద కురిసేది. చిన్నపిల్లలు సాధారణంగా అల్లరి చేస్తూ చంచలంగా ఉంటారు. కానీ ఈ లక్షణాలు ఏవీ ఆమెలో లేవు. అత్యంత అమాయకత్వంతో కూడిన అత్యంత శాంత ప్రవృత్తి ఆమెది. చిన్నచిన్న అడుగులు వేస్తూ మాట్లాడటం మొదలు పెట్టగానే, అమ్మను అమ్మ అని తండ్రిని దాదా అని పిలవడం నేర్చుకుంది. చిన్ని అడుగులు వేస్తూ వచ్చే తమ ప్రియమైన లాలిని జస్వంతరావు అత్యంత ప్రేమతో ఎత్తుకొనేవారు. ఆమె ప్రతి కోరికను తీర్చడం తన అదృష్టంగా భావించి చేసేవారు. ఆయనకు ఆమె తన దివ్య అనుభూతుల సాకార రూపంగా కనిపించేది.

కాలం అనే రథం మీద స్వారీ చేస్తున్న భగవతి చిన్నతనము నలువైపులా వాతావరణంలో మధుర సంగీతం సృష్టిస్తూ ముందుకు సాగుతున్నది. ఈ మాధుర్యంలో హఠాత్తుగా ఒక విషాద స్వరం పలికినది. జన్మదాత్రి మాత తన ప్రియమైన లాలిని 4 సంవత్సరముల వయస్సులో వదిలేసి కన్ను మూసింది. కేవలం జ్వరము వలన మాత్రమే ఆమె అసువులు బాసింది. భగవతి బాలనేత్రములలో కన్నీళ్లు వచ్చాయి. ఆ చిన్న హృదయంలో భావనల తుఫాను రగిలింది. మాతృవియోగపు ఆ ఘడియలు ఆమెకు చాలా దారుణంగా ఉన్నాయి. నాల్గుసంవత్సరాల పిల్లకు తల్లేకదా అంతాను. ఆ తల్లే లేకపోతే ? కానీ నిజం నిజమే కదా. తన తల్లి జ్ఞాపకాలలో ఆమె చాలా రోజులు ఏడ్చింది. కానీ ఈ అత్యంత బాధాపూరిత సమయంలో కూడా ఆమె అంతరిక చేతన సక్రియంగా, సచేతనంగా ఉన్నది. అక్కకు, అన్నలకు ఇది చాలా ఆశ్చర్యంగా ఉండేది. ఎందుకంటే అప్పుడప్పుడు ఈ చిన్ని లాలి వాళ్లను ఓదార్చేది.

అప్పుడప్పుడు ఆమె ఏమీ మాట్లాడకుండా మఠం వేసుకుని కూర్చునేది. ఆమెను ఇటువంటి భావమగ్నదశలో చూసి కుటుంబసభ్యులకు ఆశ్చర్యంగా ఉండేది. వారికి ఈమె ఆంతరిక పరిస్థితిని గురించి ఏమీ తెలియదు. ఇంత చిన్నపిల్ల ఎందుకు ఏకాంతంలో ఇంత శాంతంగా కూర్చుంటున్నదో వారి ఆలోచనలకు అందేది కాదు. ఒకరోజు పెద్దన్న దీన్‌దయాల్ ఆమె ఇలా కూర్చుండుట చూసి అడిగాడు - 'లాలి, నీవెందుకు ఇంత శాంతంగా కూర్చుని ఉంటావు? మిగతా పిల్లలతో పాటు ఎందుకు ఆడుకోవు? ఎప్పుడు ప్రపంచభారం మొత్తం నీ మీదే ఉన్నట్టు కూర్చుంటావు?' శాంతి నిండిన పెద్దపెద్ద కళ్లతో పెద్దన్నను చూస్తూ ఆ ప్రశ్నకు ఆమె ఇలా జవాబిచ్చింది - "నిజము అంతే కదా! మొత్తం ప్రపంచ భారం నామీద కాక ఇంకెవరి మీద ఉంటుంది?'' ఈ మాటలు దీన్‌దయాళ్‌కు ఏమీ అర్థం కాలేదు. కానీ ఈ వాక్యాలు ఆమెకు చిన్నతనం నుంచే ఆమె భవిష్యత్ బాధ్యతలను గురించి పరిపూర్ణ జాగరూకత ఉన్నది అనే సత్యాన్ని తెలుపుచున్నవి.

ఈ రోజుల్లోనే దీన్‌దయాళ్‌కు పెళ్లయింది. అతని భార్య అనగా భగవతి పెద్దవదిన చాలా స్నేహశీల స్వభావం కలది. ప్రేమపూర్ణ హృదయం కల స్త్రీ. తన చిన్నారి మరదలిని చాలా ప్రేమతో పెంచింది. జాగ్రత్త తీసుకుంది. ఆమె హృదయానికి నిరంతరం తన చిన్నారి మరదలు ఒక దేవి అనిపించేది. తన మరదలు పారదర్శకమైన కళ్లలో ఆమెకు అలౌకికమైన పారలౌకికమైన కాంతి కనిపించేది. తన మరదలు అనే మాటలలో ఆమె విశ్వాసం ఇంకా సుదృఢమయ్యేది. అలాంటి ఒక సంఘటన ఆమె(వదిన) తండ్రి ఆమెను తీసుకు వెళ్లేటప్పుడు జరిగింది. 10, 15 రోజుల క్రిందట ఈ ఆశయంతో రాయబడిన ఉత్తరము అందింది. దానిలో ఆయన వచ్చి తీసుకువెళ్లే తిథి ఖచ్చితంగా ఇవ్వబడింది. కానీ ఆ తిథికి ఆయన రాలేకపోయారు. ఏ విధమైనటువంటి కబురు రాలేదు.

అందువల్ల ఆమె(వదిన) చాలా బెంగలో ఉండేది. ఎవరికీ ఏమీ చెప్పకపోయినా చాలా ఉదాసీనంగా ఉండేది. ఇంటి పనులను, బాధ్యతలను నిర్వహిస్తూ ఆమె ప్రతి క్షణమూ ఆవేదన చెందుతూ ఉండేది. మనస్సులోని ఈ బాధ ముఖములో ప్రతిబింబించేది. ఒకరోజు భగవతి ఆమెను మెల్లగా అడగనే అడిగింది - "ఏమి వదినా! ఈ మధ్య మీరు ఇంత చికాకుగా ఉన్నారు'' అని. ఆమె "ఏమీలేదు లాలి'' అని జవాబు ఇచ్చింది. అప్పుడు భగవతి చిరునవ్వుతో ఇలా అనెను - 'ఏమీ లేకపోవడం ఏమిటి, చెప్పమంటావా?'' మెల్లిగా గంభీరంగా ఇలా అంది - "మీ నాన్నగారు రాలేదని నీవు బాధపడుతున్నావు కదా. కానీ నీవు ఎక్కువ బాధ పడవద్దు. చాలా తీవ్రజ్వరం రావడం వల్ల ఆయన రాలేకపోయారు. ఆయన ఉత్తరం రాసారు కానీ, అది సకాలంలో మనకి అందలేదు. ఇవ్వాళ ఆయన రావడానికి బయలుదేరుతున్నారు. రేపు వచ్చేస్తారు. ఉత్తరం కూడా ఇవ్వాళ మీకు అందుతుంది.''

**సాఫల్యానికి మూలాధారం ఉత్కృష్ట వ్యక్తిత్వం.**

తన చిన్నారి మరదలి మాటలు విని ఆమె చాలా ఆశ్చర్యం పొందింది. ఎందువల్లనంటే తన మనస్సులోని మాటలు ఆమె ఇంటిలో ఎవ్వరికి చెప్పలేదు. ఆమె ఆశ్చర్యం నిజంగానే పోస్టుమాను వచ్చి ఉత్తరం ఇవ్వడం వల్ల వృద్ధి పొందెను. ఉత్తరంలో లాలి చెప్పినట్టుగానే అన్నీ రాసి ఉన్నాయి. రెండవరోజు ఆమె తండ్రి ఆమెను తీసుకువెళ్లుటకు వచ్చెను. ఆయన వస్తూనే ఇంట్లో వారికి తన ఆరోగ్యం గురించి తెలిపారు. అవన్నీ ఆమెకు ప్రేమ పాత్రురాలైన చిన్నారి మరదలు చెప్పినట్లే ఉండెను. అప్పటి నుంచి ఆమెకు భగవతి ఒక దైవీ శక్తి అవతారమని దృఢపడింది. ఆమె హృదయంలో తన మరదలి మీద ప్రేమ మొదటి నుంచి ఉండేది. ఇప్పుడు ఆమెమీద గౌరవము, శ్రద్ధ కూడా పెరిగాయి.

భగవతి మనస్సులో తన వదిన మీద విశేష ప్రేమ ఉండేది. తన వయస్సుకి తగినట్టు ఆమెకు ఇంటిలోని చిన్న చిన్న పనులలో సహాయపడేది. అప్పుడప్పుడు వదినతోనూ, అక్కతోనూ కలిసి బొమ్మలాట ఆడేది. ఇది ఆమెకు చాలా ఇష్టమైన ఆట. అబ్బాయి బొమ్మ, అమ్మాయి బొమ్మ చేసి అలంకరించే బాధ్యత వదినది. దానికొరకు ఆమె ఎప్పుడూ రంగు రంగుల బట్టముక్కలని సమకూరుస్తూ ఉండేది. దానితో ఆమె తన లాలి బొమ్మల్ని అందంగా తీర్చిదిద్దేది. అబ్బాయి బొమ్మకి జ్వరం వస్తే వైద్యుడిని పిలిచేవారు. మూలికలు అరగతీసి మందు తయారు చేసేవారు. ఈ విధంగా మందు తిని పత్యము చేసి పెళ్లి కుమారుడు ఆరోగ్యవంతుడు అయ్యేవాడు. దానితోపాటు చిన్నారి భగవతి నవ్వు మళ్లీ వినిపించేది. బొమ్మల పెళ్లిళ్ల ఆట ఆమె చిన్నతనపు నిజమైన సహచరి. ఈ ఆటలో ఇంటిలోని ప్రతివారు తప్పని సరిగా పాలుపంచుకొనవలసి వచ్చేది. ఒకసారి పెండ్లి కుమారునికి అనారోగ్యము వస్తే మందు ఇప్పించటం. ఇంకోసారి అమ్మాయి పెండ్లి, మరొకసారి నూతన గృహానికి కావల్సిన ఏర్పాట్లు ... ఈ విధంగా అనేక పనులు చేసి, చేయించుటలో ఆమె చిన్నతనం ఆటలలో ఉల్లాసమయంగా గడిపేది. మహాశక్తి యొక్క ఈ లీలలో ఆమె దివ్యలీల అప్పుడప్పుడు బహిర్గతం అయ్యేది. ఆటలలోనే అనేకానేక దివ్యభావాలు అంకురించి, పెరిగి ఈ సృష్టి విశాల ప్రాంగణంలో వెదజల్లబడేవి. క్రీడామయి శాంత భావనతో వాటిని చూస్తూ ఉండేది.

★★★

## స్వాయిజర్ సేవావ్రతం

జర్మనీలోని సేవావ్రతి అయిన స్వాయిజర్ అనేక విషయాలలో విజ్ఞుడు. ఆఫ్రికా అడవుల అధ్యయనం, చికిత్స ఆవశ్యకత గురించి ఈయన కృషి చేసేవారు. నీటి కొరతవల్ల ఆఫ్రికన్‌లు బానిసల్లాగ పట్టుబడి అమ్మబడుతూ ఉండేవారు. అందువలన ఈయన తన ఉద్యోగాన్ని వదిలి ఆఫ్రికాలో వెనుకబడిన ప్రాంతాలలో తిరుగుతూ విద్య, వైద్య కార్యక్రమాలలో లీనమయ్యారు. ఈ విధంగా చేయటంవలన అనేక బాధలు, కష్టాలు పడవలసి వచ్చింది. అయినా పట్టుదలతో జీవితమంతా ఈ కార్యక్రమాలలోనే నిమగ్నం అయారు.

"మనం వేటినైతే జంతువులని అంటామో" అనే పుస్తకంలో స్వాయిజర్ ఒక ఉదాహరణ నిస్తూ "పశుపక్ష్యాదులలో కూడ సామూహిక సేవకోసం తమ ప్రాణాలను సహితం అర్పించే గుణమున్నది. అలాంటప్పుడు మానవుడు తన సమాజం వేదనను గుర్తించకుండా నికృష్టంగా బ్రతికేస్తే మానవ జన్మకు శ్రేష్ఠత ఎక్కడుంటుంది." అని ప్రశ్నించారు. ఆయన తన సంస్మరణలో "నేను సాయంకాలం భ్రమణానికి వెళుతూఉండేవాడిని. ఒక ఏటి ఒడ్డున కూర్చుని బాతుల జలక్రీడలు చూస్తూఉండేవాడిని. ప్రతిరోజు సాయంత్రం 5 గంటలకే పక్షులు అడవిలోని ఒక పొదవైపు ఎగురుతూ ఉండేవి. ఒకరోజు ఒక వ్యక్తి వాటిలోని ఒక పక్షిపిల్ల రెక్కను తెగగొట్టాడు. ఆ రోజున కూడ పక్షులు నిర్ణీత సమయానికి ఎగిరాయి. కానీ కొద్దిసేపట్లో క్రిందకి దిగివచ్చేశాయి. మళ్లీ కాసేపు ఆకాశంలో ఎగిరి, చుట్టూ తిరిగి క్రిందకి వచ్చేశాయి. నియమబద్ధంగా ఉండే వాటి ప్రవర్తన ఆ రోజు కొత్తగా ఉండటం వలన నేను దగ్గరగా వెళ్లి విషయమేమిటా అని పరికించాను. తిరిగి పక్షి పిల్లకు క్రొత్తరెక్క ఏర్పడే వరకు ఆ మొత్తం పక్షులు కాసేపు పైకి ఎగురుతూ గూళ్లు చేరాలని ప్రయత్నిస్తూ మళ్లీ వెళ్లలేక క్రిందకు దిగి పక్షిపిల్ల పరిస్థితిని పర్యవేక్షిస్తూ ఆక్రోశించాయి. వాటి ఆక్రోశంతో అడవి మొత్తం ప్రతిధ్వనించింది. "కరుడు కట్టిన కాఠిన్యంతో జీవిస్తాయి అని అనుకొనే అడవిమృగాలతో నిండిఉన్న ఘోర అరణ్యంలో కూడ ప్రేమ, సంవేదన, స్నేహం వంటి దైవీగుణాలు మిగిలిఉన్నపుడు ఈనాటి సమాజం ఎలా ఉంది? ఎలా ఉండాలి? అనే ప్రశ్న ఎద ఎదలో ఉద్భవించి తీరాలి. ఆ సంవేదన ఉద్భవిస్తే తప్ప ఈ సమాజాన్ని ఎవ్వరూ మార్చలేరు." అని వ్రాశారు.

- ప్రజ్ఞాపురాణం నుండి

**తాను ప్రశాంతంగా ఉండి ఇతరులను ప్రశాంతంగా ఉండనివ్వడం ఉత్తమోత్తమ విధానం.**

## బోధకథ

# వీరవ్రతధారి జతీన్

కలకత్తాలోని తెల్లవాళ్ళ బజారులో ఒక ఆంగ్లేయుడు చేతి కర్ర ఊపుకుంటూ చాలా పొగరుగా నడుస్తున్నాడు. దారిలో భారతీయులు ఎవరు కనపడ్డా - వాళ్ల పురుషులుగానీ, స్త్రీలుగానీ, వృద్ధులుగానీ, పిల్లలుగానీ - వాళ్ల తలలమీద కర్రతో ఒక దెబ్బవేసి ఇదుగో యాభయ్, ఇదుగో యాభయ్ ఒకటి అంటూ పోతున్నాడు. అతడు ఎక్కడకు వెళుతున్నాడో తెలియదుగాని బయలుదేరిన తర్వాత ఇప్పటికి యాభయ్ ఒక్క మందిని తన కర్రతో కొడుతూ వస్తున్నాడని మాత్రం అర్థం అవుతోంది.

ఇంతలో జతీన్ అనే పిల్లవాడు ఏదో పని మీద ఆ వీధిలోకి వచ్చాడు. ఆంగ్లేయుడు చేస్తున్న పని, కనపడ్డ భారతీయులను తన కర్రతో బాదుతూ లెక్కవేయడం, అతడికి అర్థం కాలేదు. కానీ వెంటనే తెలుసుకోగలిగాడు - తెల్లవారి పాలనలో తెల్లవాళ్లు చేసే ఎటువంటి అపరాధాలయినా క్షమించబడతాయితప్ప వారికి శిక్షలు పడవు. అందుకే వాళ్లు తమకిష్టం వచ్చినట్లు నిర్భయంగా వ్యవహరిస్తారు. మరుక్షణం జతీన్ పరుగెత్తుకొని వెళ్లి ఆ తెల్లవాడిని ఒక్క తోపు త్రోసి క్రిందపడవేశాడు. అతడి చేతిలోని కర్ర లాక్కొని - ఇదుగో పట్టు యాభయ్ మూడు, యాభయ్ నాలుగు అంటూ వాడి తల మీద బాదసాగాడు.

చుట్టూ పెద్ద గుంపు చేరింది. తన అధికార మదం మర్చిపోయి ఆంగ్లేయుడు తిరిగి చూడకుండా పారిపోయాడు. ఆరోజుల్లో ఆంగ్లేయులతో మాట్లాడడానికి కూడా ప్రజలు భయపడుతుండేవారు. వాళ్లకి ఎప్పుడు, ఎందుకు కోపం వస్తుందో తెలియదు. ఆకోపంలో ఏం చేస్తారో తెలియదు. అంతా వాళ్ల ఇష్టారాజ్యం కదా! అటువంటి పరిస్థితుల్లో ఒక చిన్న పిల్లవాడు వాళ్లమీద తిరగబడడమన్నది అతి సాహసకార్యం క్రింద లెక్క.

జతీన్ పుట్టుకతో ధైర్య సాహసాలు కలవాడు కాదు. చిన్నప్పుడు ఎలుకను చూసినా, పిల్లిని చూసినా బెదిరి పోతుండేవాడు. ఐదు సంవత్సరాల వయసులో వెంటాడిన దురదృష్టం, సంఘర్షణతో నిండిన పరిస్థితులు అతడిని సాహసవంతుడిగా, ధైర్యశాలిగా మలిచాయి.

జతీన్‌కి ఐదుసంవత్సరాల వయసులోనే తండ్రి మరణించాడు. అటుతర్వాత కొద్దిరోజుల్లోనే తల్లి కూడా చనిపోయింది. జతీన్ పోషణభారం మేనమామ తన మీద వేసుకున్నాడు. తమ ఇంటి ఆడపడుచు ఆఖరిగుర్తుగా భావించి చాలా గారాబంగా చూసుకునేవాడు. జతీన్ పూర్తిపేరు జ్యోతీంద్రనాథ ముఖర్జీ. తాత, మేనమామా ఎంతబాగా చూసినా, అతడు తల్లిదండ్రులను మరువలేక పోయేవాడు. అతడి ధ్యాస మళ్లించడంకోసం ఇరుగు పొరుగు పిల్లలను జతీన్‌తో ఆడుకోమని చెప్పేవారు. ఆరోజుల్లో చుట్టు ప్రక్కల పిల్లలంతా కసరత్తు చేయడానికి వెళుతుండేవారు. అఖాడాలో కుస్తీపోటీలు జరుగుతూ ఉండేవి. జతీన్ వాళ్లతో పాటు వెళ్లసాగాడు. అవి అతడికి బాగా నచ్చాయి. వాటి మీద మనసు లగ్నమైంది. వ్యాయామం పట్ల శారీరక సౌష్టవం పట్ల అతడికి శ్రద్ధ ఎంతగా పెరిగిందంటే - యుక్తవయసు రాకుండానే అతడు గుర్రపుస్వారీ, ఈత, కర్రసాము, కత్తిసాముల్లో చక్కటి నేర్పు సంపాదించాడు.

ఇలాంటి బాల సంవర్ధన ప్రక్రియ మనిషిలో సహజంగానే ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది. మనిషి అన్ని భయాలనుండి విముక్తుడౌతాడు. భయాన్ని జయించగలిగితే మనిషిలో సాహసం సిద్ధిస్తుంది. తల్లిదండ్రుల జ్ఞాపకాలనుండి మరల్చడానికి జతీన్ దృష్టిని ఈవైపుకి త్రిప్పితే, అతడు పిరికివాడి నుండి సాహసవంతుడిగా, బలహీనుడి నుండి బలశాలిగా రూపాంతరం చెందాడు. ఐదారు సంవత్సరాల ముందు జతీన్ బయటి వ్యక్తులెవరైనా వస్తే వాళ్లను చూడడానికి కూడా సిగ్గుపడేవాడు. అదే జతీన్ పాలకవర్గంవారిని కూడా లెక్క చేయకుండా ఎదుర్కొనడానికి సిద్ధపడ్డాడంటే - అది అతడి పురుషార్థానికీ, వికసితమైన ఆత్మవిశ్వాసానికీ ప్రతీక.

జతీన్ చదువు సంధ్యలు కూడా బాగానే సాగుతున్నాయి. అక్కడ కూడా తెల్లవారి పిల్లల ఆగడాలు సహించక వాళ్లని ఏడ్పిస్తుండేవాడు. అతడిలో ఆంగ్లేయుల పట్ల అసహ్యం పెరగడానికి పెద్ద కారణం ఇంకోటి ఉంది. 1905వ సంవత్సరం నాటి మాట. ప్రిన్స్ ఆఫ్ వేల్స్ ఇంగ్లాండు నుండి భారతదేశం వచ్చాడు. కలకత్తా వీధుల్లో అతడి వాహనం తిరుగుతున్నది. వేలకొద్దీ స్త్రీ పురుషులు ఫుట్‌పాత్‌లపైన నిలబడి ఉన్నారు యువరాజుని చూడాలని. ఒక సందు మొగదల ఒక గుర్రపుబగ్గీ నిలిచి ఉంది. అందులో కొందరు మహిళలు ఉన్నారు. ఆ స్త్రీలను వేధించడానికి ఐదారుగురు తెల్లయువకులు బగ్గీ టాపు మీదకు ఎక్కారు. స్త్రీల మొహాలమీదకు కాళ్లు వేళ్లాడవేసి ఊపుకుంటూ ఈలలు వేయసాగారు. బండిలో స్త్రీలతో పాటు వాళ్ల కుటుంబీకులు కూడా ఉన్నారు. కానీ భయం వల్ల ఏమీ అనలేకపోతున్నారు. అక్కడే ఫుట్‌పాత్ మీద నిలబడి ఉన్న జతీన్ ఇదంతా చూశాడు. సమస్త స్త్రీ జాతికి, భారతీయ మాతృశక్తికి జరుగుతున్న అవమానాన్ని సహించలేకపోయాడు. వెంటనే ఒక్క గంతులో బగ్గీ టాపు మీదకు చేరాడు. తెల్ల యువకులందరినీ ఒక్కతోపు త్రోశాడు. ఊహించని సంఘటనకి తెల్లయువకులు దిమ్మెరపోయారు. ఎత్తునించి పడడంతో నడుములు విరిగినంత పనయింది. తిరిగి చూడకుండా పరుగు లంకించుకున్నారు.

**ఉన్నతంగా,ఉదాత్తంగా ఉండడం, ఉత్సాహం ఉరకలు వేస్తూ ఉండడం - ఇదే జీవితం.**

ఈ సంఘటన తర్వాత కొద్ది రోజులకు జతీన్ రైలు మీద రాజఘాట్ వెళుతున్నాడు. అతని ప్రక్క పెట్టెలో ఒక వృద్ధుడు తన కూతురుతో పాటు కూర్చుని ఉన్నాడు. దారిలో ఇద్దరు ఆంగ్లేయులు ఆ పెట్టెలో ఎక్కారు. పెట్టెంతా ఖాళీగా ఉన్నప్పటికీ ఆయువతికి అంటుకుని చెరోప్రక్కా కూర్చున్నారు. ఆమెను నొక్కివేస్తూ ఆనందించసాగారు. పాపం ఆ వృద్ధుడు వాళ్లను ఎంతగానో బ్రతిమాలుకోసాగాడు. పొగరుబోతులైన ఆ తెల్లవాళ్లమీద అదేమీ పని చేయడం లేదు. పెట్టెలో ఉన్న ఇతర ప్రయాణికులు మధ్యలో కలిగించుకొని ఇబ్బందులు కొనితెచ్చుకోవడమెందుకని చూసీ చూడనట్లు మొహాలు తిప్పుకొని కూర్చున్నారు. తర్వాతి స్టేషనులో బండి ఆగినప్పుడు జతీన్ క్రిందకు దిగాడు. ప్రక్క పెట్టెలోని దృశ్యం అతడి కంట పడింది. వాళ్ల దుర్మార్గపు చేష్టలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. విషయం అర్థం అయింది. ఒక్క ఉదుటన పెట్టెలో కెక్కాడు. ఆ తెల్లవాళ్లిద్దరినీ పిడిగుద్దులు గుద్దుకుంటూ ప్లాట్‌ఫారం మీదకు ఈడ్చి పడవేశాడు. అక్కడ ఉన్న పోలీసులకి విషయం గ్రహించడానికి ఎక్కువ సమయం పట్టలేదు. వాళ్లు చూస్తుండగానే రైలు బయలుదేరిపోయింది. దుర్బలులు, అశక్తులు, పీడితులైనవారిని అనాచారులు, ఉన్మత్తులు, ఆకతాయిలనుండి రక్షించవలసిన బాధ్యత శక్తివంతులది. కానీ మనకు తరచుగా కనపడేదేమిటంటే - మంచివారు, ధర్మాధర్మములు తెలిసిన వారు కూడా మధ్యలో కలగచేసుకొని కష్టాలు కొనితెచ్చుకోవడమెందుకని ప్రక్కకు తప్పుకుంటున్నారు. పరాయి పాలన కలిగించిన బానిస మనస్తత్వం అందరిలో అణువణువునా నిండి ఉండేదప్పుడు. ఈ కాలంలో కూడా అదే విధమైన మనస్తత్వం కనపడుతుండగా, అప్పటి పరిస్థితి గురించి ఆశ్చర్యపడవలసిన దేమున్నది! కానీ జతీన్ లాంటి వ్యక్తులు ఏకాలంలోనైనా, ఎటువంటి క్లిష్ట పరిస్థితుల్లోనైనా అన్యాయానికీ, అనాచారానికీ వ్యతిరేకంగా పోరాటం సాగిస్తూనే ఉంటారు.

జతీన్ వీలు కుదిరినప్పుడల్లా ఆంగ్లేయులకు జీవితంలో మర్చిపోలేని పాఠాలు నేర్పేవాడు. ఆఫీసరయేది, సిపాయి అయేది లెక్క చేసేవాడు కాదు. ఒకసారి అతను డార్జిలింగ్ వెళుతున్నాడు. ఆ రైల్లోనే నలుగురు ఆఫీసర్ల మంచిచెడ్డలు చూడ్డానికి కొందరు సైనికులు కూడా వెళుతున్నారు. రైలు ఆగినప్పుడల్లా ఆ సైనికులు స్టేషన్లో దిగి మహాగర్వంగా అటూ ఇటూ తిరగడం ప్రయాణికులను సతాయించి ఆనందించడం చేస్తున్నారు. భారతీయులను "కూలీ" అని సంబోధిస్తున్నారు. ఒక స్టేషనులో జతీన్ అనారోగ్యంతో ఉన్న తోటి ప్రయాణికుడికి మంచినీళ్లు తేవడానికి దిగాడు. లోటా నింపుకొని పెట్టెవైపు వెళుతుండగా ఒక ఆఫీసర్‌ను ఢీ కొన్నాడు. ఆ తెల్లవాడు తన చేతిలోని బెత్తంతో జతీన్ వీపుమీద బలంగా బాదాడు. మారుమాట్లాడకుండా జతీన్ పెట్టెలోకి వెళ్లి ఆ రోగికి నీళ్ల లోటా ఇచ్చి క్రిందికి దిగాడు. ఆ తెల్ల ఆఫీసరు చెయ్యి పట్టుకొని ఎలా మెలి తిప్పాడంటే - ఆఫీసరు చేసిన హాహాకారాలకి స్టేషను దద్దరిల్లిపోయింది. ఇతర తెల్ల యువకులు ఒక్కుమ్మడిగా వచ్చి జతీన్ మీద కలబడ్డారు. కానీ బలిష్టమైన అతని చేతుల్లో చావు దెబ్బలు తిని పారిపోయారు. ఈ విషయంలో కేసుకూడా పెట్టారు. కానీ ఆంగ్లేయ జడ్జీ మొదటి వాయిదాలోనే కేసు కొట్టివేశాడు.

జతీన్ చిన్న వయసులోనే సోదరి నివేదిత సాహచర్యంలోకి వచ్చాడు. ఆమె ఈ అభిమానధనుని, వీరకిశోరాన్ని స్వామి వివేకానందుని వద్దకు తీసుకువెళ్లింది. స్వామి ఆ బాలుని ప్రశంసించారు. ఇటువంటి సాహసవంతులే దేశాన్ని పరాయిపాలన నుండి రక్షించగలరని అన్నారు. వివేకానందుని ద్వారా ప్రేరణ, ప్రోత్సాహం పొందిన జతీన్ జాతీయ ఉద్యమాలలో పాలుపంచుకోసాగాడు. అటుతర్వాత, ఆధ్యాత్మిక వేత్త, జాతీయవాది, విప్లవకారుడు అయిన శ్రీఅరవిందఘోష్‌కు సహచరుడయినాడు. ఆయన మార్గదర్శనంలో స్వాతంత్ర్యోద్యమాన్ని వేగవంతం చేశాడు. శ్రీ అరవిందులు దేశంలోని యువకుల నుద్దేశించి ఇలా అన్నారు - "భారతదేశమంటే నేలలో ఒక భాగం కాదు. ఈ భూమి మన తల్లి. సింధు నుండి హిమాచలం వరకు వ్యాపించిఉన్న అఖండ విరాట్ భారతదేశపు భూమి మన జనని. మనకు జన్మ నిచ్చి పోషించే తల్లి. మాతృసత్తా రూపంలో ఈ దేశమును ప్రతిష్ఠాపన చేయాలి."

అరవిందులవారి ఈ అభిప్రాయాన్ని జతీన్ తన మనసులో గాఢంగా నాటుకున్నాడు. శ్రీఅరవిందుల జాజ్వల్యమాన సాహిత్యానికి మరింత చేరువయ్యాడు. వీరిద్దరి మధ్య గురుశిష్య సంబంధం ఏర్పడింది. శ్రీ అరవింద యోగి తన సహచరులందరి కంటే ఎక్కువగా జతీన్‌ని విశ్వసించేవారు. అభిమానించేవారు. ఆయనకు తన ఆకాంక్షలను పూర్తి చేయగల సామర్థ్యం జతీన్‌లో కనిపిస్తుండేది. రాజకీయ ఆకాశంలో తమ ప్రతిభ సూర్యుని వలె వెలుగుతున్న ఆ రోజులలో శ్రీఅరవిందులు దైవశక్తుల సంకేతంతో తమ బాహ్య కార్యకలాపాలను ముగించుకొని తపశ్చర్యద్వారా ప్రజల హృదయాలను దేశభక్తి పూరితం చేయాలన్న నిర్ణయానికి వచ్చారు. వారి నిర్ణయం తెలుసుకున్న సహచరులు ఎంతో నిరాశానిస్పృహలకు లోనయ్యారు. మనమిక ఎవరి మార్గదర్శనంలో పని చేయాలి? మనలను నడిపించే నాయకుడేడి? అన్న ప్రశ్నలు వాళ్లను కలచివేశాయి. అంతాకలసి అరవిందుల ముందు తమ సమస్యను, వ్యథను వెళ్లబోసుకున్నారు. అప్పుడు అరవిందులు ఇలా అన్నారు - "నేను మిమ్ములను వదిలి వెళ్తున్నాను, నిజమే, కానీ మీరు చింతించవలసిన పని లేదు. నిరాశ పడవలసిన అవసరం లేదు. ఎందుకంటే ఇప్పుడు మీకు ఒక యోగ్యుడైన, సాహసవంతుడైన దేశభక్తుని మార్గదర్శకత్వం లభించబోతోంది. ఆయనకు స్వామి వివేకానందుని ఆశీస్సులు కూడా లభించి ఉన్నాయి. ఆయనే జ్యోతీంద్రనాథ ముఖర్జీ. ఇకనుండి జతీన్‌ని మీ నేతగా స్వీకరించి స్వాతంత్ర్య పోరాటం కొనసాగించండి." రాజకీయ రంగంనుండి శ్రీఅరవిందుల వారి నిష్క్రమణ ఆయన వ్యక్తిత్వాన్ని ఆరాధించే

**సజ్జనత్వంపై,సామాజిక కట్టుబాట్ల అమలుపై వ్యక్తి ఔన్నత్యం ఆధారపడి ఉంటుంది.**

జతీన్‌కు తీరని వ్యథ కలిగించిందన్న మాట నిజమే. అయినప్పటికీ మహాభారతంలోని అర్జునుని వలె స్వాతంత్ర్య సమరంలో పోరాడవలసినదని గురువుగారు నిర్ధారించడం వలన ఆ ఆదేశాన్ని తలదాల్చాడు. విప్లవకారులకు నాయకత్వ బాధ్యత వహించాడు.

ఆంగ్లేయుల అత్యాచారాలకు ప్రతిక్రియలు, ప్రతీకారజ్వాలలు లోపల్లోపలే రగులుకొనసాగాయి. బెంగాలు విభజన యోజనను ప్రతిఘటించే సమయంలో ఆ మంటలు భగ్గు మన్నాయి. సామ్రాజ్య వాదులను ఎదుర్కొనడానికి ప్రతియువకుడూ సిద్ధమయ్యాడు. భారతమాత దాస్య శృంఖలాలను ఛేదించే ప్రయత్నం చేస్తున్న విప్లవకారులకు ప్రేరణా కేంద్రమయ్యాడు జతీన్. ఇప్పటి వరకూ చాటుగా సాగుతున్న కార్యకలాపాలను ఈ సంఘటన తర్వాత బహిరంగంగానే చేయసాగారు జతీన్, అతడి అనుచరులు. వారి చర్యలు మరింత ఉధృతం అయ్యాయి. విప్లవకారుల వెనుక వేటకుక్కల్లా పడ్డారు పోలీసులు. శ్రీఅరవిందులవారి బాంబుల కార్ఖానాతోపాటు జతీన్ సహచరులు అనేకమంది పట్టుబడ్డారు.

ఆయనకు పదిహేను నెలల కఠినకారాగార శిక్ష విధించబడింది. జైల్లో ఆయనను రకరకాల హింసలకు గురిచేశారు. కానీ జతీన్ నోరు తెరిచి ఒక్కసారి కూడా అబ్బా అని ఎరుగడు. విప్లవకారుల గురించి గాని, వాళ్ల చర్యల గురించి గాని రవంతయినా ఆచూకీ చెప్పలేదు. శిక్షలు అమలు చేసే అధికారులే విసిగిపోయి మరొక మార్గం చేపట్టారు. భయాన లొంగనివాడిని నయానా, ప్రలోభాన లొంగదియ్యాలని చూశారు. సహచరులకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పినట్లయితే అతడిని విడుదల చేస్తామని, ప్రభుత్వం పతకం కూడా ఇస్తుందనీ ఆశపెట్టారు. జతీన్ లాంటి దేశభక్తుడిని దేశద్రోహిగా మార్చడం ఎవరి తరమౌతుంది! అక్కడా పోలీసు అధికారులే ఓడిపోయారు. ఎటువంటి ప్రలోభాలకూ లొంగక పోవడంతో, ఎన్ని చిత్రహింసలు పెట్టినా నోరు విప్పక పోవడంతో జతీన్ మీద పోలీసులు ఎటువంటి అభియోగమూ నిరూపించలేకపోయారు. దానితో వారికి అతడిని విడుదల చేయక తప్పలేదు.

1911 ఫిబ్రవరి 21న విడుదలైన జతీన్ నిలకడగా ఒక చోట ఉండి తన కార్యకలాపాలను నడిపించసాగాడు. ఒక వ్యాపారాన్ని చేపట్టి పోలీసుల దృష్టిలో సంసారిగా మారాడు. అధికారులు తేలిగ్గా ఊపిరి పీల్చుకోగలిగారు. వాళ్ల దృష్టిలోనుండి తప్పించుకోగలిగినందున జతీన్ ఇప్పుడు ఉద్యమ కార్యకలాపాలను మరింత తీవ్రతరం చేయగలిగాడు. స్వాతంత్ర్య సమర యోధులు జతీన్ నాయకత్వంలో ఇనుమడించిన ఉత్సాహంతో ముందుకు ఉరికారు.

చివరకు 1915 డిశంబరు 8న ఒరిస్సా తీరంలో ఆయన పోలీసులతో తలపడక తప్పలేదు. ఆ ముఖాముఖీ పోరాటంలో జతీన్ స్వాతంత్ర్య యజ్ఞాగ్నికి సమిధ అయినాడు. అక్కడి నించి తప్పించుకొని పారిపొమ్మని సహచరులంతా చెప్పినా ఆయన వినలేదు. "తోటివారిని రణరంగంలో వదిలి పెట్టి పారిపోవడం ఘోరపాపమని నమ్మే వీరవంశపు అనుయాయిని నేను. విజయమో వీరస్వర్గమో మీతో కలిసే పంచుకుంటాను" - అన్నాడు నిర్భయంగా.

దేశమాత తన దాస్య విముక్తి కోసం ఎటువంటి వీరపుత్రులకోసం ఎదురు చూచిందో అటువంటి వీరుడు జ్యోతీంద్రనాథ ముఖర్జీ. సరైన తరుణంలో అవతరించి దేశం కోసం ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన త్యాగధనుడు. మాతృదేశాన్ని ఆరాధ్యదేవతగా భావించి తరించిన దేశభక్తుడు. అటువంటి త్యాగమూర్తిని చరిత్ర ఎప్పటికీ మర్చిపోదు.

అనువాదం : విజయకుమారి.

## అన్నిటినీ మించింది పరాక్రమం

ఒకే గురువుకు శిష్యులైన ఇద్దరు రాజుల మధ్య యుద్ధం నిర్ధారించబడింది. ఇద్దరూ ఒకే దేవతను పూజించేవారు కూడా. వారు విజయలక్ష్మి తమనే వరించేలా ఆశీర్వదించమని కోరుతూ ఒకరి వెనుక ఒకరు బయలుదేరారు. ఒక రాజుకి విజయం లభిస్తుందని గురువు, మరొక రాజుకు ఓటమి తప్పదని మందిరంలోని పూజారి ఆశీర్వాదాలు అందజేశారు.

విజయం లభిస్తుందని ఆశీర్వాదం పొందిన రాజు నిశ్చింతగా తిని తిరగసాగేడు. ఓటమి తప్పదని తెలిసిన రాజు - ప్రజలు ఇంతటి పరాక్రమవంతుడు వేరెవ్వరూ ఉండరని కొనియాడేటట్లు పరాక్రమంతో పోరాడి మరణించాలని నిశ్చయించుకొన్నాడు.

యుద్ధం ప్రారంభమైంది. కానీ జరగవలసిన దానికి పూర్తిగా విరుద్ధంగా జరిగింది. గెలుస్తాడన్న రాజు ఓడటం, ఓడిపోతాడన్న రాజు గెలవడంతో ఇద్దరూ మరల గురువువద్దకు వెళ్లారు. ఇద్దరి మాటలు విన్న గురువు, గంభీర స్వరంతో దేవతలు, గురువులు, ఆశీర్వాదాలు- వీటన్నిటినీ మించిన శక్తి ఒకటి ఉన్నది. అదే పరాక్రమం. అంతరంగంలోని ఆ సామర్థ్యమే ఇపుడు గెలిచింది. దాన్నిఓడించగల సామర్థ్యం, దాన్ని అశీర్వదించగల స్తోమత గురువుకు దైవానికి కూడా లేవు. పురుషార్థ పరాయణులైన వ్యక్తులలోని ఈ పరాక్రమం సర్వదా వారికి తోడుగా ఉండి గెలిపిస్తూ ఉత్కృష్టుల్ని చేస్తూ ఉంటుంది." అని తెలియజేశాడు.

- ప్రజ్ఞాపురాణం నుండి

**ఆత్మను నిర్మలం చేసి,ఇంద్రియాలను నిగ్రహించి వాటిని పరమాత్మలో కలిపే ప్రక్రియ యోగం.**

# కృష్ణావతారం-13

# అక్రూరుని దౌత్యం

ఒకనాడు శ్రీకృష్ణుడు తన అన్నయగు బలరామునితో గూడ అక్రూరుని ఇంటికి వెళ్ళెను. అక్రూరుడు వారిని ఉత్తమాసనమున కూర్చుండబెట్టి యథావిధిగ సత్కరించి ఇట్లు పలికెను. ప్రభూ! కంసుడు తన అనుచరులతో గూడ చచ్చుట చాల అదృష్టము. వానిని చంపి నీవు యదువంశమును కష్టములనుండి గట్టెక్కించితివి. ఆవంశమును ఉన్నతము సమృద్ధము చేసితివి.

**త్వయోదితో ఽ యం జగతో హితాయ**
**యదా యదా వేదపథః పురాణః ।**
**బాధ్యేత పాషణ్డపథైరసద్భి -**
**స్తదా భవాన్ సత్త్వగుణం బిభర్తి ॥**

నీవు జగత్కల్యాణమునకై ఈ సనాతన వేదమార్గమును ప్రవర్తిల్ల జేసితివి. పాషండమార్గానుయాయులగు దుష్టులవలన దానికి దెబ్బతగులు నపుడు నీవు సత్త్వమయమగు శరీరమును ధరించి ఆ దుష్టులను సంహరించు చుందువు.

1. వేదజ్ఞానము, ధర్మమర్యాదలు లోకకల్యాణమునకై ప్రకటింపబడెను.
2. జనులకు అశుభము కలుగుటను భగవానుడు సహింపడు. ఏ శరీరమున తమోగుణ ప్రభావముండునో అది అన్యాయమును అనాచారమును చేయును. శుద్ధసత్త్వగుణ ప్రభావముగల శరీరము అనగా ఎల్లప్పుడు సత్కర్మపరాయణమై యుండు శరీరము అని అర్థము.

ఇట్లు ప్రేమపూర్ణమగు వాక్కుద్వారా అక్రూరుడు శ్రీకృష్ణ భగవానుని స్తుతించెను. కృష్ణుడు పలికెను - అక్రూరా ! నీవు నాకు పినతండ్రివి, నామేలు కోరువాడవు. అందువలన నీవు పాండవులకు మేలు కలిగించుటకు, వారి క్షేమసమాచారమును తెలిసికొనుటకు హస్తినాపురమునకు పొమ్ము. పాండురాజు మరణించిన తరువాత పాండవులు తమ తల్లి కుంతీదేవితోపాటు కష్టముల పాలయిరని నేను వింటిని. ధృతరాష్ట్రుడు తన దుష్టపుత్రుడైన దుర్యోధనుని ఆధీనములో ఉండెను. అందువలన అతడు పాండవులకు న్యాయము చేయడు. నీవు అక్కడకు వెళ్ళి వారి స్థితిని గూర్చి సరిగ తెలిసికొనుము. నీవలన అసలు విషయము తెలిసికొనిన మీదట వారు సుఖపడునట్లు ప్రయత్నింతును." అక్రూరునకు ఇట్లు చెప్పి కృష్ణుడు బలరామునితో గూడ తిరిగి వెళ్ళిపోయెను.

భగవదాజ్ఞను పొంది అక్రూరుడు హస్తినాపురమునకు వెళ్ళెను. అక్కడ ఆయన అందరిని కలసికొని తమ క్షేమమును తెలిపి వారి క్షేమమును తెలిసికొనెను. పాండవుల ప్రభావమును చూచి దుర్యోధనాదులు అసూయ చెందుచున్నారనియు. పాండవులను అనేక విధములగు అత్యాచారములకు గురిచేయుచున్నారనియు ధృతరాష్ట్రుడు గూడ తన పుత్రులనే సమర్థించుచున్నాడనియు కుంతీ విదురులు చెప్పిరి. కుంతి పలికెను - సోదరా ! నా మేనల్లుడు చాల సమర్థుడని నేను వింటిని. అతడు మమ్ము రక్షించునా? అక్రూరుడు కుంతికి ధైర్యము కలిగించి పిమ్మట ధృతరాష్ట్రుని దగ్గరకు వెళ్ళి "మీరు పాండవులను బాధించవద్దు. మానవుడు కర్మ బంధనములలో చిక్కు కొనియున్నాడు. తన కర్మఫలములను తానే అనుభవించును" అని చెప్పెను.

**ఏకః ప్రసూయతే జన్తురేక ఏవ ప్రలీయతే ।**
**ఏకో ఽ ను భుంక్తే సుకృత మేక ఏవ చ దుష్కృతమ్ ॥**

అక్రూరుడు పలికెను - ధృతరాష్ట్రా ! జీవుడు ఒంటరిగనే పుట్టును. ఒంటరిగనే మరణించును. తాను చేసిన కర్మల పాపపుణ్య ఫలములను ఒంటరిగనే అనుభవించును.

1. మనము ఇతరుల కారణమున పాపముచేసినచో వారికి సుఖము కలుగును. కాని పాపమును మనము ఒంటరిగనే అనుభవింపవలెను.
2. కర్మఫల సిద్ధాంతము స్థిరమైనది.

**స్వయం కిల్బిషమాదాయ త్రైస్త్యక్తో నార్థకోవిదః ।**
**అసిద్ధార్థో విశత్యద్ధం స్వధర్మ విముఖస్తమః ॥**

తన ధర్మము నుండి విముఖుడైనవాడు లౌకిక స్వార్థమును గూడా ఎరుగడు. వేనివలన అతడు అధర్మమును ఆచరించునో అవి వానిని విడిచిపెట్టును. వాని కెప్పుడును సంతోషము కలుగదు. వాడు తన పాపపు మూటను తలపై పెట్టుకొని ఘోరమగు అంధకారమనెడు నరకమున పడిపోవును.

1. పరమార్థమునందే నిజమగు స్వార్థమున్నది.
2. అధర్మము నాచరించు వాడు బయట సహాయ నిరాకరణము, లోపల అసంతోషము అను దెబ్బలను రెట్టింపుగ తినును.

అక్రూరుడు ధృతరాష్ట్రునకు తెలియజెప్పుటకు ఎన్నియో విధముల ప్రయత్నించెను. కాని ఆయన అంగీకరింపలేదు. అక్రూరుడు తిరిగివెళ్ళి కృష్ణునకు హస్తినాపుర వృత్తాంతమునంతటిని చెప్పెను.

★ ★ ★

**బాధలను,వైఫల్యాలను అధిగమిస్తూ లక్ష్యం వైపు సాహసంగా పురోగమించడంలోనే మనిషి గొప్పతనం ఉంది.**

## గురుదేవుల అమృతవాణి

# మంచిని, మానవత్వాన్ని పెంచుదాం

మిత్రులారా! వికాస క్రమంలో నేడు మనం ఏ స్థాయికి చేరుకున్నామో ఆలోచిద్దాం రండి. నేటికి 500 సంవత్సరాల క్రితం మనం ఈ రోజు సాధించిన విజ్ఞానం గురించి చెపితే ఆశ్చర్యపోయేవారు. రోడ్లపై, రైలు పట్టాలపై నడిచే రైళ్ళు, ఆకాశంలో ఎగిరే విమానాలు పూర్వీకులకు ఎంతో ఆశ్చర్యం కలిగించే విషయాలు. ఢిల్లీ నుండి కర్నూల్‌లో ఉండే వ్యక్తితో మాట్లాడాలి అంటే వారిద్దరు ఎదురుబదురుగా ఉంటేనే గతంలో సాధ్యపడేది. నేడు సాధించిన ఈ విజ్ఞాన ప్రగతిని ఏమంటారు? కంప్యూటర్‌తో సహా ఇంకా ఏమేమి కనిపెడతారో తెలియదు. పూర్వం బాణాలతో యుద్ధం చేసుకునేవారు. ఆ సమయంలో వ్యక్తి శరీరంలోనికి బాణం దూసుకునిపోతే దానిని బయటకు తీయటం కోసం గుర్రం తోకకు తాడు కట్టి గుర్రమును పరుగెత్తిస్తేనే బాణం శరీరం నుండి బయటకు వచ్చేది. ఆ వ్యక్తి బ్రతికితే బ్రతికేవాడు, మరణిస్తే మరణించేవాడు. పూర్వకాలం అలా ఉండేది. నేడు మెడికల్ సైన్స్, సర్జరీ సైన్స్ ఎంత చమత్కారం చేస్తుందో చూడండి. శరీరం లోపలి భాగాలను చూడటం దగ్గర్నుండి ఎన్నో చమత్కారాలను చేస్తోంది. ఇది మనిషి బుద్ధి చమత్కారం, విజ్ఞాన చమత్కారం. మనది వైజ్ఞానిక యుగం.

వెనుకటి శతాబ్దాలలో మనుషుల ప్రగతికి, నేటి మన ప్రగతికి ఎంతో అంతరం ఉన్నది. ఈ ప్రపంచం ఏర్పడి 10,00,000 సంవత్సరములు గడచినవి. పూర్వకాలం కంటే నేడు మన ఎదుట ఎన్నో సుఖాలు ఉన్నవి. టెక్నాలజీ నేడు ఎంతో అభివృద్ధి చెందింది. వెనుకటి రోజులు కావు. అవి ఇంతగా పతనం చెందిన రోజులు కూడా కావు. నేడు పతనం చెందినంతగా పూర్వం మనుషులు పతనం చెందలేదు. శారీరక దృష్టితో చూసినా అంతే. ఈ శరీరం ఎంతో దుర్బలం. మనకు ఈ రోజు ఒక మైలు దూరం నడవటం కూడా కష్టమే. వాహనం మనదగ్గర లేకుంటే మనం ఎలా వెళ్ళగలం? మన పూర్వీకులు ఎలా ఉండేవారు? మా తాతగారు పౌర్ణమి రోజున గంగా నదిలో స్నానం చేయటానికి 40 మైళ్లు నడిచేవారు. యువకునిగా ఉన్నప్పుడే పౌర్ణమి రోజున గంగా స్నానం చేస్తాను అని ఆయన ప్రతిజ్ఞ చేశారట. మా తాతగారు ప్రొద్దున్నే బయలుదేరి రాత్రి అయ్యేసరికి గంగానదికి చేరుకునేవారు. మరునాడు ప్రొద్దున్నే స్నానం చేసి సాయంత్రం అయ్యేసరికి ఇంటికి వచ్చేవారు. 80 మైళ్ళు రెండు రోజులలో ప్రయాణించటం మనకు చాలా కష్టం. శారీరక దృష్టికోణం నుండి చూస్తే మనం ఇప్పుడు దుర్బలం అవుతూ ఉన్నాం.

దాంపత్య జీవితం సుఖ సంతోషాలకు కేంద్రస్థానం. ఒకరిపట్ల ఒకరు శ్రద్ధను, విశ్వాసాన్ని కలిగి ఉండటాన్ని ఏమంటారు? రామాయణంలో ఒక సందర్భం ఉన్నది. హనుమంతుడు, లక్ష్మణుడు అశ్వమేధ యాగ అశ్వంకోసం వెదుకుతూ వచ్చినప్పుడు లవకుశులు వారిరువురినీ మీరెవరు? అని అడుగుతారు. నేను లక్ష్మణుడను నేను హనుమంతుడను అని వారు సమాధానం ఇస్తారు. అప్పుడు లవకుశులు మీరు మా అమ్మను ఒంటరిగా, అసహాయంగా అడవిలో వదలి వెళ్ళినవారా? అని అంటారు. లక్ష్మణుడు తల వంచుకుంటాడు. అప్పుడు ఆ పిల్లలు మేము మీకు తగిన శాస్తి చేస్తాం అంటారు. లవకుశులు హనుమంతుని పట్టుకుని అతని తోకను చెట్టుకు కట్టేస్తారు. ఇద్దరినీ కట్టేసి వారి తల్లి వద్దకు తీసుకుని వెళతారు. వారు తల్లితో చెబుతారు. వీరు నిన్ను ఒంటరిగా వదిలి వెళ్ళినవారు. ఇప్పుడే మేము వీరిని కట్టివేశాం అని. అప్పుడు వారి తల్లి "లేదు నాయనా! ఇతడు మీ తండ్రిగారి సోదరుడు. మీ తండ్రిగారికి నాపట్ల ఎంతో ప్రేమ ఉన్నది. ఆయన నన్ను వనవాసంలో ఎందుకు విడిచిపెట్టేశారు? ప్రపంచ చరిత్రలో దాంపత్య జీవనం పట్ల నమ్మకం ఏర్పరచటానికి. మీ కంటే పెద్దవారిని అవమానించటం తప్పు అన్నది. పూర్వం భార్యభర్తలు ఎంత కష్టపడినప్పటికి పూర్వకాలపు దాంపత్యంతో నేటి కాలపు దాంపత్యం సరితూగలేదు. నేడు మానవులకు అందంపైన వ్యామోహం. సెక్స్ పైన వ్యామోహం. దాంపత్య జీవిత ఆదర్శాలను అందరూ మరచిపోతూ ఉన్నారు. ప్రతి వ్యక్తి పెద్ద పెద్ద ప్రేమలేఖలు వ్రాస్తూ ఉన్నాడు. కానీ ఆరునెలల తరువాత తన దాంపత్య జీవితం బావుంటుంది అన్న నమ్మకం ఏ స్త్రీకీ లేదు. పెద్ద పెద్ద ప్రేమలేఖలు వ్రాస్తున్నప్పటికి ప్రతివ్యక్తి అశాంతిగానే ఉన్నాడు.

అమెరికా వంటి ధనిక దేశాలకు మన పిల్లలను పంపిస్తున్నాం. కానీ అక్కడ వాళ్ళేం నేర్చుకుంటారో మనకు తెలియదు. వాటిని అంతగా ప్రశంసించటం అనవసరం. అక్కడ దాంపత్య జీవితం చాలా జటిలంగా, క్లిష్టంగా ఉన్నది. వ్యక్తి మెదడంతా టెన్షన్‌తో నిండి ఉన్నది. రాత్రి అంతా వారు శాంతి లేకుండానే గడుపుతారు. నిద్రమాత్రతోనే రాత్రులు గడుపుతారు.

**ఆశావాది ప్రతి కష్టంలో అవకాశాన్ని చూస్తాడు. నిరాశావాది ప్రతి అవకాశంలో కష్టాన్ని చూస్తాడు.**

రక్తపోటు, గుండెవ్యాధులు, ఇంకా మనకు తెలియని ఎన్నో వ్యాధులు వస్తున్నాయి. ఏం తింటున్నారో తెలియటం లేదు. ఇంజనీరింగ్ కాలేజీలో ఉపాధ్యాయుడైన ఒక స్నేహితుడు ఉన్నాడు. అతడు మేము నీరు త్రాగం పళ్ళరసాలే తీసుకుంటూ ఉంటాం. నీరు త్రాగవలసి వచ్చినపుడు పళ్ళరసాలు త్రాగుతూ ఉంటాం అని చెప్పాడు. మొదట్లో మానవులు ఎండు రొట్టెలు తింటూ సుఖంగా, తీరికగా కాలం గడిపేవారు. కాని ఇప్పుడు మన దాంపత్య జీవితం ఎలా ఉంటుందో తెలియదు. మీగృహస్థ జీవితంలో ఎటువంటి జ్వాలలు రేగుతాయో తెలియదు. ఇప్పుడు శ్రావణ కుమారుడు కేవలం కథలలో మాత్రమే ఉన్నాడు. కావాలి అనుకుంటే మీరు చదవగలరు. మీరు రామాయణాన్ని పుస్తకాలలో మాత్రమే చూడాలి. ఒక తండ్రికి ఐదుగురు పిల్లలు ఉంటే వాళ్ళు పెద్ద అయిన తరువాత ఏమౌతారో తెలియదు. మన సామాజిక జీవనం, దేశ జీవనం, ఆర్థిక జీవనం ఎంతో క్లిష్టంగా ఉన్నాయి. శాస్త్రీయంగా ఎంత ప్రగతిని సాధించినప్పటికీ, ఆర్థికంగా ఎంత అభివృద్ధిని పొందినప్పటికీ మానవత్వం మాత్రం ఒక గొప్ప సమస్యగా పరిణమించింది. దీనికి పరిష్కారం ఏమిటి అని మీరు ఆలోచించాలి.

మిత్రులారా ! మీరు పీడితులకు బాధ్యత వహించటానికి ఇక్కడికి రావాలి. మీరు ప్రజల వ్యక్తిగత జీవితం. జాతీయ జీవితం, సామాజిక జీవితం, ఆర్థిక జీవితాలలో ఉన్న క్లిష్టతను తొలగించాలి. వ్యక్తిగత జీవితాన్ని, సామాజిక జీవితాన్ని వికసింపచేయటంలో మీరు ప్రముఖ పాత్ర నిర్వహించాలి. ఈ బాధ్యతలను నిర్వర్తించటానికి ఎంతో కష్టపడాలి. నేడు దేశం ఎదుట, వ్యక్తి ఎదుట అనేక సమస్యలున్నాయి. వాటిని పరిష్కరించటానికి నేను మీకు ఒక చిన్న సూత్రం చెప్పదలచుకున్నాను. వ్యక్తి నిర్మాణం కొరకు, సమాజ నిర్మాణం కొరకు, దేశ నిర్మాణం కొరకు, చిక్కు సమస్యలను పరిష్కరించటం కొరకు ఒక సూత్రం ఉంది. వ్యక్తి తనలోనికి తాను తొంగిచూడాలి. సమస్యకు పరిష్కారం బయట కాదు. నాలో ఆత్మ ఉన్నది. అదే ఉపన్యసిస్తూ ఉన్నది. అదే పుస్తకాలను వ్రాస్తూ ఉన్నది. సమాజ నవ నిర్మాణం అదే కావిస్తూ ఉన్నది. మీరు చూస్తున్న, మీకు బయటకు కనిపిస్తూ ఉన్న క్రియాకలాపాలన్నీ నా అంతరంగ చేతనలే. అనారోగ్యం అయినా, జ్వరం అయినా, దగ్గు అయినా బయట ఉన్నట్లు అనిపిస్తుంది. కాని అవి వస్తుతః అంతరంగంలోనే ఉద్భవిస్తాయి.

నేను మిమ్ము ప్రార్థించేది ఒకటే. మీరు మీ సమస్యలకు పరిష్కారాన్ని లోపల అన్వేషించండి. సమాజానికి చెందిన లేక వ్యక్తికి చెందిన సమస్యలకు చికిత్స బయట మాత్రమే చేస్తే సరిపోదు. కేవలం మందుల ద్వారా మాత్రమే అనారోగ్యం అంతరించదు. వ్యక్తి ఆరోగ్యం ఎలా బాగవుతుంది? అంతరంగ జీవనం బాగుండక పోయినట్లయితే వ్యక్తి ఆరోగ్యం బాగుపడదు.

శాండో పేరు విన్నారా మీరు? శాండోనెట్ బనియన్లు తరచూ ధరింపబడుతూ ఉంటాయి. అతడు ఆ కాలంలో యూరప్‌లో ప్రసిద్ధి చెందిన వస్తాదు. బాల్యంలో అతను తలనొప్పి, జలుబు మొదలగు వానితో బాధపడుతూ ఉండేవాడు. తన తండ్రితో కలసి ఒకసారి మ్యూజియం చూడటానికి వెళ్ళాడు. అక్కడ వస్తాదు చిత్రపటం చూసి తన తండ్రిని అడిగాడు. "నాన్నగారు! నేను కూడా వస్తాదును కావాలి అంటే ఏం చేయాలి?'' అని అడిగాడు. అప్పుడు తండ్రి "నాయనా! శరీరం దృఢంగా ఉండటానికి, ఎక్కువ కాలం జీవించటానికి మూలం మనిషి తనకు తాను సన్నిహితంగా ఉండటం. కాని ఈ విషయాన్ని మనిషి మరచిపోతున్నాడు. ఒక వేళ మానవుడు ఈ విషయాన్ని గుర్తించినట్లయితే ఎంతో మేలైన ఆరోగ్యాన్ని పొందుతాడు. కాని మనం పశువు కంటే ఎక్కువ తింటూ ఉన్నాం. ఇంద్రియాలు మన కోసం పని చేస్తూ ఉన్నాయి. మనం మన ఇంద్రియాలను ఎక్కువ కష్టపెడుతూ ఉంటాం. మెదడును అనేక ఆలోచనలతో, ఇతర ఇంద్రియాలను అనేక పనులతోను, మన ఆరోగ్యమును నియంత్రించే నాడీ మండలాన్ని అస్తవ్యస్తం చేస్తూ ఉన్నాం. మనం ఈ మూడింటినీ మానివేస్తే ఎక్కువ కాలం జీవించగలం. ఎవరైనా వస్తాదులు కాగలరు'' అన్నాడు. "అయితే నాన్నగారు! మనం మందులు వాడే అవసరం ఉండదా?'' "లేదు నాయనా! మందులు కేవలం ఆరోగ్యము సరిచేయటానికి మాత్రమే ఇస్తారు. ఏ వ్యక్తికి అయినా దీర్ఘకాలిక జీవితాన్ని, ధృఢత్వాన్ని మందులు ఇవ్వలేవు.'' శాండో వీటిని అనుసరించాడు. దీనినే నేను "ఆధ్యాత్మికత'' అంటాను. వీటిని అనుసరించి అతను వస్తాదు అయ్యాడు.

మీరు దీనిని ఇంద్రియ నిగ్రహం అనండి. నన్ను "ఆధ్యాత్మికం'' అననివ్వండి. ఇంద్రియ నిగ్రహం, మెదడు చేసే ఆలోచనల పట్ల నిగ్రహం, ఆహారం మొదలైన వాటిపట్ల నిగ్రహం సరిగ్గా పాటిస్తే వ్యక్తి ఆరోగ్యం బాగుంటుంది. పూర్వకాలంలో డాక్టర్లు ఉండేవారు కాదు. కొంతమంది మూలికలు, నిమ్మరసం, ఎండుమిరప కాయలు మొదలైన వానితో అనారోగ్యమును నయం చేసేవారు. ఇప్పుడు దేశానికి ఒక ఆరోగ్యమంత్రి కావాలి. నేను మిమ్ము ప్రార్థించేది ఒక్కటే - హాస్పిటళ్ళు కట్టించండి. వైద్య శాస్త్రంలో పరిశోధన చేయించండి. కాని వ్యక్తి ఆరోగ్యానికి మూలాధారం - ఇంద్రియ నిగ్రహం. దీనినే నేను ఆధ్యాత్మికత అంటాను. పూర్వీకులు ఇంద్రియ నిగ్రహం అంటారు. ఇంద్రియ నిగ్రహంను ప్రజలకు నేర్పించవలసి ఉన్నది. మంచి ఆరోగ్యం

**సానుభూతి మనిషి హృదయంలోని కోమలత్వం. అది సంవేదన,దయ,ప్రేమ,కరుణల కలగలుపు.**

పొందాలి అంటే ఆహారవిహారాల పట్ల పరిమితి పాటించాలి. ఇంద్రియాలు, మెదడు మొదలగు వానితో సరి అయిన పద్ధతిలో పని చేయించాలి.

మీకు నేను మరొక విషయం కూడా చెప్పాలి. ప్రతి వ్యక్తి వివాహం చేసుకునే ముందు తాను తన పిల్లల బాధ్యతను సక్రమంగా నిర్వర్తించగలనా అని వందసార్లు ఆలోచించుకోవాలి. మీ భార్యకు ప్రేమను, స్నేహాన్ని అందించగలరా? మీలో ఆ యోగ్యత ఉన్నదా? వ్యక్తి అంటే కేవలం శరీరం కాకుండా వేరొకటి ఉన్నది. దానినే జీవాత్మ అంటారు. అది ప్రేమకు దాసోహం అవుతుంది. ఒకటి, ఒకటి కలిస్తే పదకొండు అవుతుంది. రాముడు, లక్ష్మణుడు కలిసి ఇద్దరు కాదు, పదకొండు. అయితే ఒకరికి మరొకరిపట్ల నమ్మకం, శ్రద్ధ ఉండాలి. ఎంత పేదవారైనా దంపతులలో సుఖ సంతోషాలకు మూల కారణం ప్రేమ, నమ్మకం.

యూరప్‌లో ఒక పేద దంపతులు ఉండేవారు. వారి వివాహ దినం దగ్గర పడుతూ ఉంది. ఇద్దరూ ఒకరికి ఒకరు ఏదైనా ఇవ్వాలి అనుకున్నారు. కానీ ఎలా? భర్తకు ఎప్పటినుండో ఒక ఆలోచన ఉన్నది. తన భార్యకు చాలా ఎక్కువ అందమైన జుత్తు ఉన్నది, దానికి బంగారు క్లిప్పు కొనాలి అని. భర్తకు ఒక గడియారం ఉన్నది, దానికి చైను కొనాలని భార్య అనుకున్నది. కానీ వారిద్దరి దగ్గరా డబ్బు లేదు. భార్య ఒక వ్యాపారి దగ్గరకు వెళ్లి తన జుట్టును అమ్మివేసి గడియారానికి చైను కొన్నది. భర్త గడియారం అమ్మివేసి క్లిప్పు కొనెను. వివాహ దినం వచ్చింది. భర్త భార్యతో నేను నీ కోసం బంగారం క్లిప్పు తీసుకొని వచ్చాను. నీతలకు రుమాలు ఎందుకు కట్టుకున్నావు? అని అడిగెను. అప్పుడు భార్య నేను మీ కోసం గడియారం చైను కొన్నాను. కానీ మీరు ఈ రోజు చేతికి రుమాలు కట్టుకున్నారు. ఎందుకు?'' అని అడిగింది. ఇద్దరూ రుమాళ్ళు తొలగించుకొని చూసుకున్నారు. జుత్తు కత్తిరించబడి, ఖాళీ చేతితో ఉన్నారు. ఒకరి చేతిలో క్లిప్పు, ఒకరి చేతిలో చైను. ఇద్దరి కళ్ళలో ప్రేమ. ఒకరిపట్ల ఒకరికి విశ్వాసంతో కళ్ళు వర్షిస్తూ ఉన్నాయి. సోదరులారా! ఇటువంటి భావాలు ఉంటే దాంపత్య జీవితం స్వర్గం వలె ఉంటుంది.

కొంత కాలం క్రితం ఝాన్సీలో జరిగిన ఒక సంఘటన. ఒక వ్యక్తికి వివాహం జరిగింది. భార్య ఇంటికి వచ్చింది. మూడు నెలలు ఆమె ఆరోగ్యంగానే ఉంది. విధివశాత్తు తరువాత టి.బి. వచ్చింది. 22 సంవత్సరాలు ఆమె జీవించింది. ఒత్తిగిలి నిద్రపోవడం కూడా ఆమెకు కష్టంగానే ఉండేది. ఆమె భర్త ఆఫీసుకు వెళ్ళే ముందు తన భార్యకు స్నానం చేయించటం, దుస్తులు శుభ్రపరచటం, తల దువ్వటం, టీ త్రాగించటం, వంటచేయటం, సాయంత్రం అయిన తరువాత మరల ఇంటి పని అంతా చేయటం - ఇలా తన సమయం అంతా ఆమెతోనే గడిపేవారు. స్నేహితులు నువ్వు సినిమాకు వెళ్ళవా? అని అడిగేవారు. అతడు, "నా భార్యకు అనారోగ్యంగా ఉంది. ఆమెకు నేను సేవ చేయాలి. ఇంత కంటే సంతోషం నాకు ఇంకెక్కడ లభిస్తుంది? సినిమాలో ఏం ఉంది? సినిమా చూస్తే సంతోషం కలుగుతుంది? కానీ నేను సినిమాలు చూస్తూ ఉంటే మా దాంపత్య జీవితం ఎలా బాగుంటుంది? నా కర్తవ్య పరాయణత చూసిన ఆమె కళ్ళ నుండి కారే నీటి బిందువులు నాకు ముత్యాల కంటే అధికం అనిపిస్తాయి. అవి చూసి నా కళ్ళు కూడ ప్రేమతో వర్షిస్తాయి. స్వర్గం ఇక్కడ కాక మరెక్కడ ఉంటుంది?'' - అనేవాడు.

స్నేహితులారా! కుటుంబ జీవితం సుఖప్రదంగా సాగాలి అంటే వివాహం చేసుకునేటప్పుడు భాగస్వామి గుణాలను చూడాలి. భాగస్వామి రూపం చూడకూడదు. గుణాన్ని, పనులను, స్వభావాన్ని చూడాలి. పిల్లలు బాగా పెరగటానికి బోర్నవిటా చాలదు. మంచి బట్టలు చాలవు. స్కూళ్ళలో బందీలుగా చేస్తే చాలదు. అందులో వారు సభ్యతను, శిష్టాచారమును నేర్చుకుంటారు. కానీ భావాత్మక వికాసం ఎలా సంభవిస్తుంది?

తల్లిదండ్రులు కుటుంబంపై చూపించే ప్రేమ, ఒకరిపట్ల ఒకరు చూపించే ప్రేమ, వారి ప్రవర్తన పిల్లల్లో భావాత్మక వికాసాన్ని అభివృద్ధి చేస్తాయి. నేడు కుటుంబాలలో ఇది లోపించింది. అమెరికా, ఇంగ్లండ్ మొదలైన దేశాలలో పిల్లలను పెంచే ఓపికలేని తల్లిదండ్రులు చాలా మంది ఉంటారు. వారు తమ పిల్లలను హాస్టళ్లలో పెట్టిస్తారు. ప్రభుత్వం వారికి బాగా చదువు చెప్పిస్తుంది. కానీ వారికి భావనాత్మక వికాసం ఉండదు. అందుకే ప్రభుత్వ హాస్టళ్లలో పెంచబడే పిల్లలు కవులు, రచయితలు కాలేరు. మహాపురుషులు కాలేరు. ఎక్కువమంది సైనికులు అవుతారు. వారు ప్రేమని పొందని వారు. పిల్లలకు ప్రేమను ఇవ్వాలి. బోర్నవిటా కాదు.

ప్రేమను మనం పిల్లలకు ఇస్తే వారు దేశ నిర్మాణానికి ఎంతగా ఉపయోగపడతారో మీకు ఒక ఉదాహరణ చెప్తాను. వినోబా భావే తల్లి తన బిడ్డను, తన ప్రక్కింటివారి బిడ్డను పెంచింది. వినోబా భావే తల్లి ప్రక్కింటివారి బిడ్డకు నెయ్యివేసి, వేడి వేడి రొట్టెలు చేసేది. తన బిడ్డకు సాదా రొట్టె చేసి పెట్టేది. వినోబా ఒక రోజు తన తల్లిని అడిగాడు - "అమ్మా ఇద్దరం ఒకేలాంటి పిల్లలం కదా! మమ్మల్ని నువ్వెందుకు వేరుచేస్తున్నావు? ఒకటి వేడిగా చేస్తావు. ఒకటి చల్లగా చేస్తావు. ఒక దానిలో నెయ్యి వేస్తావు. ఒక దానిలో వెయ్యవు. ఈ తేడాకు కారణం ఏమిటి? మా ఇద్దరికీ

**మంచిదనుకున్నదాన్ని నిర్భయంగా చెయ్యి. చెడ్డదనుకున్నదాని ముందు ఎన్నడూ తల వంచకు.**

ఒకేలాగ ఎందుకు ఇవ్వవు?'' అప్పుడు తల్లి అన్నది - "నాయనా! అతడు మన ప్రక్కింటి వారి అబ్బాయి. అంటే భగవంతుని బిడ్డ అన్నమాట. నువ్వు నా కొడుకువి. నీ పట్ల నాకు ప్రేమ ఉంటుంది. ఆ అబ్బాయి పట్ల భగవంతుని బాధ్యత మిళితం అయి ఉంది. ఎందుకంటే ఆ తల్లి తన కొడుకుని నా ఒడిలో ఉంచినది. భగవంతుని పుత్రుని పట్ల చూపించే బాధ్యత ఆపుత్రుని పట్ల చూపించాలి.'' స్వార్థంతో కాక ప్రేమతో వినోబాను అతని తల్లి పెంచింది. వినోబా భావే తన చిన్నప్పుడు తన తల్లి శనగలు విసురుతూ ఉన్నప్పుడు అక్కడకు వెళ్ళి నాకు ఆకలిగా ఉంది అంటూ శనగలు తినేవాడిని అని తన జీవిత కథలో వ్రాసుకున్నారు. 'ఏ' విటమిన్, 'బి' విటమిన్, 'సి' విటమిన్లు ఆయన తినలేదు. ఆయన ప్రేమను పొందాడు. మీ దగ్గర ఆ ప్రేమ ఉంటేనే పిల్లలను కనండి. పిల్లల గురించి ఆలోచించండి. లేకపోతే వద్దు. ఏసు క్రీస్తుకి ఒక వ్యక్తి "మీరు భగవంతుని చూశారా?'' అని అడిగెను. "చూశాను'' అని ఏసు క్రీస్తు చెప్పారు. "అయితే నాకు చూపించగలరా?'' అని ఆ వ్యక్తి అడిగెను. "తప్పకుండా చూడండి'' అని ఏసు క్రీస్తు ఒక చిన్న పిల్లవానిని తీసుకుని వచ్చి ఇలా చెప్పాడు - "ఇతడే భగవంతుడు. ఇతని మనస్సు నిర్మలం. ఇతని భావాలు నిశ్చలమైనవి. కామ, క్రోధం, మదం, మాత్సర్యం మొదలగు చెడు గుణములు లేనటువంటి వాడు, ఏ సజ్జనుడైతే ఈ చెడ్డ గుణముల నుండి రక్షించబడతాడో అతడు భగవంతుడు అవుతాడు.''

పిల్లలను చూసుకోవటానికి కావలసిన శ్రద్ధ మన దగ్గర లేదు. నాన్నగారు వస్తారు. కోతి, ఎలుగుబంటి, కుందేలు కథలు వినిపిస్తారు. ఒడిలోనికి తీసుకుంటారు. భుజాలపై కూర్చుండ పెట్టుకుంటారు. మమ్మల్ని తిప్పుతారు - అని పిల్లలు ఎదురు చూస్తారు. తండ్రి సైకిలు మీద వస్తాడు. పిల్లలు పరుగెత్తుకుంటూ వెళ్లి నాన్నగారు వచ్చారు అంటూ చొక్కా పట్టుకుని సంతోషంగా వ్రేలాడతారు. అతని బట్టలు మాసిపోతాయి. పిల్లలు భయపడి తల్లి ఒడిలో తలదాచుకుంటారు. తండ్రి అంటాడు - "ఈ దెయ్యాలను కాస్త చూడు, నేను సినిమాకు వెళ్ళాలి. క్లబ్బుకు వెళ్ళాలి'' అని. ఈ పిల్లలు స్నేహాన్ని పొందలేదు. మరి వీరి అభివృద్ధి ఎలా ఉంటుంది? పిల్లలు క్రమశిక్షణలేనివారు. చెప్పింది వినరు. పెద్దలను గౌరవించటం లేదు. ఉపాధ్యాయులను బెదిరిస్తున్నారు. యూనివర్సిటీలలో తలలు పగులగొట్టుకుంటున్నారు. వారు బాల్యం నుండీ ఇవే చూస్తున్నారు. ఇవే నేర్చుకుంటున్నారు. వీటిని నిరోధించే బాధ్యత అధ్యాపకులది, మాస్టర్లది కాదు. రాతి హృదయం ఉన్నవారు, కాముకులు, విలాసవంతులు పిల్లల బాధ్యతను స్వీకరించలేరు. భావి భారతదేశం మహాపురుషులతో అభివృద్ధి చెందాలి అంటే, మన దేశం నాగరికంగా గొప్పది కావాలి అంటే, శక్తి వంతం కావాలి అంటే - ధనం సంపాదించటంతో సరిపోదు. మనుష్యులలో మంచి గుణాలు అభివృద్ధి చెందాలి. మంచి గుణాలు ఉంటే పేదవారు కూడా అమరులౌతారు. చిన్న చిన్న ఇండ్లలో జన్మించిన వారు కూడా రారాజులు కాగలరు. ఉన్నత స్థాయిని పొందగలరు.

రాజస్థాన్‌లో హీరాలాల్ శాస్త్రి అనే 45 రూపాయల వేతనం కల ఒక సంస్కృత అధ్యాపకుడు ఉండెను. 23 సంవత్సరాల వయస్సులో అతని భార్య మరణించెను. అతనిని ఇంకో వివాహం చేసుకోమని అంతా అన్నారు. అప్పుడు - నేను ఇంకా మొదటి భార్యకే సేవ చేయలేదు, మీరు మరియొక వివాహం గురించి చెప్తున్నారు - అని అతను ఉద్యోగం వదిలి, తన భార్య ఊరికి వెళ్ళి, ఆగ్రామానికి సేవ చేస్తాను అంటూ ఒక బాలికల పాఠశాలను ఏర్పరచాలన్న సంకల్పంతో ఒక చెట్టు క్రింద చదువు చెప్పటం ప్రారంభించెను. కొంతమంది అతనిని చూసి నవ్వారు. అయినా అతడు తన దృఢ సంకల్పమును విడనాడలేదు. ఇది చూసి గ్రామవాసులు అంతా ఆశ్చర్యపడి అతడికి ఒక పూరి గుడిసెను ఇచ్చారు. అందులో పిల్లలు చదువుకునేవారు. దేశం కొరకు, గ్రామం కొరకు కష్టపడుతున్న అతడు సజ్జనుడుగా భగవంతునికి పరిచయం కాబడతాడు అని గ్రామస్థులంతా అనుకునేవారు. రూపాయలు, పైసలు, బంగారం, వెండి, సిమెంట్, లోహాలు మొదలగునవి అన్నింటినీ ప్రోగుచేసి ఇప్పుడు ఆ స్థానంలో వనస్థలి అనే విద్యాలయం నిర్మించారు. భారతదేశంలో మొదటి మహిళా విశ్వవిద్యాలయం అదే. ఒడలను నడపించడం దగ్గర్నుండీ, స్కూటరు నడపటం వరకూ అన్నీ ఈ విశ్వవిద్యాలయంలో నేర్పుతారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఏర్పడిన మొదటి ప్రభుత్వానికి హీరాలాల్ ముఖ్యమంత్రి అయ్యెను. ఒక వ్యక్తి వద్ద ఎంత ధనం ఉంది, అతను ఎంత విలాసవంతుడు అన్న విషయాలపై వ్యక్తి ఆధ్యాత్మిక వికాసం ఆధారపడి ఉండదు. ఇవి ప్రగతికి చిహ్నాలు కావు. వ్యక్తి యందలి ధైర్యం అతని ప్రగతికి ప్రతీక.

కొరియాలో యంగ్ అనే రైతు పేరు విన్నారా మీరు. గాంధీజీ చిత్రపటాలు ఎలా మనం గోడకు తగిలించుకుంటామో, అలా దక్షిణ కొరియాలో యంగ్ చిత్రపటాలు కూడా వ్రేలాడదీస్తారు. క్రొత్త పంటకాలానికి ముందు యంగ్‌ను పూజించి ఆ తరువాత ధాన్యమును ఉపయోగిస్తారు. 1721లో కొరియాలో కరవు సంభవించింది. ఆ సమయంలో ఎంతో మంది ప్రజలు ఆకలితో మరణించారు. ఒకరిని ఒకరు చంపుకుని తినేవారు. యంగ్ తన పిల్లలను, భార్యను పిలిచి ఇలా చెప్పెను - "దేశంలో పదిహేను లక్షల మంది ఆకలితో అలమటిస్తున్నారు. మన దగ్గర ధాన్యం

**సోమరితనాన్ని పోషించడం మహాపాపం.**

ఉన్నవి. వీనిని మనం తింటే మనం బ్రతుకుతాం కానీ మళ్ళీ సంవత్సరానికి విత్తనాలు లేకుంటే కొరియాలో మనుష్యులంతా చనిపోతారు. కాబట్టి మనం ధాన్యం తినే బదులు వాటిని విత్తనాలుగా ఉంచుదాం.'' ధాన్యాన్ని సీలు చేసేసి ప్రభుత్వ బ్యాంకుకు అప్పగించారు - వర్షం పడ్డ తరువాత విత్తనాలు అవసరం అయితే వీనిని విప్పండి అని. భార్య, పిల్లలు మొత్తం ఐదుగురూ ఆకలితో మరణించారు. వర్షములు పడిన తరువాత విత్తనాలు నాటారు. యంగ్ అక్కడ దేవుడు అయ్యాడు. ఎందుకంటె అతడు తన స్వార్థాన్ని త్యాగం చేశాడు.

ధనం ఉండటం గొప్పతనం కాదు. నేను ప్రజల మస్తిష్కమును మార్చాలి అనుకుంటున్నాను. దేశం గొప్పది కావాలి అంటే, దేశం సమర్థవంతం అయినది కావాలి అంటే ముందు వ్యక్తి మారాలి. తన కుటుంబాన్ని మార్చాలి. మనల్ని మనం ఎలా రక్షించుకోవాలి? మనలో మనం కోర్కెలను, కాంక్షలను మేలుకొలపకూడదు. గొప్పతనాన్ని పెంపొందించుకోవాలి. నేడు వ్యక్తిలో కోరికలు అధికం అవుతున్నాయి. ప్రతి వ్యక్తి తాను చాలా పెద్దవాడిని కావాలి అని, ధనవంతుడు కావాలి అనీ కోరుకుంటున్నాడు. ప్రతివ్యక్తి ధనధాన్యాలతో తులతూగాలని కోరుకుంటాడు. ధనంతోపాటు వ్యక్తిలో కొన్ని గొప్ప లక్షణాలు కూడా ఉండాలి. ఇంగ్లండుకు చెందిన నెల్సన్ వలె, జపాన్ గాంధీ కాగాబా వలె ఉండాలి.

ఇంగ్లండ్ సైన్యంలో నెల్సన్ ఒక సైనికుడు. కానీ అతడు తన సైన్యం దీన పరిస్థితులలో ఉండటం చూసి తన పై అధికారుల వద్దకు వెళ్ళి ఇలా అన్నాడు - "సిపాయిలకు తుపాకులు చాలవు, సిపాయిలలో ఉత్సాహం, దేశభక్తి, మరణానికి అయినా సిద్ధపడే తత్వం విజయాన్ని ఇస్తాయి. ఆ పని నాకు అప్పగించండి.'' పై అధికారులకు కూడా అది నచ్చింది. నెల్సన్ ఈ శ్రద్ధ, దేశభక్తి, ఆవేశాలతో యుద్ధం చేసెను. ఈ ఆవేశాన్ని నేను పాకిస్తాన్‌తో యుద్ధం చేసే భారతీయ సైనికులలో చూశాను. వారు ప్రాణాలు పోయేవరకూ ఎన్ని యుద్ధ ట్యాంకులు వస్తూ ఉన్నా వెనుకకు మరలకుండా యుద్ధం చేస్తూనే ఉన్నారు. నెల్సన్ కూడా అలాగే చేశాడు. అతడు తన ఛాతీకి బాంబులు కట్టుకుని శత్రువుల టాంకుల వద్దకు వెళ్ళాడు. ట్యాంకుల వద్ద వానిని ధ్వంసంచేశాడు. కానీ టాంకులుకూడా బాంబుల శబ్దానికి ధ్వంసమయ్యాయి. గాయాల వలన నెల్సన్ నిలబడలేక ఒక చెట్టుకు తనను తాను కట్టివేసుకుని తన సైన్యానికి మార్గం చూపించేవాడు. శరీరం నుండి రక్తం కారుతూ ఉంటే అతడు కందకం త్రవ్వటంలో లీనమై ఉండేవాడు. ఇంగ్లండ్ విజయం సాధించింది అన్న శుభవార్త విన్న వెంటనే అతడు, "ఇప్పుడు మరణం అంటే నాకు భయం లేదు. ఆనందంగా నేను మరణిస్తాను. ఇప్పుడు నేను శాంతిగా మరణిస్తున్నాను'' అని చెప్పాడు.

ఇదే విధంగా కాగాబా భిక్షకులను, సోమరులను, త్రాగుబోతులను మార్చటం కొరకు, కుష్ఠురోగుల కొరకు తన జీవితాన్ని అంకితం చేసెను. భారతదేశంలో గాంధీజీ చిత్రపటాలు ఎలా అయితే అన్ని ప్రదేశాలలోను లభిస్తాయో అలాగే జపాన్‌లో అన్ని ఇండ్లలోను కాగాబా చిత్రపటాలు లభిస్తాయి. భారతదేశంలో చిన్న పిల్లవానికి కూడా ఎలా గాంధీజీ పేరు తెలుసో అలా జపాన్‌లో కూడా ప్రతివారికీ కాగాబా పేరు తెలుసు. కాగాబా పేరు అజరం, అమరం. ఇంగ్లండ్‌లో నెల్సన్ పట్ల అందరూ కృతజ్ఞతా భావం చూపిస్తారు. జపాన్‌లో కాగాబా పట్ల, కొరియాలో యంగ్ పట్ల కృతజ్ఞత చూపిస్తారు. మహనీయత అంటే ఇదే.

సోదరులారా! మనం మన కోరికలను మరచిపోవాలి. మనుష్యులలో ఉన్నతమైన భావనలు, గొప్ప ఉద్దేశ్యాలు వికసింపచేయాలి. ధనవంతులయిపోవాలి అన్న భావనలు ఉండకూడదు. కారణం ధనం వ్యక్తిలో వ్యసనాలు పెంపొందింప చేస్తుంది. వారి పిల్లలను దొంగలుగా తయారుచేస్తుంది. వ్యక్తిని అనారోగ్యవంతునిగా తయారుచేస్తుంది. సమాజానికి చెడు చేస్తుంది.

ఏ దేశం కూడ డబ్బువలననే గొప్ప దేశం కాలేదు. ఫ్రాన్సుకు చాలా ధనం ఉంది. నలువైపుల వైభవం, విలాసం ఉన్నవి. ఎంత దృఢంగా నిర్మించబడి ఉన్నప్పటికీ, హిట్లర్ ద్వారా మూడు రోజులలో అల్లకల్లోలం చేయబడింది. ఫ్రాన్స్ నాగరికతను గొప్పది అని అంటారు. పారిస్ ప్రపంచంలో స్వర్గం అని అంటారు. అయితే ఇతర దేశాల నుండి తన దేశాన్ని రక్షించుకునే శక్తి పారిస్‌కు ఎందుకు లేదు? ఫ్రాన్సువారి పరాజయానికి కారణం ఏమిటి? ఫ్రాన్సు వారికి భోగభాగ్యాల పట్ల ఆసక్తి ఎక్కువ.

సంపన్నత వలన ఏ దేశం కానీ, వ్యక్తి కానీ గొప్పవాడు కాలేడు. దేశ సమస్యలను సంపన్నత పరిష్కరించలేదు. మెడికల్ కాలేజీలో చదివే విద్యార్థులలో వేదోక్త విధిని కలిగించాలి అంటే, జగద్గురు శంకరాచార్యుని తయారు చేయాలి అంటే మీరు చేయవలసిన పని ఒకటి ఉన్నది. ప్రతి సాధువుకూ, బాబాకూ సిద్ధాంతాలను ఆధ్యాత్మికతను అనుసరించమని చెప్పాలి. ఆధ్యాత్మికతను అనుసరించడం అంటే గడ్డం పెంచటం, నుదుట తిలకం దిద్దటం కాదు. ధర్మ చింతన మాత్రము చాలదు. ధర్మనీతి గురించి ఆలోచించాలి. భారతదేశంలో 7 లక్షల గ్రామాలు ఉన్నాయి. 56 లక్షల మంది సాధువులు ఉన్నారు. ఒక గ్రామానికి

**సౌజన్యంతో వ్యవహరించే వ్యక్తి తళతళ మెరిసే వజ్రం.**

8 మంది వెళితే ఆ చిన్న గ్రామాన్ని బాగుపరచగలరు. అసంఖ్యాకమైన సమస్యలను, చెడులను నిర్మూలించగలరు. ఈ ఆధ్యాత్మిక సూత్రమును నేను సేవ, సహాయం అంటాను. కర్తవ్యపరాయణత అంటాను.

ధర్మపరమైన, ఆధ్యాత్మికపరమైన పని చేయాలి అనుకుంటే మీరు బుద్ధుని వలె చెప్పండి - మా స్వర్గం పేదవారి మధ్య ఉన్నది, దుఃఖితుల మధ్య ఉన్నది, సేవ మధ్య ఉన్నది అని. బుద్ధునితో మీరు స్వర్గానికి వెళతారా అని అడిగితే ఆయన ఇలా అన్నారు - నాకు స్వర్గానికి వెళ్ళవలసిన అవసరం లేదు. స్వర్గంలో ఉన్న ఆనందం కంటే దీనుల దుఃఖితుల మధ్య, పీడితుల మధ్య, అజ్ఞానుల మధ్య వెయ్యి రెట్లు ఆనందం లభిస్తుంది. నేను వారికి సేవ చేస్తాను. ప్రపంచంలో ఉన్న మానవులందరినీ స్వర్గానికి పంపించటానికి ప్రయత్నిస్తాను.

ఈ రోజులలో వ్యక్తి జీవితంలో ఎన్నో సమస్యలున్నాయి. దేశంలో ఎన్నో సమస్యలున్నాయి. అంతర్జాతీయంగా ఎన్నో సమస్యలున్నాయి. యుద్ధ ఛాయలు నలువైపులా అలముకుంటున్నాయి. ప్రతి వ్యక్తి మరొక వ్యక్తి రక్తం త్రాగుతున్నాడు. మరొకరిని శత్రువుగా పరిగణిస్తున్నాడు. ఒకవేళ అంతర్జాతీయ బాధ్యతలు మీపైన ఉన్నట్లయితే యుద్ధాన్ని మనస్సు నుండి తొలగించండి. దేశాన్ని ముక్కలు చేయటాన్ని నిరసించండి. మంచివాని మనస్సు దేశవిభజనను అంగీకరించదు. మనుష్యుల మధ్య భేదాభిప్రాయాలు ఉంటే వానిని ప్రేమతో పరిష్కరించగలం కానీ యుద్ధంతో కాదు. ఇద్దరు మంచి వ్యక్తులు సోదరులు అయితే ఇద్దరికీ ఒకరిపై ఒకరికి ప్రేమ ఉండాలి. ఒకరికొరకు ఒకరు త్యాగం చేసుకోవాలి. ఇలా ఉంటే మనం యుద్ధం నుండి రక్షించబడతాం. అన్ని సమస్యలు పరిష్కరించబడతాయి. నేడు ఒక దేశం మరొక దేశాన్ని భయపెడుతోంది. దీనిని మనం ప్రేమతో మాత్రమే నివారించగలం. ఇప్పుడు ఏ జ్ఞానంతో, ఏ సంపదతో యుద్ధటాంకును తయారుచేశామో వాటితో మనం ట్రాక్టరును తయారు చేయగలం. ఏ విజ్ఞానం నేడు మెషీన్‌గన్‌ను తయారుచేస్తోందో, ఆ విజ్ఞానంతో నీటి పంపులను తయారుచేయగలం. ఏ విజ్ఞానం, ఏ శక్తి ఒకరిని ఒకరు చంపే, ఒకరితో ఒకరు కొట్టుకునే జ్ఞానాన్ని ఇస్తుందో అది ఒకరి పట్ల ఒకరికి ప్రేమను జనింపచేయగలరు. వ్యక్తి మనసులో ప్రేమ ఉంటే అతడు ప్రపంచమంతా తన కుటుంబం అని భావిస్తాడు. దీని వలన వేల వేల సంవత్సరాలు ప్రపంచం సుఖశాంతులతో ఉంటుంది.

స్నేహితులారా! ఒకవేళ అలా కానట్లయితే నేను మీకు ఒక సూత్రం చెబుతాను. బర్ట్రెండ్ రసెల్ మాటలలో - యుద్ధాలు మొదట బాణాలతో, ధనుస్సులతో జరిగేవి. తరువాత తుపాకులతో, తరువాత బాంబులతో జరుగుతున్నవి. రేపు ప్రపంచ యుద్ధం తర్వాత ఇటుకలు, రాళ్ళు ఉపయోగించాలి. ఈ తెలివి, ఈ విజ్ఞానం ఇవన్నీ ప్రశంసించ తగ్గవే. ఈ టెక్నాలజీ గురించి నేను మీకు ముందు నుండి చెప్పేది ఏమిటంటే ఇవన్నీ అల్పమైనవి. ఈ విజ్ఞానాన్ని పెంపొందింపచేయటానికి, ఈ టెక్నాలజీ లాభ నష్టాలను అర్థం చేసుకొని, మత్తగజంపై అంకుశం ఉపయోగించాలి. సర్కస్‌లో సింహాన్ని ఆడించడానికి రింగ్‌మాస్టర్ హంటర్ ఉపయోగిస్తాడు. మత్తగజంపై అంకుశాన్ని ఉపయోగించి దాని దిశను ఎలా నిర్ధారిస్తామో మంచి జీవితాన్ని గడపటానికి భౌతిక నివాసానికి, ఆర్థిక వికాసానికి ఆధ్యాత్మికత అనే అంకుశాన్ని ఉపయోగించాలి.

పిల్లలూ! భవిష్యత్తులో మీపై ఎన్నో బాధ్యతలు మోపబడతాయి. వానిని మీరు నిర్వర్తించవలసి ఉంటుంది. మీరు ఎన్నో సమస్యలను పరిష్కరించాలి. నేను ముసలివాడిని అయిపోయాను. ఎప్పుడు తీరానికి చేరుకుంటానో తెలియదు. కానీ మీకు ఒక చిన్న సూత్రం చెప్పి వెళ్ళిపోవాలి అనుకుంటున్నాను. ప్రపంచంలో ప్రతి సమస్యకు, దేశంలో ప్రతి సమస్యకు సమాధానం ఒకటే. అది మనిషిలో మానవత్వాన్ని మేలుకొలపాలి. మంచితనాన్ని జీవింపచేయాలి. భౌతిక వికాసంతో పాటు మహనీయతను వికసింపచేయాలి. దీనినే నేను ఆధ్యాత్మిక వికాసం అంటాను. దీనిని మీరు సాధుత్వం అనండి, హుందాతనం అనండి, ధర్మనీతి అనండి, ఏమైనా అనండి. మీరే పదాలను అయినా ఉపయోగించండి. నేను దీనిని ఆధ్యాత్మికత అంటాను. ఈ మహనీయతను, కర్తవ్యపరాయణతను మనుష్యులలో జీవింపచేయాలి. సమాజంలో మంచిదశను సుస్థిరపరచినట్లయితే పరిపూర్ణమైన ఆనందాన్ని పొందగలం.

సుఖభోగాలను ప్రసాదించే ఈ భౌతిక విజ్ఞానానికి ధన్యవాదాలు. భౌతిక ప్రగతికి ధన్యవాదాలు. ఈ టెక్నాలజీకి ధన్యవాదాలు. కానీ ఇవన్నీ ఎంత వరకూ అసంపూర్ణమైనవిగా ఉంటాయో, అంతవరకు వీటికి ఉన్న మరొక పక్షమును వికసింపచేయలేం. మహత్తరమైన రెండవ పక్షమును మర్చిపోకూడదు. దీనినే నేను ఆధ్యాత్మికత అంటాను. ఇవన్నీ మీకు చెప్పటానికి మీ వద్దకు వచ్చాను. నాపై సమాజ నవనిర్మాణ బాధ్యత ఉన్నది. ఆ బాధ్యతను మీరు కూడా నిర్వర్తించవలసి ఉన్నది. మీరు దీనికి ఉపయోగపడతారని, మీ దేశానికి, మానవజాతికి, విశ్వానికి మహోన్నతమైన సేవ చేయటంలో మీరు సమర్థులవుతారని నా నమ్మకం.

★★★

**జీవితంలో ప్రతి క్షణం ఉజ్వల భవిష్యత్తు అవకాశాన్ని మోసుకువస్తుంది.**

# వ్యక్తి నిర్మాణం

# శిష్టాచారంలో ఇమిడి ఉంది సభ్యత

సృష్టిలోని ఇతర జంతువులు తమ శారీరక, మానసిక అవసరాలను ఒంటరిగా, ఇతరుల సహాయం లేకుండా తీర్చుకుంటాయి. కాని మనిషి అలా చేయలేడు. మనిషి తన అవసరాలలో హెచ్చువాటిని తీర్చుకోవడం కోసం ఇతరులపై ఆధారపడవలసివస్తుంది. అన్నం, వస్త్రం, ఇల్లు, వృత్తి, చికిత్స, విద్య, వాహనాలు, ఆటపాటలు, వినోదం, బంధుత్వం, భద్రత, న్యాయం, ప్రభుత్వం మున్నగు లెక్కలేనన్ని ఉపకరణాల కోసం అతడు ఇతరుల సహాయం తీసుకోవలసి వస్తుంది. ఆ సహాయం అందకపోతే బ్రతకడమే సాధ్యపడదు. ఇతర జంతువులు జన్మించిన తర్వాత కొద్ది సమయం మాత్రమే తల్లి సహకారాన్ని అపేక్షిస్తాయి. త్వరత్వరగా స్వావలంబులు అవుతాయి. కాని మనిషి 10 - 15 సంవత్సరాల వయస్సు వచ్చేవరకు పరావలంబిగానే ఉంటాడు. ఎవరూ అతడికి సహాయం, సహకారం అందించకపోతే అతడు బ్రతికి బట్టకట్టడమే కష్టమైపోతుంది. వాస్తవానికి మనిషి సామాజిక ప్రాణి. పరస్పర సహకారం ఆధారంగా మాత్రమే అతడు పని చేయగలుగుతాడు.

**వ్యవహారంలో శిష్టాచారం :** ఇతరుల పట్ల మన వ్యవహారం ఎలా ఉన్నదనే విషయంపై జీవన వికాసం, ఉన్నతి-పతనం, మైత్రి-శత్రుత్వం, లాభ నష్టాలు, హర్ష విషాదాలు, కీర్తి-నిందలు చాలావరకు ఆధారపడి ఉంటాయి. మనం పొగరుబోతులుగా, విశృంఖలంగా, కటువుగా, స్వార్థపరులుగా, అసభ్యంగా వ్యవహరిస్తే, మన వ్యవహారం వల్ల ఇతరులను నొప్పిస్తే- ఇతరుల నుండి ప్రతిక్రియగా మనకు తిరస్కారం, శత్రుత్వం మాత్రమే లభిస్తాయి. వారు మనల్ని తుచ్ఛులుగా, నీచులుగా, అనాగరికులుగా సభ్యతారహితులుగా, మూర్ఖులుగా, పొగరుబోతులుగా పరిగణిస్తారు. సహకారం అందించవలసిన సందర్భం వచ్చినపుడు తప్పుకునే ప్రయత్నం చేస్తారు. అలాంటి పరిస్థితిలో ఏ వ్యక్తి అయినా, అతడు ఎంత చతురుడయినా, ఎంత సమర్థుడయినా, నష్టపోతాడు. అలా కాక ఇతరుల పట్ల తియ్యగా, మృదువుగా, ఉదారంగా, సభ్యంగా వ్యవహరించే కళలో ప్రావీణ్యం పొందిన వ్యక్తి సహజంగా ఇతరుల మనస్సును గెలుచుకుంటాడు. ఇతరుల స్నేహ సహకారాలను చూరగొంటాడు. ఫలితంగా ఉన్నతికీ, సౌకర్యాలకూ అనేక సాధనాలు అతడికి సహజంగా లభ్యమవుతాయి.

**ప్రగతికి ఆధారం సద్భావన :** వ్యక్తిగత జీవితంలో కాని, సామాజిక జీవనంలో కాని - ప్రతి రంగంలోనూ ప్రగతి, స్థిరత్వం, భద్రత, శాంతి అనేవి పరస్పర స్నేహ సద్భావాలపై ఆధారపడి ఉంటాయి. కనుకనే "ప్రతి వ్యక్తి ఇతరులు తన పట్ల ఎలా వ్యవహరించాలని కోరుకుంటాడో తాను ఇతరులపట్ల అలా మృదు మధురంగా వ్యవహరించాలి" అని మనీషులు అనాదిగా చెపుతూ వచ్చారు. ఈ వ్యవహరణనే శిష్టాచారం, సభ్యత, నాగరికత అని పిలుస్తారు. ఇది మానవత్వంలోని ఒక ప్రముఖ లక్షణం. మనిషిలో ఈ భావన ఎంత తక్కువగా ఉంటే అతడు అంత అసభ్య వ్యక్తిగా పరిగణించబడతారు.

**సభ్యత స్వరూపం :** ఇతరులు మనతో మృదువుగా మాట్లాడాలనీ, మర్యాదగా వ్యవహరించాలనీ, ఉదారంగా వ్యవహరించాలనీ, మనకు సహకారం అందించి మన కష్టాలను తొలగించాలనీ మనం కోరుకుంటాం. ఇతరులు కూడా మన నుండి ఇలాంటి వ్యవహరణనే కోరుతారు. మనిషి లోని ఈ సామూహిక వాంఛ పేరు, ఈ సామూహిక ఆవశ్యకత పేరు సభ్యత. సభ్యత ఎంతగా వికసిస్తే అంతగా సుఖశాంతులు నెలకొని విస్తరిస్తాయి. అలా కాక ఈ పరిధుల ఉల్లంఘన ప్రారంభమయితే జనం పరస్పరం పొగరుబోతుతనంతో వ్యవహరిస్తే, దోపిడీ విధానాన్ని దురాక్రమణ విధానాన్నీ అనుసరిస్తే, స్వార్థ సంకుచితత్వాలను ప్రదర్శిస్తే - లభించేవి దుఃఖ దైన్యాలు, అసంతృప్తి, ఉద్వేగం మాత్రమే. ఇలాంటి కార్యకలాపాలను అవినీతిగా, పాపంగా, పొగరుబోతుతనంగా పరిగణిస్తారు. కొద్దిమంది వ్యక్తులు సామాజికంగా రాజకీయంగా ఇందుకు ప్రతిక్రియ జరిపితే - అందువల్ల హెచ్చుమంది శాంతి ప్రమాదంలో పడుతుంది. కనుకనే - కట్టుబాట్లను త్రెంచుతూ, పొగరుగా వ్యవహరించే అసభ్య వ్యక్తులను గూండాలు, దుర్మార్గులు, పాపులు, దుష్టులు, చోరులు, పొగరుబోతులు, ధూర్తులు, అపరాధులు అని పిలుస్తారు. వారి ఆగడాలను నిరోధించడానికై సమాజం తగు చర్యలు తీసుకుంటుంది. పోలీసుశాఖ, న్యాయస్థానం, చట్టం - ఇవన్నీ ఆ చర్యలలో భాగాలు. అలాంటి వ్యక్తి ఈసడింపులకు గురి అవుతాడు. ఇతరుల స్నేహ సహకారాలు, నమ్మకం అతడికి అందవు. ప్రతి రంగంలో అతడు తిరస్కారం పొందుతాడు. వైఫల్యం పొందుతాడు. ఓటమిని చవిచూస్తాడు. ఇలాంటి కార్యకలాపాలు మానవత్వానికి మాయని మచ్చలు.

**మాటలో కన్న చేతలో సజ్జనత్వం పరీక్షించబడుతుంది.**

**శిష్టత ఒక ఆధ్యాత్మిక గుణం :** శిష్టాచారం (సజ్జనుల ఆచరణ) మానవత్వంలోని ప్రాథమికమూ, ఆవశ్యకము అయిన ఒక గుణం. దీనివల్ల సామాజిక వ్యవస్థ స్థిరంగా నిలుస్తుంది. అంతేకాదు. ఆ శిష్ట వ్యక్తి ఇతరుల స్నేహాన్నీ, సద్భావాన్నీ, సహకారాన్నీ పొంది ప్రతి జీవన రంగంలో ప్రగతి పొందుతూ ఉంటాడు. కనుక, మనం సభ్యతా నియమాలను తెలుసుకోవాలి. వాటి అవసరాన్ని అనుభూతి పొందాలి. మన వ్యావహారిక జీవనంలో గ్రహించదగిన ఒక మంచి పద్ధతిగా అభ్యసించాలి. మన పిల్లలకు మొదటి నుండీ అందుకు శిక్షణ ఇవ్వాలి. అందువల్ల వారు సభ్యత నేర్చుకుంటారు. ఇతరుల మనస్సులపై తమ శ్రేష్ఠత్వం, శిష్టత్వంల ముద్ర వేయడంలో వారు సాఫల్యం పొందాలి. తెచ్చిపెట్టుకున్న శిష్టాచారం, పొగడ్తలు, చాతుర్యం, వంగి సలాము చేయడం, మోసం ఇవన్నీ స్వప్రయోజనాల కోసం జరుపబడతాయి. జరుపబడుతున్నాయి కూడా. అయితే, మౌలికంగా శిష్టత ఒక ఆధ్యాత్మిక గుణం. మానవులందరిలో ఈశ్వరుని జ్యోతి వెలుగుతూ ఉన్నదని గుర్తించి, ఔచిత్యపు పరిధులను ఏమాత్రం దాటకుండా ఉండడం, ఔదార్యం, సేవ, క్షమ, సహనం - ఇవన్నీ దివ్య ఆధ్యాత్మిక గుణాలు. వీటిని అలవరుచుకోవడం వల్ల మనలో ధార్మికత, ఆస్తికత వికసిస్తాయి. చివరికి జీవన్ముక్తి, బ్రహ్మ నిర్వాణ స్థితి వరకు చేరుకోగలగడం సాధ్యపడుతుంది. పొగరుబోతుతనం వెనుక మనిషిలోని తామసిక ప్రవృత్తి, అహంకారం, అసురగుణం, పాప ప్రవృత్తి దాగి ఉన్నాయి. ఈ కాగితపు పడవ ఒక రోజున మునిగిపోక తప్పదు. అసభ్య వ్యక్తి జీవితం తిరస్కారం, ఆత్మనింద అనే దెబ్బలు తింటూ చివరికి పతనపు కూపంలో పడిపోతుంది.

**శిష్టాచారాన్ని ఎన్నడూ వదలవద్దు:** శిష్టాచారం జీవితానికి అత్యవసరమని గుర్తించాలి. దాని ప్రయోజనాన్ని వంట బట్టించుకోవాలి. ఎంతో మెలకువతో దాన్ని అభ్యసించడానికి మనం ప్రయత్నించాలి. దీనిని వాక్కుతో ప్రారంభించాలి. ఎవరితోడూ కటువుగా మాట్లాడకూడదు. కఠోరం కర్కశం అయిన పదాలను ఉపయోగించడం వెంటనే మానుకోవాలి. ఎదుటి వ్యక్తిని ఆదరిస్తూ మృదుమధురంగా, సానుభూతి పూర్వకం, గౌరవ పురస్సరం అయిన పదాలను ఉపయోగిస్తూ మాట్లాడాలి. అభిప్రాయాలలో తీవ్రమైన విభేదం ఉండవచ్చు. ఎదుటి వ్యక్తి వాదాన్ని మనం పూర్తిగా నిరాకరించవచ్చు. అయినా మన వాక్కులో కటుత్వం రాకూడదు. ఎదుటి వ్యక్తి మనపట్ల అనుచితంగా వ్యవహరించినా, దాన్ని ఖండించడానికి సంయమనంతో, తర్కంతో, వాస్తవాలతో నిండిన మాటలను దృఢంగా చెప్పాలి. ఆ అనౌచిత్యాన్ని తొలగించుకునే మార్గం సూచించాలి. అందువల్ల ఎదుటి వ్యక్తి మెత్తబడి, తన తప్పును ఎంతో కొంత సవరించుకునే అవకాశం కలుగుతుంది. అలాకాక తిట్లు,శాపనార్థాలు ప్రయోగిస్తే ప్రయోజనం ఉండదు. వైమనస్యం పెరుగుతుంది. ద్వేషం, దురభిప్రాయం, దాడి, ఎదురుదాడి అనే క్రమం సాగుతుంది. అందువల్ల శక్తి, శాంతి దెబ్బతింటాయి. ఇది విజ్ఞతతో కూడిన ధోరణి కాదు.

**మృదు మధురంగా మాట్లాడు :** మధురంగా మాట్లాడడం, గౌరవం నిండిన మాటలు వాడడం అలవాటు చేసుకుంటే మనం ఖర్చు లేకుండా ఇతరుల మనస్సులను జయించగలుగుతాము. వారిని మన శ్రేయోభిలాషులుగా, మిత్రులుగా, సహాయకులుగా మార్చుకోగలుగుతాము. ఇంత తక్కువ ఖర్చుతో ఇంతటి ప్రయోజనం చేకూర్చే ఉపాయం ప్రపంచంలో మరొకటి లేదు. మధురమైన వాక్కు ప్రాముఖ్యాన్ని ప్రజలకు ఎంత త్వరగా నేర్పితే, దానిని ఎంత త్వరగా అలవాటుగా మార్చగలిగితే అంత ప్రయోజనం ఉంటుంది. పెద్దలనైనా, పిన్నలనైనా గౌరవంగా సంబోధించాలి. వారికి ఇంపుగా తోచే భాషలో మన అభిప్రాయాన్ని వ్యక్తం చేయాలి. ఇది శిష్టాచారంలోని మొదటి మెట్టు.

**ఇతరులు మన పట్ల ఎలా ప్రవర్తిస్తే మనకు నచ్చదో అలా మనం ఇతరుల పట్ల ప్రవర్తించకూడదు:** మన వ్యవహరణ వల్ల ఇతరులకు అనుచితంగా కష్టం కలిగించకూడదు. ఎవరికైనా మాట ఇస్తే అనివార్యమైన ఇబ్బంది వస్తే తప్ప ఆ మాటను నిలబెట్టుకునేందుకు ప్రయత్నించాలి. చాకలి, దర్జీ, బట్టలకు రంగు వేసే వ్యక్తి నుండి ఉద్యోగులు, అధికారుల వరకు సకాలంలో తమ మాట నిలబెట్టుకోవడంలో అశ్రద్ధ చూపడం మనకు కనిపిస్తుంది. ఒకరి ఇంటికి ఫలానా సమయానికి వస్తానని మాట ఇచ్చి ఆలస్యంగా వెళ్లడం చాలా సార్లు జరుగుతూ ఉంటుంది. ఇలా మాట తప్పే అలవాటు చాలా చెడ్డది. చెప్పిన మాట ఖచ్చితంగా నిలబెట్టుకోవాలి. సాధ్యమైనంతవరకు సమయపాలన చేయాలి. ఇది సభ్యతకు రెండవ లక్షణం.

**స్త్రీ పురుషులు పరస్పరం పవిత్ర దృష్టి కలిగి ఉండాలి :** మహిళల పట్ల అమర్యాదగా వ్యవహరించకూడదు. అంతే కాదు. వారిపట్ల పవిత్ర భావం కలిగి ఉండాలి. యువతులవైపు అసభ్యంగా తేరిపార చూడడం, వారితో విరగబడి నవ్వడం, పొగరుగా మాట్లాడడం భారతీయ సభ్యతకు పూర్తిగా విరుద్ధమైన విషయాలు. యువతీ యువకులు పరస్పరం కళ్లరెప్పలు వాల్చి మాట్లాడాలి. మన స్వంత సోదరితో, కుమార్తెతో, తల్లితో ఎలా మాట్లాడతామో, ఎలా వ్యవహరిస్తామో అలాగే ఇతర మహిళలతో మాట్లాడాలి, వ్యవహరించాలి. తమ కురులు, భూషణాలు, అలంకరణ

**ధర్మం నమ్మేది కాదు, కాయకల్పం చేసే ఔషధం.**

ఇతరులను తమవైపు ఆకర్షించేవిగా ఉండకుండా యువతులు జాగ్రత్త పడాలి. భారతీయ సభ్యత ఇచ్చే ప్రముఖ సందేశాలలో ఇది ఒకటి. అవి తమ దృష్టిలో కళగా, శోభగా ఉండవచ్చుగాక. అయినా వాటిలో అశ్లీల ప్రవృత్తులను రెచ్చగొట్టే ప్రమాదమున్నది. ఆ ప్రమాదం విషయంలో మెలకువ వహించకుండా ఆడపిల్లలు పారిస్, అమెరికాలను అనుకరించి రెచ్చగొట్టే భూషణాలు ధరిస్తే ఫలితాలు కూడా ఆ దేశాలలో కలిగినవే కలుగుతాయి. ఈ దేశంలో సంప్రదాయంగా వస్తున్న శిష్టాచారానికి, శీలభావనకు చావుదెబ్బ తగులుతుంది. శిష్టాచారం దృష్ట్యా ఈ ప్రమాదం గురించి తమ ఇళ్లలోని ఆడపిల్లలను హెచ్చరించటం సభ్యతను అభిమానించే వారందరికీ కర్తవ్యం అవుతోంది.

**పెద్దలను గౌరవించడం సభ్యత :** పెద్దలు, వృద్ధులు, గురుజనుల పట్ల ప్రత్యేకమైన శిష్టాచారాన్ని పాటించాలి. వారి పెద్దరికాన్ని మనం గుర్తించాలి. ఏమరుపాటు లేకుండా వారిపట్ల గౌరవాన్ని ప్రకటించాలి. కులాల ప్రమేయం లేకుండా పెద్దలకు అభివందనం చేయటం భారతీయ సంస్కృతి అనుయాయుల కర్తవ్యం. బంధువర్గంలోని పెద్దలకు రోజూ ఉదయం పాదాభివందనం చేసే ప్రాచీన సంప్రదాయాన్ని నేడు ఇంటింటా పునరుద్ధరించాలి. ఇందువల్ల పిల్లలలో గురుజనుల పట్ల ఆదరభావం ఏర్పడుతుంది. వారు మనల్ని అనుకరిస్తారు. ఫలితంగా నేడు పిల్లలలో కానవస్తున్న క్రమశిక్షణా రాహిత్యం, అశ్రద్ధా తగ్గుతాయి.

**గుర్తుంచుకోండి :** గౌరవనీయులైన వ్యక్తుల ఎదుట కుదురుగా కూర్చోవాలి. టికెట్టు కొనేటప్పుడు వరుసలో మన ముందున్న వ్యక్తిని దాటుకుని వెళ్లకూడదు; 'క్యూ'ను భంగపరచకూడదు. వికలాంగులను హేళన చేయకూడదు. ఆత్మస్తుతి తగదు. అతివాగుడు తగదు. అశ్లీలంగా మాట్లాడడం వ్యవహరించడం తగదు. పదిమందిలో అనవసరంగా గోకుకోవడం తగదు. ఇంటికి వచ్చిన అతిథిని తగువిధంగా గౌరవించకపోవడం తగదు. ఇతరుల వస్తువులను వారి అనుమతి లేకుండా తీసుకోవడం మంచి పద్ధతి కాదు. ఆవలిస్తున్నప్పుడు, తుమ్ము వచ్చినప్పుడు రుమాలును ముఖానికి అడ్డుపెట్టుకోవాలి. అనుచిత స్థలాలలో మలమూత్ర విసర్జన చేయకూడదు. ఇతరులను వెక్కిరించకూడదు. గప్పాలు కొట్టకూడదు. త్రోవలో నడుస్తూ తినకూడదు. మాట్లాడేటప్పుడు ఇతరులను గిల్లకూడదు, భుజం తట్టకూడదు. అనుమతి లేనిదే అపరిచితుల ఇంటిలో ప్రవేశించకూడదు. ఇతరుల ఉత్తరాలను వారి అనుమతి లేకుండా చదవకూడదు. ఎదుటి వ్యక్తి జవాబు చెప్పడానికి సంకోచించే ప్రశ్నలు అడగకూడదు. గోడ మీద మీ పేరు కాని, మరో అసంగతమైన మాట కాని వ్రాసి దాన్ని ఖరాబు చేయకూడదు. సభ్య సమాజంలో నివసించే సజ్జనుల ఆచార వ్యవహారాలను శ్రద్ధగా గమనించాలి. సత్పురుషులను శ్రద్ధగా వినాలి. వారిని అనుసరించాలి.

★★★

## మైత్రి మహిమ

ఒక అడవిలో లేడి, కాకి, తాబేలు, ఎలుక కలసి జీవిస్తూ ఉండేవి. కాని విపరీత స్వభావాలు కల్గిన ప్రాణులు కావటం వలన పరస్పరం పోట్లాడుకొంటూ ఉండేవి. ఈ పోట్లాటలవల్ల అవి వేటగాళ్లకు చిక్కి మరణిస్తూ ఉండేవి. ఇలా తరతరాలుగా సాగటంవలన వీటి వంశమే లేకుండాపోతుందని భావించి ఒక మహాత్ముడు ఈ నాల్గు ప్రాణులకు కలసి మెలసి జీవించమని ఉపదేశం చేశాడు. ఆయన ఉపదేశ ప్రభావం వలన వీటి అంతరంగంలో మార్పు కల్గి, ఇవి కలసి మెలసి జీవించ నారంభించాయి.

ఒకనాడు ఒక వేటగాడు నీటిలో తాబేలుని పట్టుకొన్నాడు. మిగిలిన మూడు జంతువుల్ని స్నేహపాశం బంధించగా, అవి అసమర్థతతో ఊరుకోక తెలివిని ఉపయోగించి తాబేలుని రక్షించాలనుకొన్నాయి. లేడి కుంటుతూ వేటగాని ముందుకు వెళ్లింది. కాకి అతని వీపుపైన వాలింది. వేటగాడు కుంటి లేడిని అవలీలగా పట్టుకొనవచ్చునని చేతిలోని వలను క్రింద వైచి లేడిని వెంబడించాడు. ఇంతలో ఎలుక వల కొరికి తాబేలుతో సహా పారిపోయింది. చాలాసేపు లేడి వెంట పరుగెత్తి, లాభంలేక వేటగాడు నిరాశతో వెనుకకు తిరిగి వచ్చాడు. వల కొరికివేయబడి ఉంది. తాబేలు లేదు. ఆ ప్రాంతంలో ఏవైనా అతీంద్రియశక్తులు ఉన్నాయా అని వేటగానికి భయం వేసింది. భయంతో వడివడిగా ఇంటికి పరుగు తీశాడు.

కలిసిమెలిసి జీవించటంవల్ల, పరస్పరం మైత్రి కల్గి ఉండటం వల్ల సమస్త ప్రాణులూ ఎంతటి విపత్తులనైనా అవలీలగా ఎదుర్కొనగలవు. ఏకాకిగా బ్రతికేవారు, సంతులనం కోల్పోయేవారు చిన్న చిన్న విపత్తులకే ఎక్కువ నష్టాన్ని, కష్టాన్ని పొందుతూ ఉంటారు.

- ప్రజ్ఞాపురాణం నుండి

**గుణ కర్మ స్వభావాలను సంస్కరించడమే నిజమైన సేవ.**

## మహిళా జాగరణ

# మహిళ వాత్సల్యమూర్తి, మహిమాన్విత

విశ్వకవి రవీంద్రనాథ్ టాగూరు ఇలా అన్నారు: "పవిత్రురాలైన మహిళ సృష్టిలోని సర్వోత్తమ కృతి. సృష్టిలోని వాత్సల్యం, స్నేహం, మమత, ప్రేమ అనే అమృత ధారలు మహిళ హృదయం నుండి వెలువడి ఈ ప్రపంచానికి అమృత దానం చేస్తున్నాయి." కవి రస్కిన్ ఇలా అన్నారు: "మాత హృదయం స్నేహపు సెలయేరు." సృష్టి ప్రారంభంనుండి నిరంతరం ప్రవహిస్తూ అది మానవతను ఆర్ద్రం చేస్తోంది. మాతృదేవోభవ అని ఉపనిషత్తులో మహర్షి మాతను లోకోత్తరంగా సన్మానించారు. వాస్తవానికి, మామూలు ప్రాణులతో నిండిన ఈ భూగోళానికి మాతృ హృదయం ఒక వరం.

**మాతా ధరిత్రే, జననీ దయార్ద్రహృదయా శివా ।**
**దేవీ త్రిభువన శ్రేష్ఠా నిర్దోషా సర్వ దుఃఖహా ॥**
**ఆరాధనీయా పరమా దయా శాంతిః క్షమా ధృతి ।**
**స్వాహా స్వధాచ గౌరీచ పద్మాచ విజయా జయా ॥**

వేదవ్యాస భగవానుడు మహిళను పై 21 పేర్లతో సంబోధిస్తూ ఆమె గుణాలను గానం చేశాడు. ఆయన ఇంకా ఇలా అన్నారు.

**నాస్తి గంగా సమం తీర్థం నాస్తి విష్ణు సమః ప్రభుః ।**
**నాస్తి శంభు సమః పూజ్యో నాస్తి మాతృసమో గురుః ॥**

అనగా - గంగతో సమానమైన తీర్థం లేదు. విష్ణుమూర్తితో సమానుడైన ప్రభువు లేడు. శివునితో సమానమైన పూజ్యుడు లేడు. మాతతో సమానమైన గురువు లేదు.

బ్రహ్మ ఈ సృష్టిని సృష్టిస్తాడు. విష్ణుమూర్తి దానిని పెంచి పోషిస్తాడు. సూక్ష్మమైన ఈ ఆధ్యాత్మిక రహస్యాన్ని స్థూల రూపంలో మాతలో చూడవచ్చు. బ్రహ్మ, విష్ణువుల దైవీ శక్తులు ఈ భూమిపై మాత రూపంలో తమ పనులు చేస్తున్నాయి. ఈ అనుభూతి ఆధారంగా శాస్త్రకారుడు ఇలా అన్నాడు :

**యాదేవీ సర్వ భూతేషు మాతృరూపేణ సంస్థితా ।**
**నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః ॥**

అనగా - సృష్టి రచన, పోషణ చేసే దైవీ శక్తి ఈ స్థూల జగత్తులో మాత రూపంలో తన పని చేస్తోంది. కనుక మాతృరూపి అయిన మహిళకు పలుమారులు నమస్కరిస్తున్నాను.

ఈ సత్యాన్ని ద్రష్ట మనీషి అయిన ఒక వ్యక్తి ఇలా వర్ణించాడు- "పరమేశ్వరుని తర్వాత మనం అత్యధికంగా ఋణపడి ఉన్నది మహిళకే. మొదట జన్మ ఇచ్చినందుకు. ఆ తర్వాత దీనిని జీవించడానికి యోగ్యంగా చేసినందుకు." సారాంశం ఏమంటే - మానవ జీవనంలోని అవకాశాలన్నింటికీ మూలం తల్లి ప్రేమ, ఆమె త్యాగం, ఆమెలోని మహత్తర సేవలలో ఇమిడి ఉంది.

మహిళ ఈ గొప్పతనాన్ని, మానవ జాతి ఆమెకు ఎంతగానో ఋణపడి ఉండడాన్ని గుర్తించి - అనాదినుండి మనిషి ఆమెను ఆదరణీయగా, పూజనీయగా పరిగణించాడు. ఆమెను తగు విధంగా ఆదరించాడు. సత్కరించాడు. కాళి, సరస్వతి, లక్ష్మి ఇతర దైవీ శక్తుల రూపంలో మహిళను పూజించడం అనేది ఘనంగా సన్మానించడానికే.

**పిల్లలకు మొదటి గురువు తల్లి :** మహిళ తల్లి రూపంలో పిల్లలకు మొదటి గురువు. తల్లికి వివిధ విషయాలలో లభించిన అవగాహన, అనుభవం పిల్లల జీవితాన్ని ప్రభావితం చేస్తాయి. తల్లి ఉచ్చారణ నుండే, ఆమె భాష నుండే వారు భాషా జ్ఞానాన్ని పొందుతారు. ఆ జ్ఞానం జీవితమంతటిలో సంపాదించే భాషా జ్ఞానానికి మూలాధారం అవుతుంది. ఈవిధంగా పిల్లల చదువు సంధ్యలకు వారిని యోగ్యులుగా రూపొందించేందుకు పునాదిని నిర్మిస్తుంది. ఆ పునాది మీద పిల్లల యోగ్యత, విద్య, జ్ఞానం అనే భవనం నిర్మాణం అవుతుంది. తల్లి పాత్ర చనుబాలు ఇవ్వడం, స్నేహం అందించడం వరకే పరిమితం కాదు. వాటితోపాటు ఆమె పిల్లలకు వికసించడానికీ, ఉన్నతి పొందడానికీ, పురోగమించడానికీ సూక్ష్మమైన ప్రేరణ శక్తిని కూడ ఇస్తుంది. తల్లి బోధించే ఉన్నత ఆదర్శాలు, త్యాగ బలిదానాల కథలు, ఉపదేశాలు, మామూలు భాషలో అందించే జ్ఞానం పిల్లల జీవితాన్ని ఎంతగానో ప్రభావితం చేస్తాయి. జీవితమంతా పెద్ద పెద్ద పుస్తకాలు చదివినా, పెద్ద డిగ్రీలు సంపాదించినా అంతటి జ్ఞానం లభించదు. తల్లి ప్రసాదించిన ప్రాథమికమైన జ్ఞాన ప్రేరణ ఆధారంగా పిల్లలు అనంతర కాలంలో వివిధ విషయాలలో విస్తృతమైన జ్ఞానాన్ని పొందుతారు.

పిల్లల పట్ల తల్లి స్నేహం, ఆమె మమత దయామయుడైన పరమాత్మ ప్రకాశ కిరణాలు. శిశువు పట్ల మాత హృదయంలో పొంగిపొరలే స్నేహం ప్రకృతి ద్వారా జీవన రక్షణకు పరమేశ్వరుడు ప్రసాదించే వరం. తల్లి ఈ స్నేహాన్ని, మమతనూ సహజంగా పిల్లల

**శిక్ష ద్వారాకన్న ప్రేమ ద్వారా,క్షమద్వారా వ్యక్తి సంస్కరించబడతాడు.**

పోషణలో వినియోగిస్తుంది. మాతృ ఋణం అన్నిటిని మించిన ఋణమని మహర్షులు ప్రవచించారు. వారు మహిళకు సమాజంలో గౌరవ స్థానాన్ని, పూజ్య స్థానాన్ని ఇచ్చారు. ఆమెను ఆదరించారు, సత్కరించారు. ఆ విధంగా మాతృ ఋణం తీర్చుకున్నారు. మాతృ ఋణం తీర్చుకోవాలని భావితరాలకు సందేశం ఇచ్చారు. మహిళ ప్రతిష్ఠను, గౌరవాన్ని చిరస్థాయిగా ఉంచాలని మత గ్రంథాలన్నీ ఉపదేశిస్తున్నాయి.

**మాతృశ్చ యద్ధితం కించిత్ కురుతే భక్తితః పుమాన్ ।**
**తద్ధర్మహి విజానీయా దేవం ధర్మవిదో విదుః ॥**

అనగా - మాతృశక్తి హితం కోసం పురుషుడు చేసే కర్మ అతడి ధర్మమే. మహిళా జాతిలో దైవీశక్తిని దర్శించి ఆ జాతిని సేవించడం గృహస్తుడు చేసే మహా తపస్సు.

**భారతీయ సంస్కృతిలో మహిళకు గౌరవస్థానం :** భారతీయ సంస్కృతి మహిళకు ఇచ్చిన ఈ గౌరవ స్థానం మాటలకు పరిమితం కాలేదు. అడుగడుగునా అది ఆచరణలో ప్రతిబింబించింది. భారతీయ సమాజం మహిళా శక్తి చేసిన మహోపకారాలను గుర్తించింది. మాతృశక్తిని పూజించింది, సత్కరించింది. మాతృశక్తికి ఉన్నత స్థానం ఇచ్చింది. ఫలితంగా మహిళ హృదయం నుండి సహజంగా స్నేహం, వాత్సల్యం, మమత అనే త్రివేణి భారత భూమిలో ఉప్పొంగి ప్రవహించింది. దానిని త్రాగి భారతీయ జీవనం అజరామరం అయింది. భారతీయులు లౌకిక జీవనంలో, పారలౌకిక జీవనంలో అద్భుతమైన ప్రగతి సాధించారు. చరిత్ర అందుకు సాక్ష్యం ఇస్తోంది.

పత్నిగా, పుత్రికగా, సోదరిగా మాతృతత్వం మనకు నలువైపులా వ్యాపించి ఉంది. అది శ్రద్ధతో పూజింపదగినది. దేవత్వపు ఈ ప్రత్యక్ష ప్రతిమను గౌరవించడం అభినందనీయం. ఈ రహస్యాన్ని గ్రహించినంతవరకు పురుషుడు తన దేవత్వాన్ని నిలుపుకోగలిగాడు. కాని, నేడు అతడు మహిళను భోగ వస్తువుగా పరిగణిస్తున్నాడు. దాసిగా ఆమెను పాశవిక బంధనాలతో బంధిస్తున్నాడు. ఆమెను నిస్సహాయురాలుగా చేస్తున్నాడు. ఆమెపై అత్యాచారాలు జరుపుతున్నారు. ఆమెను తన ఆస్తిగా పరిగణిస్తున్నాడు. ఫలితంగా - పురుషుడు పురుషుడు కాకుండాపోయాడు. అతడి తపస్సు, తేజస్సు నశించిపోయాయి. అతడు ఒక క్షుద్ర ప్రాణిగా మిగిలిపోయాడు. అతడి గౌరవం మంట కలిసింది. అతడు నీచస్థాయిలో బ్రతుకును వెళ్లదీస్తున్నాడు. ఈ పృథ్వి మీద దైవీ తత్వానికి ఒకే ప్రతీక మాతృత్వం. దానిపట్ల ఉన్నతోన్నతమైన శ్రద్ధ చూపనిదే దేవత్వాన్ని పూజించడం, సాధన చేయడం జరుగదు. ఆ శ్రద్ధ లోపిస్తే పురుషుడు దైవత్వాన్ని కోల్పోతాడు. మహిళ ఒక కామధేనువు. అయితే ఆమెను వాసనగా, ఆస్తిగా, దాసిగా చూస్తే ఆ కామధేనువు మనకు శాపంగా పరిణమిస్తుంది. మన దుర్బుద్ధి ఎప్పుడు తొలగుతుందో! మనం మహిళలోని దివ్యశక్తిని గుర్తించి ఆమె చరణాలకు శ్రద్ధతో కన్నీరు అర్పించడం ఎప్పుడు నేర్చుకుంటామో! ఈ లోపం కారణంగా మనం ఎంత కాలం దైవత్వాన్ని కోల్పోయి బ్రతుకుతామో!

✶ ✶ ✶

## మనిషి లక్షణాలు మూడు

ఒక ఫకీరు ప్రతిరోజూ పగటి పూట రెండు చేతుల్లో రెండు వెలుగుతున్న దివ్వెలను పట్టుకొని బజార్ల వెంట తిరుగుతూ ప్రతి దుకాణం ఎదుట కొంతసేపు నిలబడి ముందుకు సాగిపోయేవాడు. ఇది చూచి ఒక వ్యక్తి "బాబా నీవు పగటిపూట దివ్వెలను చేతబట్టి ఏమి వెతుకుతున్నావు. నీకు ఏమి కావా"లని ప్రశ్నించాడు. దానికి ఫకీరు "నేను మానవుల్ని వెదుకుతున్నానయ్యా! ఇంత పెద్ద సమూహాలలో ఎంతగా గాలించినా ఒక్క మానవుడూ లభించటంలే"దని బదులు పలికాడు. ఆ వ్యక్తి ఆశ్చర్యంతో "నీకు మనుష్యులంటే తెలియటంలేదా, ఈ చుట్టూ ఉన్నవారు మనుజులు కాకపోతే ఎవరు?" అని కుతూహలంతో అడిగాడు. దానికి ఫకీరు కన్నులు మూసికొని "మనిషి అంటే - 1. ఇంద్రియాలకు దాసుడుకాక, ఇంద్రియాలకు అధిపతియై, వాటిని శాసించగల శాసనకర్త, 2.క్రోధాగ్నిలో పడి, తాను మండుతూ ఆ అగ్ని కణాలతో ఇతరులను కూడా నశింపచేసే ప్రయత్నం ఏనాడూ చేయనివాడు, 3. కామ వాసనలు లేనివాడు. ఈ మూడు లక్షణాలూ లేని శరీరధారులందరూ మృగములు, నరపశువులు"అంటూ ఫకీరు మానవుని పరిభాషను ఆ వ్యక్తి ద్వారా సమాజానికి తెలియజేశాడు.

ఈ జనారణ్యంలో ఈనాడు పై లక్షణాలు గల మానవుల ఆవశ్యకత ఎంతగానో ఉన్నది. పశుస్థాయినుండి నరుల స్థాయికి చేరటానికి పై మూడు లక్షణాలను అలవరచుకొనే సాధన చేయగల సాధకులుగా ప్రతి ఒక్కరూ తయారుకావాలి.

- ప్రజ్ఞాపురాణం నుండి

**జనం ఏమనుకుంటున్నారో పట్టించుకోకు. చేయదగిన పని జరిగిందో లేదో చూడు.**

# పద్మావతీ చరణ చారణ చక్రవర్తి

**"ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే...."** అని శ్రీకృష్ణపరమాత్మ గీతలో చెప్పినట్లు - ధర్మం దారి తప్పినప్పుడల్లా దేవదేవుడు భూలోకంలో జన్మించి ధర్మాన్ని పరిరక్షించుతాడు.

ఆవిధంగానే ప్రజలలో భక్తిభావం సన్నగిల్లి నాస్తికవాదం ప్రబలుతున్న తరుణంలో సత్పురుషులు జన్మించి ప్రజల మనసులలో జ్ఞానబీజాలు నాటి ముక్తి మార్గాన్ని చూపుతారు. అలాంటి సత్పురుషులలో జయదేవుడు అగ్రగణ్యుడు.

ఈయన పూరీజగన్నాథ క్షేత్రానికి దగ్గరలోగల తిందుబిల్వమనే గ్రామంలో జన్మించాడు. పూవు పుట్టగానే పరిమళించునన్నట్లు పూర్వజన్మ సుకృతం వలన జయదేవుడు పదహారు సంవత్సరాలైనా నిండకమునుపే "గీతగోవింద" రచన చేసి అందరి ప్రశంసలూ పొందాడు.

గీతగోవిందంలో శ్రీకృష్ణుని రాసక్రీడల వర్ణన సుమధురమైన శైలిలో కుసుమకోమలమైన భావాలతో సరళమైన భాషలో నడచి పండితులను, పామరులను ఆకర్షించగలిగింది.

"కలియుగంలో మానవులు తరించే సాధనం హరినామ సంకీర్తన ఒక్కటే" - అని శ్రీకృష్ణుడు ఉద్ధవునకు తెలిపిన విషయాన్ని జయదేవుడు తన కావ్యంలో చక్కగా వివరించాడు. శృంగారం, ఆధ్యాత్మికం సమపాళ్లలో కలసి ఉన్నందున సువర్ణానికి తావి అబ్బినట్లు అది మరింత ఆకర్షణ సంతరించుకున్నది.

ఏ ఇంట చూసినా, ఎవరి నోట విన్నా గీతగోవిందంలోని శ్లోకాలే. ఇది ఆ దేశపు రాజైన సాత్విక మహారాజుకు కంటగింపైంది. ఎందుకంటే, జయదేవుడిలాగే అతను కూడా శ్రీకృష్ణుని లీలా వైభవాలను వర్ణిస్తూ పద్యరూపంలో ఒక గ్రంథం రాశాడు. కానీ అది గీతగోవిందమంత ఆదరణ పొందలేదు. ఇది అవమానకరంగా భావించి ఆ రాజు గీతగోవిందాన్ని ఎవరూ చదవరాదని, తన కావ్యాన్ని మాత్రమే చదవాలని శాసించాడు.

రాజ శాసనం ప్రజలకు ఆగ్రహం తెప్పించింది. ఎవరికి నచ్చిన గ్రంథం వారు చదువుకుంటారు, ఇందులో రాజు పెత్తనమేమిటని వారిలో వారు కూడబలుక్కొని కొంతమంది పండితులు రాజ సభకు వెళ్లారు. "మహారాజా! మీరు విధించిన ఆంక్ష అనుచితమైనది. సర్వజ్ఞులైనవారు తమ గొప్పతనాన్ని తాము కీర్తించుకొనరు. విద్య, గురుమంత్రం, బ్రహ్మజ్ఞానం, హరికీర్తన, జాతిరత్నం - వీటిని అమ్మ చూపితే వీటి విలువపోతుంది. అలాగే నేను మహారాజును కనుక నాగ్రంథాన్నే ప్రజలందరూ మెచ్చుకోవాలన్న కోరిక దురహంకారపూరితమైనది. జగన్నాథుడు దీనిని మెచ్చడు.'' అని నివేదించారు.

పండితుల మాటలతో రాజుకు అగ్నిలో ఆజ్యం పోసినట్లయింది. "మారు మాట లేకుండా నా ఆజ్ఞను శిరసావహించవలసింది పోయి తగుదుమమ్మా అంటూ నీతులు చెప్పబోవడమా! నా గ్రంథం ప్రీతికరమో కాదో చెప్పవలసింది జగన్నాథుడుగాని మీరు కాదు. జయదేవుడి మీద ఉన్న పక్షపాత బుద్ధితో నా గ్రంథాన్ని విమర్శించినంత మాత్రాన అది అయోగ్యమైనది కాబోదు. జయదేవుడు శ్రీకృష్ణపరమాత్మను ఎంత భక్తితో వర్ణించాడో అంతకన్నా ఎక్కువ భక్తితోనే నేను వర్ణించాను. మీరు ఏ పరీక్ష పెట్టి అయినా ఈ విషయం రుజువు చేసుకోవచ్చు.'' అని గర్వంగా పలికాడు రాజు.

"అలా అయితే ఈ సమస్యను జగన్నాథుడికే వదిలి పెడదాం, ఆయనే పరిష్కరిస్తాడు'' - అని పండితులంతా నిశ్చయించుకొని ఆరోజు రాత్రి నిత్య పూజలైన తర్వాత ఇద్దరి గ్రంథాలను గర్భ గుడిలో ఉంచి తాళాలు వేసి వెళ్లిపోయారు.

మరునాటి ఉదయం ప్రభాతసేవా సమయానికి ప్రజలు తండోపతండాలుగా ఆలయం వద్ద గుమిగూడారు. ఇది చాలా విచిత్రమైన పరీక్ష కదా మరి! ఇంతవరకూ ఉత్తమ గ్రంథాల హెచ్చుతగ్గుల విషయం పండితులే నిర్ణయించేవారు. ఈసారి పరీక్షకుడు సాక్షాత్తూ భగవంతుడే అయినాడు. ఇది అపూర్వ విషయం కదా!

అర్చకులు తాళాలు తీసి ఆలయ ద్వారాలు తెరిచారు. అక్కడి దృశ్యం చూసిన ప్రజలు ఆనందాశ్చర్యాలతో జయజయధ్వానాలు చేశారు. జగన్నాథుని పాదాల వద్ద గీతగోవింద కావ్యం పూజా కుసుమంలా అమరిఉంది. సాత్వికరాజు గ్రంథం గర్భగుడి గడపకు అవతల పడిఉన్నది.

రాజు సిగ్గుతో తల వంచుకున్నాడు. పండితులు రాజును చూసి, "రాజా! భగవంతుడు చూపిన నిదర్శనం మీరు కళ్లారా చూశారుకదా. పాలు-నీరు, వేదాంతం-కొక్కోకశాస్త్రం,

**మన సిద్ధాంతాలే గొప్పవని తలచి ఇతరులను విమర్శించడం తగని పని.**

బంగారం-లోహం ఎలా సమానం కావో అలాగే మీ గ్రంథమూ, గీతగోవిందమూ సమానం కావు.'' అన్నారు.

రాజు లజ్జావమానాలతో వారికి బదులు చెప్పలేక దేవుని ఎదుట నిలబడి "ఓ జగన్నాథా! నీ నిర్ణయం నేను భరించలేను. మేమిద్దరమూ నీకు భక్తులమే అయినా ఒకరిని గౌరవించి మరొకరిని అవమాన పరచావు. జయదేవుని కలంనుండి వెలువడిన రసవంతమైన పలుకులు నాతో ఎందుకు పలికించలేదు? ఓ అనంతా! ఈ అవమానం నేను భరించలేను.'' - అని ఒరనుండి కత్తి తీసి తన శిరస్సు ఖండించుకోబోయాడు. వెంటనే జగన్నాథస్వామి ప్రత్యక్షమై అతనిని వారించి, "వత్సా! నామీద నీకెంత భక్తి ఉన్నా నీవు అహంకార రహితుడవు కాలేదు. అందుకే నీ గ్రంథాన్ని నేను స్వీకరించలేదు.'' అని చెప్పి, అతని గ్రంథంలోని 24 శ్లోకాలను జయదేవుని గ్రంథంలో చేర్చి, రాజును తృప్తి పరిచాడు.

(★ ★ ★

ఈ సంఘటనతో జయదేవుని కీర్తి నలుదిశలా వ్యాపించింది. దూర దూర ప్రాంతాల జనులు జయదేవుని శిష్యులుగా మారసాగారు. వారిలో గోవిందదాసనే ఒక ధనవంతునికి గురువుగారిని తన ఇంటికి తీసుకువెళ్లి సన్మానించాలని కోరిక కలిగింది. అందుకు జయదేవుని అనుమతి తీసుకొని, రథంపై ఆయనను తన గ్రామానికి తీసుకువెళ్లాడు.

తన ఇంట్లో కొన్నాళ్లు ఉంచుకొని కావలసిన ఉపచారాలన్నీ చేశాడు. తిరిగి పంపేటప్పుడు గురుదక్షిణగా ఏమివ్వాలా అని ఆలోచించాడు. మట్టినీ బంగారాన్నీ సమానంగా చూసే జయదేవుడు తానేమిచ్చినా స్వీకరించరని గురుపత్ని అయిన పద్మావతీదేవికి విలువైన చీరలు, బంగారు నగలు మూటకట్టి రథంలో పెట్టాడు. ఊరివెలుపలిదాకా సాగనంపి ఇంటికి వెళ్లి పోయాడు. ఈ సంగతి పసిగట్టిన ఇద్దరు దొంగలు వీలుచూసుకొని వాటిని కాజెయ్యాలన్న ఆలోచనతో ఆ రథాన్ని వెంబడించసాగారు. ఇదేమీ తెలియని జయదేవుడు భగవన్నామస్మరణ చేసుకుంటూ రథం తోలుకు పోసాగాడు. కొంత దూరం పోయిన తర్వాత ఒక కీకారణ్యం ఎదురైంది. ఇంతకన్నా మంచి అవకాశం దొరకదని దొంగలిద్దరూ అమాంతం జయదేవుని మీద పడి ఆయన కాళ్లూ చేతులూ నరికి అక్కడ ఉన్న పాడుబడిన బావిలో ఆయనను పడవేసి రథాన్ని తోలుకుపోయారు.

ఆకలి దప్పులతో, గాయాల బాధతో జయదేవుడు "పాండురంగా! జగన్నాథా! పతితపావనా!'' అంటూ భగవంతుని ప్రార్థించసాగాడు. భగవంతుడు ఆయన మొర ఆలకించాడా అన్నట్లు అదే సమయానికి పొరుగుదేశపు రాజు క్రౌంచభూపతి వేటాడుతూ అక్కడికి వచ్చాడు. పాడుబడిన బావిలో నుండి దైవప్రార్థన వినిపించగా, ఆశ్చర్యపడి బావిలోనికి తొంగి చూశాడు. ధ్యాన ముద్రలో ఉన్న జయదేవుని చూసి "ఈయన ఎవరో గొప్ప తపశ్శాలిలా ఉన్నారు!'' అనుకొని, సేవకులతో ఆయనను పైకి తీయించాడు.

"మహానుభావా! మీవంటి పుణ్యమూర్తులకు ఇంత ఘోరం తలపెట్టిన దుర్మార్గులెవరో చెప్పండి. వారిని పట్టి తెప్పించి మీముందే ముక్కలు ముక్కలుగా నరికిస్తాను'' - అన్నాడు ఎంతో ఆవేదనగా. అందుకు జయదేవుడు చిరునవ్వు నవ్వి, "రాజా! ఇది నా పూర్వజన్మ పాప ఫలితమేగాని ఇతరులు చేసినది కాదు.'' అన్నాడు. జయదేవుని క్షమాగుణానికి మరింత ఆశ్చర్యపడుతూ ఆ రాజు "స్వామీ! నా కోర్కె మన్నించి నా వెంట మా రాజ్యానికి దయచేయండి. నన్ను మీ శిష్యునిగా స్వీకరించి ధన్యుడను చేయండి'' - అని వేడు కున్నాడు.

రాజధానికి వెళ్లిన తర్వాత క్రౌంచరాజు గొప్ప గొప్ప వైద్యులను పిలిపించి ఆయన గాయాలకు చికిత్స చేయించాడు. తన సింహాసనం ప్రక్కనే మరొక ఉన్నతాసనం వేయించి, అందులో జయదేవుని కూర్చుండబెట్టుకొని ఆయన సలహాలను అనుసరిస్తూ రాజ్యం చేయసాగాడు.

★ ★ ★

కొంతకాలం గడిచిన తర్వాత ఒకరోజున క్రౌంచరాజు జయదేవుడికి సాష్టాంగ నమస్కారం చేసి "స్వామీ! ఎన్నోరోజులుగా నాకు తరణోపాయం గురించి తెలుసుకోవాలనే కోరిక ఉన్నది. దయచేసి నా జన్మ సార్థకమయే ఉపాయం ఏదైనా చెప్పండి'' - అని అడిగాడు. అందుకు జయదేవుడు "నాయనా! భక్తజనుల సేవకు మించిన తరణోపాయం మరొకటి లేదు.'' - అని చెప్పాడు.

అది విని క్రౌంచరాజు "గురుదేవా! భక్తుల లక్షణాలను, వారిని సేవించే విధానాన్ని వివరంగా చెప్పండి.'' - అని అడిగాడు. అతని ప్రశ్నకు సంతోషపడి జయదేవుడు ఇలా చెప్పాడు -

"రాజా! తామరాకుమీది నీటి బొట్టువలె ఇహలోక సుఖాలను దగ్గరకు రానీయక ఎల్లవేళలా శ్రీకృష్ణుని పాదారవిందములపై మనస్సు నిలిపి జీవించేవారే నిజమైన భక్తులు. ఉత్తములను భరించి అధములను విసర్జించాలనే స్వభావం భూదేవికి లేనట్లుగా, గోవు దాహము తీర్చి, క్రూరమృగాలను విషమై చంపాలనే స్వభావం జలమునకు లేనట్లుగా, ఇంటిలోని వారికి మాత్రం వెలుగునిచ్చి

**దుబారా ఖర్చు అనే విషబీజం అనైతికత,దారిద్ర్యం,దుర్వ్యసనాల రూపంలో మొలకెత్తుతుంది.**

ఇతరులకు చీకటి కలిగించు తలంపు దీపమునకు లేనట్లుగా, తన్ను గొడ్డలితో నరుకువానికీ నీరు పోసి పెంచు వానికీ సమానంగా నీడనిచ్చే గుణం వృక్షమునకు ఉన్నట్లుగా - శత్రువులు, మిత్రులు అన్న భేదభావం లేకుండా అందరినీ సమానంగా గౌరవించి ఆదరించేవారే నిజమైన భక్తులు. అటువంటి వారికి సేవ చేసినట్లయితే ధర్మములయందు శ్రద్ధా, దానివలన విమల జ్ఞానమూ, తద్వారా ఈశ్వరుని యందు దృఢమైన భక్తీ కలుగుతాయి.''

ఆరోజు నుండీ క్రౌంచరాజు తన దగ్గరకు వచ్చిన భక్తులకు కావలసిన సౌకర్యములన్నీ ఏర్పాటు చేసి వారు కోరిన దక్షిణ లిచ్చి సత్కరించసాగాడు. కొద్దిరోజులలోనే అతని కీర్తి నాలుగు ప్రక్కలా వ్యాపించింది. దేశం నలుమూలల నుండీ భక్తులు వచ్చి సన్మానాలందుకొని సంతోషంగా వెళ్లసాగారు.

జయదేవుని దోచుకున్న దొంగలు ఈ విషయం తెలుసుకొని, దక్షిణ రూపంలో కావలసినంత బంగారం తెచ్చుకోవచ్చునన్న దురాశతో వేషాలు మార్చారు. మెడలో తులసి మాలలు, నుదుట చందన తిలకం, చేతిలో జపమాలలతో మహాభక్తుల్లా వైరాగ్యం ప్రదర్శిస్తూ రాజమందిరానికి వెళ్లారు.

రాజు ప్రక్కనే ఉన్నతాసనం మీద కూర్చొనిఉన్న జయదేవుని చూస్తూనే దొంగలిద్దరూ నిర్ఘాంతపోయారు. తెలియక అగ్ని గుండంలోకి వచ్చిపడ్డామే అని కలవర పడిపోసాగారు. వెనక్కు తిరిగి వెళ్లే వీలులేదు. ఏమి చేయడానికీ తోచక శిలల్లా నిలబడ్డ దొంగలను చూసి జయదేవుడు రాజుతో - "వీరు మహాత్ములు, వీరికి ప్రత్యేక శ్రద్ధతో సేవలు చేసి వీరిని ఘనంగా సన్మానించు.'' - అని చెప్పారు.

గురుదేవులే మహాత్ములని పొగడిన వారు ఎంతటి ఘనులో అనుకొని క్రౌంచరాజు సింహాసనం దిగి వారిద్దరికీ సాష్టాంగ నమస్కారం చేసి "తమ కిష్టమైనంత కాలం ఇక్కడ సుఖంగా ఉండవచ్చు.'' - అన్నాడు. ఎంత తొందరగా అక్కడనుండి బయట పడితే అంత మంచిదని ఆలోచిస్తున్న దొంగలు "రాజా! మేము తీర్థయాత్రికులం. ఒక ప్రదేశంలో ఒక రోజుకన్నా ఎక్కువ ఉండరాదన్నది మా నియమం. భక్తులకు నీవు చేస్తున్న సేవా సత్కారాల గురించి విని నిన్ను ఆశీర్వదించి పోవాలని వచ్చాము.'' - అన్నారు.

"అలాగయితే నేనిచ్చే కానుకలైనా స్వీకరించి నన్ను కృతార్థుడను చేయండి.'' - అని రాజు అనగా, "దారి ఖర్చులకు కొంత బంగారం మాత్రం ఇవ్వండి చాలు.'' అని ఆదొంగలు అన్నారు - ఎంత త్వరగా అక్కడనుండి వెళ్లిపోవాలా అని చూస్తూ. రాజు బంగారంతో పాటు విలువైన పట్టుశాలువలు కూడా ఇచ్చి, రథం మీద రాజధాని వెలుపలి వరకూ సాగనంపి రమ్మని ఇద్దరు రాజభటులను వాళ్ళవెంట పంపాడు.

దారిలో రాజభటులు దొంగలతో "అయ్యా! మారాజుగారి దగ్గరకు ఎంతోమంది భక్తులు వస్తున్నారు గాని జయదేవులవారు మీమీద చూపిన గౌరవ మర్యాదలు ఇంతకు ముందు ఎవరిమీదా చూపించలేదు. దీనికేమి కారణమేమో తెలుపండి.'' - అని కుతూహలంగా అడిగారు.

అందుకు దొంగలు ఏమాత్రం తొట్రుపాటు చెందక, "ఇంతకుముందు ఒక రాజు దగ్గర జయదేవుడు, మేము సేవకులుగా కొలువు చేసేవాళ్లం. ఒకరోజు జయదేవుడు తోటలో విహరిస్తున్న రాణిని చూసి మోహంతో ఆమెను బలాత్కరించబోయాడు. అది తెలిసి రాజు శిరచ్ఛేదన చేయమని అతడిని మా కప్పగించాడు. రాజాజ్ఞ ఉల్లంఘించరాదు కదా! అతడిని అడవికి తీసుకువెళ్లి ప్రాణాలు తీయడానికి చేతులు రాక కాళ్లూ చేతులూ నరికి అక్కడే ఉన్న పాడుబడిన బావిలో పడవేసి వెళ్లిపోయాము. తోటివాడికి అంతటి కష్టం దాపురించిందే అని మాకు జీవితాల మీద విరక్తి కలిగి, యాత్రలు చేస్తూ తిరుగుతున్నాము. ప్రాణదానం చేసిన ఉపకారం గుర్తుండి జయదేవుడు మామీద అంత గౌరవం చూపాడు.....'' అంటూ వాళ్లు చెపుతూ ఉండగానే ఫెళఫెళమంటూ భూమి రెండుగా చీలి దొంగలిద్దరూ రథంతో సహా అందులోకి దిగిపోయారు.

భటులు భయంతో గజగజ వణికి పోతూ పరుగెత్తుకొని వచ్చి రాజుతో జరిగినదంతా చెప్పారు. రాజూ, జయదేవుడూ ఆశ్చర్యపడుతూ భటులు చెప్పిన స్థలానికి వెళ్లారు. నా కారణంగా ఇద్దరూ సజీవ సమాధి అయినారే అని బాధ పడుతూ జయదేవుడు, "శ్రీకృష్ణా! పతితపావనా! భక్తవత్సలా! నీకు విరోధి అయిన రావణునకు సాయుజ్యమిచ్చావు. నిన్ను దుర్భాషలాడిన శిశుపాలుని నీలో ఐక్యం చేసుకున్నావు. మరి నా శత్రువులకు అధోగతి కలిగించటం ధర్మమా?'' - అని ప్రార్థించాడు.

అతని ప్రార్థనకు మెచ్చిన విష్ణుమూర్తి ప్రసన్నవదనంతో ప్రత్యక్షమయ్యాడు. "జయదేవా! నీజన్మ ధన్యమైంది. దయ, క్షమ, శాంతి మూర్తీభవించి ఉన్న నీవంటి వారికి నేను అధీనుడను. నీ కోరిక ప్రకారం దొంగలకు వైకుంఠప్రాప్తి కలిగిస్తాను.'' - అని చెప్పి జయదేవునికి యథాప్రకారం కాళ్లు చేతులూ వచ్చేలా ఆశీర్వదించి అంతర్థానమయ్యాడు.

**దుఃఖాలకు కారణం కోరికలు. అవి తొలగగానే ఆనందం లభిస్తుంది.**

ఒకదాని తర్వాత ఒకటిగా జరుగుతున్న విచిత్ర సంఘటనలను చూస్తూ ఉంటే క్రౌంచరాజుకు ఆశ్చర్యంతో మతి పోసాగింది. "మహానుభావా! మీవంటివారి సేవ లభించడం నా పూర్వజన్మ సుకృతంగాని మరొకటి కాదు. ఇప్పుడైనా మీగురించి వివరంగా తెలుపండి." - అని జయదేవుని అడిగి విషయమంతా తెలుసుకున్నాడు. "ఇన్ని రోజులుగా మీజాడ తెలియక పద్మావతీదేవి ఎంత తల్లడిల్లిపోతున్నదో కదా!" - అని బాధపడ్డాడు. పల్లకీ పంపి ఆమెను రాజమర్యాదలతో పిలిపించాడు. అంతఃపురానికి తీసుకువెళ్లి రాణితో "పద్మావతీదేవి మనకు తల్లి వంటిది. ఆమె సేవలన్నీ స్వయంగా నీవే చేయాలి."- అని ఆజ్ఞాపించి వచ్చాడు. రాణి కూడా ఎంతో భక్తి శ్రద్ధలతో గురుపత్నిని సేవించుకొన సాగింది.

★ ★ ★

ఒకరోజు అంతఃపురంలో స్త్రీలంతా ఒక చోట చేరి ముచ్చట్లాడుకుంటూ ఉండగా, రాజభటుడు వచ్చి రాణిగారి సోదరుడు మరణించినాడని, వదినగారు భర్తతోపాటు సహగమనం చేసిందని వార్త చెప్పి వెళ్లాడు. అక్కడున్న స్త్రీలంతా ఆమె పతిభక్తిని వేనోళ్ల కొనియాడారు. మహాపతివ్రత కాబట్టి సహగమనం చేయగలిగింది. సామాన్యులకి అంత త్యాగం సాధ్యపడుతుందా! ఆమె స్త్రీలకు శిరోమణి వంటిది, మహాసాధ్వి...! అని ప్రశంసించారు. అందరూ అన్ని విధాలుగా కొనియాడుతున్నా పద్మావతీదేవి మాత్రం పెదవి విప్పక మౌనంగా ఉన్నది.

అది చూసి రాణి "తల్లీ! మా వదిన చేసిన త్యాగం మీకు అబ్బుర మనిపించలేదా? భర్తతో సజీవదహనం కావడమన్నది సామాన్య విషయం కాదు కదా!" అని అడిగింది. అందుకు పద్మావతీదేవి "భర్త చనిపోయిన తర్వాత బలవంతంగా ప్రాణాలు తీసుకోవడం మహాపాపం కాదా! పతివ్రత అయిన స్త్రీ భర్త మరణవార్త విన్న తక్షణమే, సూర్యుడు అస్తమించగానే అతని కిరణాలు అదృశ్యమైనట్లు, సునాయాసంగా ప్రాణం విడువగలగాలి."- అని అన్నది.

రాణి మనసులో "అనుభవంలేక, చిన్నతనం వల్ల ఇలా చెపుతున్నదిగాని, నిజంగా ఎంత పతివ్రత అయినా అలా చేయగలదా! అంత తేలికగా ఇచ్ఛా మాత్రంగా ప్రాణం విడువగలగడమన్నది అసాధ్యమయిన విషయం. అలా ఎక్కడా జరుగదు. ఆ విషయం ఆమెకు రుజువు చేయాలి. ఆమెతోనే ఔననిపించాలి." - అని నిర్ణయించుకున్నది. సమయం కోసం ఎదురు చూడసాగింది.

★ ★ ★

కొన్నాళ్లు జరిగిన తర్వాత ఒకరోజు క్రౌంచభూపతి వేటకు వెళుతూ జయదేవుని వెంటబెట్టుకొని వెళ్లాడు.

ఇదే మంచి సమయమని తలచి రాణి రహస్యంగా మంత్రిని పిలిపించింది. తన పన్నాగం వివరించి ఏమి చేయాలో చెప్పింది. ఆమె చెప్పినట్లే కొంత సేపటికి మంత్రి పంపిన రాజభటుడు పరుగు పరుగున అంతఃపురానికి వచ్చి రాణితో "అమ్మా! ఘోరం జరిగిపోయింది. గురుదేవులవారిని ఒక పులి పొట్టన పెట్టుకున్నది."- అని రక్తంతో తడిసిన వస్త్రాలు చూపాడు.

రాణి ఏమీ ఎరగనట్లు "నీవు చెప్పేది నిజమేనా?" అని అడిగింది. వాడు సత్యమని ప్రమాణం చేస్తుండగానే, అక్కడ ఉన్న పద్మావతీ దేవి "హా ప్రాణేశ్వరా!" అని కేకవేసి ప్రాణాలు విడిచింది. రాణి నిశ్చేష్టురాలై నోటమాట రాక నిలబడిపోయింది. పాపం! ఆమె ఇంత అనర్థం జరుగుతుందని ఊహించలేదు. అంతఃపురం శోక సముద్రంలో మునిగిపోయింది.

వేటనుండి వచ్చిన క్రౌంచరాజు జరిగిన సంగతి మంత్రి ద్వారా తెలుసుకున్నాడు. దీని కంతటికీ కారణమైన రాణిని చంపి తర్వాత తాను కూడా చనిపోవాలని ఒరనుండి కత్తి తీసి అంతఃపురానికి బయలుదేరాడు. స్త్రీహత్య, ఆత్మహత్య మహాపాపకార్యాలని తొందరపడవద్దని రాజుకు నచ్చచెపుతూ జయదేవుడు పద్మావతీదేవి శవం దగ్గరకు వెళ్లాడు.

తంబురా, చిరుతలు తీసుకొని అష్టపదులతో భగవంతుని సంకీర్తనం చేయసాగాడు. ఆర్తితో ప్రార్థిస్తూన్న జయదేవుని ఎదుట రుక్మిణీ రమణుడు ప్రత్యక్షమై "భక్తాగ్రగణ్యా! నీ అష్టపదుల గానం నన్నెంతో ఆనందపరిచింది. పద్మావతీదేవికి దీర్ఘాయుష్షును ప్రసాదిస్తున్నాను." - అని ఆశీర్వదించగానే ఆమె నిద్ర నుండి మేల్కొన్నట్లు కనులు తెరిచింది.

"ఆహా! భక్తి మహిమ తెలుసుకోవటం బ్రహ్మాదులకైనా సాధ్యం కాదుగదా!" అని అక్కడ ఉన్న వారందరూ జయజయ ధ్వానాలు చేశారు. ఆకాశం నుండి దేవతలు పుష్పవృష్టి కురిపించారు.

జయదేవుడు తనను తాను "పద్మావతీ చరణ చారణ చక్రవర్తి"గా (పద్మావతికి కాళ్లుపట్టే చక్రవర్తిగా) వర్ణించుకోవడం కూడా సముచితమే కదా!

- విజయకుమారి

☆☆☆

**తపన,కరుణ,క్రియాశీలత కలిగిన వాడే నిజమైన భక్తుడు.**

## గాయత్రీ మంత్రం

# సవితా దేవతతో కలిపే టెక్నాలజీ

శక్తి కేంద్రాన్ని గురించి తెలుసుకోవడం పెద్ద విశేషం ఏమీ కాదు. అది సదుపయోగం కానప్పుడు దానితో సంబంధం నిరుపయోగమే అవుతుంది. పవర్ హౌస్‌తో కనెక్టుచేసి బల్బులు వెలిగించటం, ఫాన్లు తిప్పటం, హీటర్లు, కూలర్లు పనిచేయించడం మొదలైన వాటిలో సాంకేతిక నైపుణ్యం హస్తం ఉంటుంది. పవర్ హౌస్ ద్వారా కావలసినంత విద్యుత్తు సరఫరా అవుతున్నా, టెక్నాలజీ లేకపోతే ఉపకరణాలన్నీ నిష్క్రియంగా, నిర్జీవంగా పడిఉండవలసిందే. అక్షయ శక్తికేంద్రమైన పరదేవత సవిత విషయంలో గూడా - క్రియాత్మక, ఆలోచనాత్మక, భావనాత్మక శక్తుల ఈ నిరంతర ప్రవాహం ఉండి గూడా మానవీయ పరికరంలో నిష్క్రియత, మూఢత, నిష్ఠురత నిలిచి ఉండడం సంబంధ సూత్రం లేదన్న విషయాన్ని స్పష్టం చేస్తుంది.

ఈ సంబంధ సూత్రం ఏవిధంగా జోడింపబడి, ప్రగాఢ మవుతుంది? ఈ విషయంలో పురాతన వైజ్ఞానికులు, ఋషులు లోతుగా అన్వేషించారు. ఈ శోధన ప్రయత్నాల ఫలితం గాయత్రీ మంత్రం. వైదిక వాఙ్మయంలో దీనిని మంత్ర శిరోమణిగా పరమశ్రేష్ఠ మంత్రంగా పోషించడానికి వెనుక కారణం ఇదే. మంత్ర శబ్దముల గుదిగుచ్చటం వైజ్ఞానిక రీతిలో జరిగింది. దీనిని జపించటం వల్ల సాధకుని అంతశ్చేతనలో నిద్రిస్తూన్న సూక్ష్మమండలంపై వ్రేటు పడుతుంది. నిద్రాణమై ఉన్నది జాగృతమవుతుంది. సౌరచేతన అవిరళ ప్రవాహం అస్తిత్వంలోనికి ప్రవహించటం ప్రారంభిస్తుంది. శక్తి కేంద్రముల భాండాగారం తెరుచుకుంటుంది. అంతర్జాగరణ సూర్యదేవుని సంపర్కంతో కలసి, అసామాన్య, అద్భుత గుణములు కలిగిన సామర్థ్యం సమకూరుతుంది.

ఇది వైజ్ఞానిక, క్రియాత్మక పక్షముల కన్నా ఆలోచనాత్మక పక్షంలో మరింత మహత్తరమైనది. ఇందులో జీవనము, జీవనమునకు సంబంధించిన చిన్న, పెద్ద సమస్యల సమాధానం ఇమిడి ఉన్నవి. మంత్రంలో సన్నిహితమైన తత్త్వదర్శనమునందు సృష్టియందలి ఈశ్వర - జీవ - ప్రకృతి సంబంధములను గురించిన రహస్యములను, తథ్యములను నిరూపణచేసే సామర్థ్యం ఉన్నది. మంత్రము నందలి 24 అక్షరములలో నిండియున్న తత్త్వజ్ఞాన చింతన, మననములు శాస్త్రకారులచేత వర్ణింపబడిన ఆత్మజ్ఞాన, బ్రహ్మజ్ఞానముల కేంద్రం వద్దకు తీసుకుపోగలుగుతాయి.

వైజ్ఞానిక, ఆలోచనాత్మక పక్షములతో పోలిస్తే, గాయత్రీ మంత్రపు భావ పక్షము మరింత ప్రేరణాదాయకము, సమర్థవంతము, ప్రభావశాలీగూడా. విశ్వమందలి ఏ ఇతర సంస్కృతిలోనూ 24 అక్షరములలో బ్రహ్మవిద్య, సాధనా విజ్ఞానముల ఇంతటి సమగ్ర దర్శనము లభ్యం కాదు. భావసంవేదనల పరాకాష్ఠ దర్శనం ఎక్కడైనా కలుగుతుందంటే, అది ఒక్క గాయత్రీ మంత్రంలో మాత్రమే. దీని గంభీర ప్రయోగం సాధకునికి, సూర్యునికి మధ్య ఇచ్చి పుచ్చుకునే ప్రక్రియను ప్రారంభించటం మాత్రమే గాక, విశ్వమందలి భావప్రవాహమునంతటినీ కదిలించి వేసే సామర్థ్యాన్ని కలిగిస్తుంది.

సవితా దేవతతో స్వయంగా విలీనం కాగల సాంకేతిక రహస్యం ఇది. గాయత్రీ మంత్రంలోని సవితా శబ్దం "షఙ్ప్రాణ గర్భ విమోచనే యాషుప్రేరణో" ధాతువు నుండి తయారైనది. "షఙ్" ధాతువుతో తయారైన తర్వాత, యః నుతే చరాచర జగదుత్పాదయతి స స్వతా, ఎవరు చరాచర జగత్తును ఉత్పత్తి చేస్తారో, ఆయన సవిత. "షూ" ధాతువు తయారైన తరువాత "యఃసువతి, ప్రేయతి, సర్వాన్ సస్వతా", అందరనూ సన్మార్గము దిశకు ప్రేరేపించునది సవిత. ఈ అర్థములన్నిటిని అనుసరించి - జడ చేతనముల నన్నిటినీ ఉత్పత్తి చేయునది, అందరను పవిత్రులను చేయునది, శ్రేష్ఠమార్గం దిశకు ప్రేరణ చేయునది సవిత. సూర్యుని ఒక పేరు సవిత. సూర్యుడు స్వయంగా ప్రకాశవంతుడు. ఇతరములను ప్రకాశింప జేయువాడు. ఈ విధంగా సవితా దేవత స్వయంగా ప్రకాశపుంజమేగాక అందరిలోనూ తన కాంతిని ప్రవేశపెట్టేది. గాయత్రీ మంత్రాన్ని ఆధారంగా చేసుకుని, సవితా సాధన చేసే వ్యక్తిగూడా ఈ ఉదాత్త భావనలతో సంపన్నుడు కాగలుగుతాడు.

మంత్రంలో మూడు చరణాలున్నాయి. మూడింటిలోనూ దివ్య ప్రేరణలు పొంగిపొరలుతూ ఉంటాయి. వాటిని సాధకుడు ఆహ్వానించి, అవగాహన చేసుకుంటాడు. తన ధారణాశక్తిని వికసింప చేసుకుంటాడు. ప్రథమ చరణంలో "తత్సవితుర్వరేణ్యం" పృథివియందు, అంతరిక్షమునందు, ద్యులోకమునందు,

**ఈశ్వర సృష్టిలోని శ్రేష్ఠ ప్రాణి మనిషి.**

అగ్నియందు, విద్యుత్తునందు, సూర్యునియందు, సర్వత్రా సవితా భగవానుని తేజము వ్యాపించియున్నది. తన భావ నేత్రములతో సవితను ప్రకాశపుంజ రూపంలో ఎల్లప్పుడూ ఉపాసన చేస్తూ సాధకుడు భావ విహ్వలుడై నిలుస్తాడు. సవిత యొక్క ఉజ్వల, పవిత్ర జ్యోతి ఒక అనిర్వచనీయ ఆనందంలో మునకలు వేయిస్తుంది. ఈ దివ్యానుభూతి గుణగానం ఉపనిషత్తులలో గూడా లభిస్తుంది.

నతత్ర సూర్యోభాతి న చంద్ర తారకా
నేమావిద్యుతో భాంతికుతో యమగ్నిః
తమేవ భాంతమనుభాంతి సర్వే
తస్యయాసాసర్వమిదం విభాతి.

(కఠ, ముండక, శ్వేతాశ్వతర)

అనగా - దాని దివ్యజ్యోతి ఎటువంటిదీ అంటే, దాని సమక్షంలో సూర్యుడు, చంద్రుడు, తారలు అన్నీ వెలవెలబోతాయి. విద్యుత్తు మెరుపు దానిముందు సాటిరాదంటే యిక అగ్ని మాట చెప్పేదేమున్నది? అట్టి మహాజ్యోతి పుంజము నుండియే ప్రకాశమును పొంది అన్నీ వెలుగొందుతున్నాయి.

ఆ దివ్యజ్యోతి అవగాహన, ఆరాధన సవితా సాధకుడు చేస్తాడు. ఆ వరింపతగిన జ్యోతిని అధికాధికంగా ధారణ చేయాలని కోరుకుంటాడు.

ప్రథమ చరణంలో సవిత రూపంలో ఆ పరమశక్తి గుణములు వర్ణింపబడ్డాయి. దాని స్తుతి చేసి సాధకుడు గర్వించి, చేతులు ముడుచుకుని కూర్చోడు. స్తుతి తరువాత ప్రార్థనా క్రమం ఉన్నది. సవిత ప్రకాశాన్ని స్తుతించిన తరువాత సాధకుడు "భర్గోదేవస్య ధీమహి'' అంటాడు. అంటే ఎవరి దివ్యగుణములను గూర్చి మనం ధ్యానం చేశామో, ఆయన మనయందు అవతరించుగాక. భక్తుడు భగవంతునితో, సాధకుడు సాధ్యముతో, ఉపాసకుడు ఉపాస్యదేవతతో, జీవుడు బ్రహ్మముతో తాదాత్మ్యం చెందటం, ఐక్యంకావడం దివ్యత్వ అవతరణ వల్లమాత్రమే కలుగుతుంది. మంత్రంలో ద్వితీయ చరణంలో ప్రార్థన **"హే ప్రకాశపుంజమా, పాపనాశకుడా, దివ్య ఆనందదాయక, పరమాత్మ స్వరూప సవితాదేవా! తాము మాయందు అవతరింతురు గాక. మేము తమ దివ్యగుణములను మాలో ధరిస్తున్నాము. తాము మాలో అవస్థితులై, తమ ప్రకాశమును మా అంతఃకరణలో వెలుగొంద జేయండి."** ఇది ఆధ్యాత్మ మూలధర్మము.

మంత్రం తృతీయ చరణంలో ఈ తథ్యపు స్పష్టీకరణ జరుగుతుంది. దైవీ గుణముల శక్తులను ఎందుకు ధరించాలి? "ధియో యోనః ప్రచోదయాత్''. అవి మా బుద్ధిని సన్మార్గము దిశకు ప్రేరేపించుగాక. బుద్ధి ఘోరాంధకారంలో నిద్రాణమై పడి ఉన్నది. దానికి మన లక్ష్యాన్ని గురించీ, కర్తవ్యాన్ని గురించీ తెలియదు. ప్రాపంచిక ఆకర్షణల యందు దారి తప్పి తిరుగుతూ తన గొప్పతనాన్ని ఎరుగదు. మంత్రం తృతీయ భాగంలో, ఈ ప్రార్థన చేయబడింది- **"ఓ సవితాదేవా! తమ దివ్యగుణములతోపాటు మా అంతఃకరణ యందు అవతరించి, బుద్ధిని అంధకారము నుండి ప్రకాశం దిశకు మరల్చండి".**

సూర్యుని ప్రకాశం ప్రాతఃకాలంలో తేజోవంతమైన బంగారు కిరణములతో పాటు వచ్చి నిదురపోతున్న ప్రాణులను మేలుకొల్పుతుంది. కర్మలయందు ప్రయుక్తులను చేస్తుంది. ఆవిధంగా సవితా దేవత ప్రకాశం గాయత్రీ సాధకుని అంతఃకరణలోనికి వచ్చి బుద్ధిని ప్రకాశితం చేస్తుంది. ప్రసుప్తమైన దానిని జాగృతరూపంలోనికి తెస్తుంది. బుద్ధిలో ప్రజ్ఞ అవతరణ జరుగుతుంది. అసత్యం, జడత్వము అనే చీకటిని పారద్రోలుతుంది. సత్, చైతన్యముల ప్రాదుర్భావం కలుగుతుంది. ప్రజ్ఞ దిశకు తిరిగిన బుద్ధి జడత బంధాలైన లోభ మోహముల ఆకర్షణలో బద్ధం కాదు. దాని "స్వ''యొక్క పరిధి సంకుచితంగా ఉండదు. "స్వ'', "వసుధైవకుటుంబకం'' రూపంలో విస్తరించడమే జీవిత ప్రయోజనం. సవిత దివ్య ప్రేరణలను గాయత్రీ మాధ్యమంతో ధరించి సాధకుడు ఈ లక్ష్యం దిశకు మరలుతాడు.

సవితా దేవతతోడి భావనాత్మక ఏకాత్మతను స్థాపించుకునే ఈ టెక్నాలజీ ఆశయం స్పష్టమే. దీనికి ఇంతటి గౌరవాస్పదమైన స్థానం ఎందుకు కలిగింది? ఇందులో ఏ వస్తువును గురించీ కోరిక లేదు. బుద్ధి నిర్మలంగా, పవిత్రంగా తయారై సన్మార్గం వైపుకు ప్రేరేపింపబడాలి. తన కోసం గాక అందరికోసం ప్రార్థన చేయబడింది. యోనః అంటే మా అందరికీ! వేదర్షి బావన - వ్యక్తికళ్యాణం లోకకళ్యాణంతో ముడిపడి ఉన్నదని.

సవితా భగవానుని క్రియాత్మక, ఆలోచనాత్మక, భావనాత్మక శక్తులను గ్రహణ, ధారణలు చేయడం అనే ఈ టెక్నిక్ ఎంతటి ఉదాత్తతను, పవిత్రతను కలిగించి మానవునికి కళ్యాణం చేకూర్చే శక్తిని కలిగిఉన్నది? మనన, చింతనలతోనే అంతఃకరణలో ఉదాత్త భావనలుబికి, వ్యక్తిత్వానికి కాయకల్పం జరుగుతుంది. గాయత్రీ మంత్రం ఆధారంగా చేయబడే సవితారాధన ఆత్మోత్కర్ష చరమశిఖరాన్ని అధిరోహింపజేస్తుంది.

అనువాదం : డి.వి.బి.ఎస్.విశ్వనాథ్

**గుణ కర్మ స్వభావాల సంస్కరణ ఆత్మకళ్యాణానికి ఆవశ్యకం.**

## మన సాంస్కృతిక వారసత్వం

# విశ్వమంతటా విస్తరించిన వేద విజ్ఞానం

వేదాలు భారతీయ సంస్కృతి జీవన ప్రవాహాలు. వైదిక జ్ఞానామృతం వలన శక్తివంతమైన భారతీయ సంస్కృతి తన వైభవాన్ని విస్తరించుకున్నది. విశ్వవ్యాప్తంగా ప్రశంసించబడుతున్న భారతీయ సంస్కృతీ సూత్రాలు, సత్యాలు, యథార్థాలన్నీ ఈ వేదాలనుండి ఉద్భవించినవే. అందువలననే భారతీయుల ఈ పద్ధతుల కారణంగా పాశ్చాత్య శాస్త్రవేత్తలు సైతం వైదిక జ్ఞాన గౌరవం ముందు తల వంచక తప్పలేదు. వారిలో చాలా మంది ఈ జ్ఞాన కోశాలను వారివారి భాషలలోనికి అనువదించి భాష్యం వ్రాసే ప్రయత్నం చేశారు. ఇలాంటి ప్రయత్నాలను 18వ శతాబ్దం చివరి దశకంలో సర్ విలియమ్ జోన్స్ ప్రారంభించాడు. ఆయన కలకత్తాలో 'రాయల్ ఏసియాటిక్ సొసైటీ'ని స్థాపించాడు. ఈ కేంద్రంలో సంస్కృత గ్రంథాల ఆంగ్ల అనువాదం ప్రారంభమైంది. వేదాల పట్ల జిజ్ఞాస చిగురించింది. తరువాత కోల్‌బ్రుక్ వైదిక అధ్యయన దీపాన్ని ప్రజ్వలింప చేశాడు. దీనితో పాశ్చాత్యులు ఇటువైపు ఆకర్షింపబడ్డారు.

కోల్‌బ్రుక్ 1805లో 'ఏసియాటిక్ రీసెర్చెస్' అనే పరిశోధనా గ్రంథం ఎనిమిదవ అంకంలో తను వేదాల మీద వ్రాసిన పరిశోధనా వ్యాసాన్ని ప్రచురించాడు. దీనితో పాటు ఆయన వైదిక గ్రంథాల వ్రాత ప్రతులను సంగ్రహించి లండన్ పంపించాడు. వాటిని సరియైన రీతిలో అధ్యయనం చేయడానికి అనేక పాశ్చాత్య శాస్త్రవేత్తలు భారత్ విచ్చేశారు. జర్మనీ నివాసి, ప్రసిద్ధ భాషా విజ్ఞాని ఫ్రాన్స్ బాప్ శిష్యుడు ఫ్రెడరిక్ రోజేన్ అందరి కంటే ముందుగా ఋగ్వేద సంపాదనా కార్యాన్ని ప్రారంభించాడు. ఆయన ఈ కార్యాన్ని క్రీ.శ.1830లో ప్రారంభించాడు. కాని ప్రథమాష్టక ప్రచురణ ముందే 1837 సెప్టెంబరు 12న మరణించాడు. 1838లో రోజేన్ ఋగ్వేద సంపాదకీయం "ఋగ్వేద సంహితా ప్రైమస్ సంస్కృత్ ఎన్ లాతనే" పేరుతో ప్రచురింపబడింది.

ఫ్రెడరిక్ రోజేన్ రచించిన ఈ గ్రంథం వైదిక అధ్యయనకారులకు ప్రామాణికంగా గౌరవింపబడింది. దీని సహాయంతోనే ప్రొ॥బర్నూఫ్ తన శిష్యులైన రాథ్,మాక్స్ ముల్లర్ మొదలయిన వారి చేత వేదాధ్యయనం చేయించేవాడు. దీని తరువాత బేవర్ మాధ్యాందిన శుక్ల యజుర్వేద సంహిత 9,10 అధ్యాయాలను లాటిన్ భాషలోనికి అనువదించి,దానికి భాష్యం వ్రాశాడు. ఇది క్రీ.శ.1846లో వాజసనేయీ సంహిత పేరుతో ప్రచురించబడింది. ప్రసిద్ధ ఫ్రాన్స్ శాస్త్రవేత్త లాంగ్ లూయిస్ సంపూర్ణ ఋగ్వేదాన్ని ఫ్రెంచి భాషలోనికి నాలుగు భాగాలుగా అనువదించాడు. ఇవి తరువాత గ్రంథంగా ప్రచురింపబడ్డాయి. లాంగ్ లూయిస్ వ్యాఖ్యాన పద్ధతి రోజేన్ వ్యాఖ్యాన పద్ధతికి భిన్నంగా ఉన్నది. అయితే రోజేన్ నుండి లాంగ్ లూయిస్ వరకు ఋగ్వేద వ్యాఖ్యానానికి ఆధారం శాయణ భాష్యమే.

19వ శతాబ్దంలో వేద విషయాల స్వతంత్ర చింతన ప్రారంభమైంది. దీనికి సూత్రధారి ప్రొఫెసర్ బర్నూఫ్. విశ్వంలోని అత్యంత ప్రాచీన గ్రంథాల రూపంలో వేదాల మీద యూరోపియన్ల అభిరుచి పెంచడమే ఆయన ముఖ్య లక్ష్యం. సమతూకం గల భాషా విజ్ఞానంతోనే వేదాలను స్పష్టంగా అర్థం చేసుకోగలమని ప్రొ॥బర్నూఫ్ స్పష్టం చేశాడు. వేదాధ్యయన విషయంలో ఇది ఒక గొప్ప సంఘటనగా చెప్పబడుతోంది. దీని ద్వారా వేదాధ్యయనంలో భారతీయం, పశ్చిమం అనే రెండు ఆలోచనాధారలు ఉత్పన్నమయ్యాయి. రెండింటిలోను అతివాద భాష్యకారులు కూడా ఉన్నారు. వారు ఒకరికొకరు బలమైన,కటువైన విమర్శకులు కూడా.

జర్మనీకి చెందిన మాక్స్ ముల్లర్ రాథ్‌కి సహ విద్యార్థి. ప్రొ॥బర్నూఫ్‌కు ప్రముఖ శిష్యుడు. ఈయన తన జీవితం మొత్తాన్ని వేదాధ్యయనానికే వెచ్చించాడు. క్రీ.శ.1849 నుండి 1875 వరకు సుమారు 26 సంవత్సరాలు విశ్రమించకుండా, కఠోర పరిశ్రమ చేసి మొత్తం ఋగ్వేద శాయణ భాష్యాన్ని పదపాఠంతో అనువదించాడు. వ్యాఖ్యను స్పష్టం చేయటం కోసం మూల పదాల్లోనే పాఠాన్ని శోధించే పాశ్చాత్య వేద భాష్యకారులను ఆయన వ్యతిరేకించాడు. ప్రొ॥మాక్స్ ముల్లర్ సమతూక భాషా విజ్ఞానాన్ని సమర్థించేవాడు. కాని రాథ్‌లాగా శాయణ భాష్య వ్యతిరేకి కాదు.

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన జనరల్ స్టీవెన్‌సన్ భారత దేశంలో భారతీయ విద్వాంసుల సహాయంతో వేద భాష్యాన్ని రచించాడు. ఆయన రాణానీయ శాఖకు చెందిన సామవేద సంహితను సర్వప్రథమంగా సంపాదించి ఆంగ్లంలోనికి అనువదించాడు. ఇది 1842లో లండన్‌లో ప్రచురింప బడింది. ఆ తరువాత రోయర్ ఋగ్వేదం ప్రథమాష్టకానికి చెందిన రెండు అధ్యాయాలు అనగా 32వ శ్లోకం వరకు ఆంగ్లంలోనికి అనువదించాడు. ఈ అనువాదం భారత్‌లోనే ప్రచురింపబడింది. రాథ్ శిష్యుడు హిటనీ సంపూర్ణ అథర్వణ వేద సంహితను ఆంగ్లంలోనికి అనువదించాడు. ఈ అనువాదం ఆయన మరణానంతరం 1894లో పూర్తయింది. ఆయన శిష్యుడు సి.ఆర్. లైన్‌మాన్ 1905లో దానిని ప్రచురించాడు. హిటనీ చేసిన ఈ అనువాదం ఇతర అనువాదాల కన్నా శ్రేష్ఠమైనదిగా పరిగణింపబడుతోంది.

ఇంగ్లండ్‌కు చెందిన సువిఖ్యాత పండితుడు విల్సన్ కూడా ఋగ్వేదం మీద పనిచేశాడు. దీని కోసం ఆయన శాయణ భాష్యాన్ని ఆధారంగా తీసుకున్నాడు. ప్రామాణికత పేరుతో శాయణ భాష్యాన్ని శంకించే పండితుల ప్రశ్నలకు ఈ కార్యం ద్వారా ఆయన సరియైన సమాధానాన్ని ఇచ్చాడు. ప్రొ॥విల్సన్ దృష్టిలో శాయణ భాష్యమే అన్నింటికంటే శ్రేష్ఠమైనది. 1830లో ఆయన మరణించే నాటికి ఆయన అనువదించిన ఋగ్వేద

**సమయం విలువ తెలుసుకోని వ్యక్తి జీవితంలో ఏమి చేయగలుగుతాడు?**

చతుర్థభాగంలోని కేవలం 108 భూమికలే ప్రచురింపబడినాయి. మిగిలిన కార్యాన్ని ఆయన సహచరుడు జనరల్ వేలంటైన్ కొనసాగించాడు. 1864లో వేలంటైన్ మృతి చెందిన తరువాత ప్రొ॥గోల్డ్ స్టకర్ ఇందులో సహకరించాడు. ఆ తరువాత ప్రొ॥డి.బి.కావేల్ ఈ కార్యక్రమాన్ని పూర్తి చేశాడు. అయితే విల్సన్ నుండి కావేల్ వరకు జరిగిన కృషికి వెబ్‌స్టరే అంతిమ రూపాన్నిచ్చాడు. విల్సన్ పూర్తిగా శాయణ భాష్యం మీద ఆధార పడడం వల్ల వెబ్‌స్టర్ విల్సన్ అనువాదాన్ని పరిశోధించేటపుడు ఆధునిక పండితుల సహాయాన్ని చాలా తక్కువగా తీసుకున్నాడు.

ప్రఖ్యాత వేదాధ్యయనవేత్త థియొడోర్ బేనఫ్ రాథ్ అనుయాయి. ఆయన ఋగ్వేద ప్రథమ మండలంలోని 130 మంత్రాలను జర్మనీ భాషలోనికి అనువదించాడు. 1862 - 64 మధ్య లిపిబద్ధంగా ఇది ప్రచురింపబడింది. అయితే బేనఫ్ వేదభాష్యం అతివాదంతో కూడుకున్నది. హెర్మాన్ గ్రాస్మాన్ కూడా రాథ్ శిష్యుడే. జర్మనీ నివాసి అయిన గ్రాస్మాన్ జర్మనీ భాషలోనికి దీనిని పద్యనువాదం చేశాడు. ఈ అనువాదం రెండు భాగాలుగా 1876-77లో ప్రచురింపబడింది. గ్రాస్మాన్ ఒక ఋగ్వేద నిఘంటువును కూడా జర్మనీ భాషలోనికి అనువదించాడు. ఈ శబ్ద నిఘంటువు 'వార్తవుచత్సుం ఋగ్వేద' పేరుతో 1873 - 75లో ప్రచురింపబడింది. గ్రాస్మాన్ రచనలను ప్రొ॥రేనో తరువాతి సమీక్షకు కూడా ప్రామాణికంగా గుర్తించాడు.

జర్మన్ నివాసి గోల్డ్‌నర్ కూడా రాథ్ శిష్యులలో ప్రముఖుడు. సంపూర్ణ ఋగ్వేదం జర్మన్ భాష అనువాదానికి ఇది చివరి మెట్టు. గోల్డ్‌నర్, అడాల్ఫ్ కేగీ సహాయంతో రాథ్ ప్రతిపాదించిన వేద వ్యాఖ్య సిద్ధాంతాన్ని పూర్తిగా ఉపయోగించుకుని ఋగ్వేద స్థాయి మంత్రాలను జర్మనీ భాషలో పద్యనువాదం చేశాడు. ఇది క్రీ.శ.1875లో ప్రచురింపబడింది. పూర్వీకులతో పోలిస్తే గోల్డ్‌నర్ అధిక నిజాయితీపరుడు. ఇతని మీద రాథ్ ప్రభావం ఏ మాత్రం లేదు. ఋగ్వేద పూర్ణరూపం భారతీయ రచన. అందువలన దాని వ్యాఖ్యానం కూడా భారతీయ పరంపరకు అనుగుణంగా ఉండాలనేది ఈయన అభిప్రాయం.ఈ ప్రభావం కారణంగానే గోల్డ్‌నర్ 1908లో ఋగ్వేదంలోని కొన్ని సూక్తులను స్వతంత్రంగా జర్మనీ భాషలోనికి అనువదించాడు.

లుడ్విగ్ కూడా రాథ్ శిష్యుడే. అయితే గోల్డ్‌నర్‌లాగా స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించకుండా రాథ్ పరంపరనే అనుసరించాడు. ఈయన సంపూర్ణ ఋగ్వేదాన్ని జర్మనీ భాషలోనికి అనువదించి విస్తృత వ్యాఖ్యానాన్ని, భూమికను కూడా రచించారు. ఈ సంపూర్ణ గ్రంథం 'డెర్ ఋగ్వేద్' పేరుతో ఆరు భాగాలుగా 1876 - 88 మధ్య ప్రచురితమైంది. ఇందులో మొదటి రెండు భాగాలు ఋగ్వేద సంపూర్ణ అనువాదం. మూడవ భాగం విస్తృత భూమిక. నాలుగు,ఐదు భాగాలు ఋగ్వేద అనువాద విశద వ్యాఖ్యానం. ఆరవ భాగంలో శబ్దార్థ సూచిక, వ్యాకరణ సంబంధ వ్యాఖ్య ఇవ్వబడ్డాయి.

పండిత జె.గ్రిల్ అధర్వణ వేదంలోని వంద సూక్తులను జర్మనీ భాషలోనికి వ్యాఖ్య సహితంగా అనువదించాడు. ఈ గ్రంథం 'హుండెటర్ట్ లీడర్ డేస్ ఆఫ్ అధర్వ వేద్' పేరుతో 1879 - 88 మధ్య ప్రచురించబడింది. ప్రఖ్యాత వేదపండితుడు ఎగ్‌లింగ్ శతపథ బ్రాహ్మణాన్ని అనువదించాడు. శతపథ బ్రాహ్మణంలోని మొదటి తొమ్మిది కాండలు యజుర్వేదం మొదటి 18 అధ్యాయాల రూపాంతరమే. అందువలన ఎగ్‌లింగ్ ఆంగ్లంలోకి అనువదించిన తొమ్మిది కాండలను యజుర్వేద అనువాదంగానే భావిస్తున్నారు. శేర్‌మన్ అధర్వణ వేదంలోని 11,13,19 కాండల నుండి ఎన్నుకున్న 13 దార్శనిక సూక్తులను జర్మనీ భాషలోనికి అనువదించాడు. క్రీ.శ.1886లో 'ఫిలాసఫిరో హీమ్నేన్ ఆవుస్ డేర్ ఋగ్వేద్ అండ్ అధర్వ వేద్' పేరుతో ఇది ప్రచురించబడింది. సి.ఎ.ఫోరెంజ్ అధర్వణ వేదం 6వ కాండం 1 నుండి 50 సూక్తులను జర్మనీ భాషలోనికి అనువదించాడు. 1887లో ఇది ప్రచురించబడింది.

వేదాధ్యయనంలో పండిత విక్టర్ హెన్రీ పేరు కూడా చెప్పుకోదగ్గది. ఆయన 12,13 కాండలను ఫ్రెంచి భాషలోనికి అనువదించాడు. ప్యారిస్‌లో 1891 - 96 మధ్య ఇది ప్రచురించబడింది. జర్మనీకి చెందిన ఓల్డెన్ వర్గ్ కూడా ఋగ్వేదం 130 సూక్తులకు విస్తృత వ్యాఖ్యానంతో పాటు ఆంగ్లంలో భాష్యం వ్రాశాడు. ప్రొ॥మాక్స్‌ముల్లర్ ప్రచురించిన 'సేక్రెడ్ బుక్స్ ఆఫ్ ద ఈస్ట్' గ్రంథాలలో 46వ భాగంగా ఇది ప్రచురించబడింది. ఈ వ్యాఖ్యానంలో ఆయన పూర్వ వేద భాష్యకారుల అభిప్రాయాలను కూడా ప్రస్తావించాడు. ఓల్డెన్ వర్గ్ జర్మన్ భాషలో కూడా ఋగ్వేదానికి పరిశోధనాత్మక భాష్యాన్ని రచించాడు. ఇది 'ఋగ్వేద్ నోటీస్' పేరుతో ప్రచురింపబడింది.

అమెరికాకు చెందిన మౌరిస్ బ్లూమ్‌ఫీల్డ్ అధర్వణ వేదంలోని ప్రథమ,ద్వితీయ,సప్తమ కాండాల నుండి ఎన్నుకున్న ఏడు సూక్తులను అనువదించాడు. తరువాత ఆయన అధర్వణ వేదంలోని మూడవ వంతు భాగాన్ని అనువదించి ప్రచురించాడు. ప్రఖ్యాత పండితుడు మెక్ డోనాల్డ్ శిష్యుడు కీథ్ కృష్ణ యజుర్వేద తైత్తరీయ సంహితను ఆంగ్ల భాషలోనికి అనువదించాడు. హార్వార్డ్ ఓరియంటల్ సిరీస్‌లో భాగంగా రెండు ఖండాలుగా ఇది ప్రచరించబడింది. దీని విస్తృత భూమికలో కీథ్ తైత్తరీయ సంహిత నుండి సంబంధిత భాష, విషయ వస్తువు మొదలైన వాటి మీద ప్రత్యేక దృష్టి నిలిపాడు.

వేద జ్ఞాన గౌరవాన్ని స్వీకరించే వారిలో కొన్ని పేర్లు ఇవి. వీరే కాకుండా ఇంకా చాలా మంది వేద జ్ఞానాన్ని ఆత్మావలోకనం చేసుకునే ప్రయత్నం చేశారు. వీరి ఈ ప్రయత్నాలన్నీ వేదాలు సర్వకాలికాలని, సర్వదేశీయాలని నిర్వివాదంగా ప్రకటిస్తున్నాయి. వీటిలో ఉత్పన్నమైన జ్ఞానసంపదని మానవత్వం కోసమే. సంపూర్ణ విశ్వ - వసుధ కళ్యాణం కోసమే. ఈ ఉత్కృష్ట ఉద్దేశ్యం కారణంగానే వేదాల నుండి ఉద్భవించిన భారతీయ సంస్కృతి విశ్వ సంస్కృతి రూపంలో గౌరవించబడుతోంది.

★★★

**నీ కర్తవ్యాన్ని చెయ్యి. ఫలితాన్ని దేవుడు ఇచ్చి తీరతాడు.**

# వార్తలు

## శాంతికుంజ్‌లో విశాఖపట్నం పరిజనులు

విశాఖపట్నం గాయత్రీ ప్రజ్ఞామండలి సభ్యుల బృందం శాంతికుంజ్ వెళ్లి, దేవీనవరాత్రుల సందర్భంగా అక్కడ జరిగిన అనుష్ఠానంలో పాల్గొన్నారు. సంకల్పం తీసుకునేముందు బృందం సభ్యులు మథురలోని గాయత్రీ తపోభూమినీ, ఆవల్‌ఖేడాలోని గురుదేవుల జన్మస్థలాన్నీ సందర్శించారు. శ్రీమతులు ఏ.సావిత్రి, బి.వసంతకుమారి, పి.కృష్ణవేణి, కుమారి ఎస్.రాజ్యలక్ష్మి, కుమారి వి.సరస్వతీదేవి, కుమారి ఏ.కవిత, కుమారి వి.శశికళ, శ్రీయుతులు బి.హేమచంద్రరావు, బి.ఎన్.రావు, కె.రామారావు, బి.బి.రాంలు బృందంలో ఉన్నారు.

నవరాత్రుల సందర్భంగా విశాఖపట్టణం కార్యాలయంలో యజ్ఞం జరిగింది. తగరపువలస నుండి వచ్చిన కుమారి బి.శ్యామల, కుమారి కె.సరస్వతి, కుమారి మాధవి సహకరించారు.

## శ్రీకాకుళంలో గాయత్రీ హవనం

నవరాత్రుల సందర్భంగా గాయత్రీ అనుష్ఠానం తర్వాత శ్రీకాకుళం పురుషోత్తంనగర్ కాలనీలో అక్టోబరు 5న గాయత్రీ హవనం జరిగింది. శ్రీ పి.వి.కృష్ణకుమార్, వారి సతీమణి శ్రీమతి మీనాబాయి హవనాన్ని నిర్వహించారు. శ్రీయుతులు హయగ్రీవరావు, రామారావు, ఎన్.కృష్ణమూర్తి, ఎమ్.ఆదినారాయణ, సాయన్న, అప్పారావు సహకరించారు.

అక్టోబరు 3న శ్రీకాకుళంలో శ్రీ పి.వి.కృష్ణకుమార్ గృహంలో గాయత్రీ హవనం జరిగింది.

## నెల్లూరు జిల్లాలో గాయత్రీ హోమాలు

నవరాత్రుల సందర్భంగా నెల్లూరు బైపాస్ రోడ్డులో శ్రీ మలిరెడ్డి నారాయణరెడ్డి, శైలజల గృహంలో సెప్టెంబరు 28న శ్రీటి.రమణమూర్తి గాయత్రీ హోమం జరిపారు.

అక్టోబరు 2న ఇందుకూరుపేట మండలంలోని కొత్తూరులో శ్రీటి.రమణమూర్తి గాయత్రీ హోమం నిర్వహించారు. శ్రీమతి ఉషా రమేష్ రెడ్డి, శ్రీకృష్ణయ్య సహకరించారు.

అక్టోబరు 3న నెల్లూరు రూరల్ మండలం కల్లూరుపల్లిలో శ్రీసింగంశెట్టి రామసుబ్బయ్య గృహంలో శ్రీటి.రమణమూర్తి గాయత్రీ హోమం జరిపారు. శ్రీమతి ఇసనాక సుబ్బమ్మ, జీళ్ల కవిత సహకరించారు.

★★★

## తన్మయత్వంనుండి కళా సృష్టి

కబీరు గాయకుడు. అతని కుమారుడు కమాల్ నర్తకుడు. ఇద్దరూ కలిస్తే పరిసరాలు పరవశించేవి. ఇంతటి అద్భుత నృత్యం కమాల్ ఎక్కడ నేర్చుకొన్నాడా అని కబీరుకు చాలా ఆశ్చర్యం కల్గుతూ ఉండేది. ఒకనాడు గడ్డి కోసుకొని రావటానికి వెళ్ళిన కమాల్ రాత్రి పొద్దుపోయేవరకూ ఇల్లు చేరకపోవటంతో కబీరు అతడిని వెతకటానికి బయలుదేరాడు. కొంత దూరం వెళ్ళి చూచేసరికి కోసిన గడ్డి పోగుపెట్టబడి ఉంది. చుట్టూ వాతావరణం అతి రమణీయంగా ఉంది. మలయమారుతం వీస్తోంది. సెలయేళ్ళు లయబద్ధంగా ప్రవహిస్తున్నాయి. వీచే గాలి, ప్రవహించే సెలయేటి గలగలలు, గాలికి ఊయలలూగే పచ్చగడ్డితో కలిసి కమాల్ తనను తాను మరచి ఆనందంతో నృత్యం చేస్తున్నాడు. అతనికి బాహ్యస్మృతి లేదు. ఆ స్థితిలో కొడుకుని చూచి ఈ తన్మయ స్థితే తన బిడ్డను ఇంతటి నాట్యాచారుణ్ణి చేసిందనే సత్యాన్ని కబీరు తెలుసుకున్నాడు.

శిల్పులు, చిత్రకారులు, కార్మికులు కాస్తకూడ చలించక, పూర్తి ఏకాగ్రతతో పనిలో లగ్నమవటం వలననే ఆకర్షణీయమైన సుందర ఆకృతులను సృష్టించగల్గుతున్నారు. వ్యక్తుల క్రియాకలాపాలు ఒకే విధమైనవి అయినప్పటికీ వాటి పరిణామాలు భిన్నంగా ఉండటానికి కారణం కొందరు పూర్తిగా పనిలో లీనమై ఆ పనియే తాముగా మారిపోవటం, మరికొందరు ఏదోవిధంగా తోచినట్లు చేస్తూ కాలాన్ని గడపటానికి ప్రయత్నించటం.

ఏనాడూ నిరాశకు లోను కాకుండా, సదా తత్పరతతో పనిలో లీనమై ఉండేవారిని కర్మయోగులని అంటారు. వారి చేతిలో ఏ పనినైనా పెట్టండి. అది పూర్ణమై అందమైన రూపు ధరించి తీరుతుంది. ఇటువంటి పురుషార్థ పరాయణులు తాము చేసే వృత్తి ఏదైనప్పటికీ దానిలో ఉచ్చస్థితిని చేరుకొని తమ జీవితాన్ని, వృత్తిని ధన్యం కావిస్తారు.

- ప్రజ్ఞాపురాణం నుండి

**దేవుని ముందు నిండు మనసుతో తప్పు ఒప్పుకుంటే దాని క్షాళన జరుగుతుంది.**